
అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శనివారం 21-01-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

కొత్త పార్లమెంట్ భవనం ముస్తాబు



వివరాలు 9లో..

సంపుటి : 8 | సంచిక : 336 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

గ్రామీణానికి సుస్తి

తగ్గిన వైద్య సిబ్బంది సంఖ్య

- సరిపడా వైద్యులు, నర్సులు లేక అవస్థలు
- దేశవ్యాప్తంగా ఆరోగ్య కేంద్రాల్లో ఇవే పరిస్థితులు
- ఆర్‌హెచ్ఎస్ 2020-21 సమాచారం

భారత్‌లో ఆరోగ్య రంగం ఇప్పటికే అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నది. ముఖ్యంగా గ్రామీణ భారతంలో ఇది కనిపిస్తున్నది. కరోనా మహమ్మారి కాలంలో ఇది స్పష్టంగా బయటపడింది. సరిపడా సిబ్బంది, మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ప్రజలు నానా నరకయాతనను అనుభవించారు. గ్రామీణ ప్రాంతాల్లో మానవ వనరులు తగ్గిపోయాయి. ముఖ్యంగా, గ్రామీణ ఆరోగ్య రంగంలో కీలక పాత్రను పోషించే ఆరోగ్య ఉప కేంద్రాలు (ఎస్‌సీలు), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు), కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లు (సీహెచ్‌సీలు)లు కిందటేడాది (2020-21) కంటే తక్కువ సిబ్బందితో పని చేశాయని 'గ్రామీణ ఆరోగ్య గణాంకాలు (ఆర్‌హెచ్ఎస్) 2021-22' లో తేలింది.





న్యూఢిల్లీ : ఆర్‌హెచ్ఎస్ 2021-22 ప్రకారం.. గతేడాది మార్చిలో ఉప కేంద్రాల్లో ఏఎన్ఎంల సంఖ్య 2,07,587గా ఉన్నది. 2021 మార్చిలో ఈ సంఖ్య 2,14,820గా ఉండటం గమనార్హం. అదే విధంగా, పీహెచ్‌సీలలో వైద్యుల సంఖ్య కూడా పడిపోయింది. 2021-22లో పీహెచ్‌సీలలో వైద్యుల సంఖ్య 30,640గా ఉన్నది. 2021లో ఈ సంఖ్య 31,716 గా ఉండటం గమనించాల్సిన అంశం. 2021-22లో భారత్ కరోనా మహమ్మారితో పోరాడుతున్న సమయంలోనే సిబ్బంది సంఖ్య కిందటేడాదితో పోలిస్తే పడిపోయింది. దేశానికి అంతపెద్ద ఉపద్రవం ముంచుకొస్తుందన్న విషయాన్ని పసిగట్టడంలో విఫలమైన మోడీ సర్కారు.. గ్రామీణ ఆరోగ్య రంగంలో వైద్య సిబ్బంది కొరతను పూడ్చలేకపోయిందని ఆరోగ్య రంగం నిపుణులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సంరక్షణ విషయంలో ఉప కేంద్రాల పాత్ర కీలకమైనది. ప్రతి ఐదు వేల మందికి ఉండే ఒక ఉప కేంద్రంలో ఒక ఏఎన్ఎం, ఒక పురుష హెల్త్‌కేర్ వర్కర్ ఉంటారు. ఆ తర్వాత పీహెచ్‌సీల వంతు. ప్రతి 30వేల మందికి ఉండే ఒక పీహెచ్‌సీలో నాలుగు నుంచి ఆరు బెడ్‌లు, ఒక వైద్యాధికారి ఇంచార్జీగా, సిబ్బంది ఉండాలి. గ్రామీణ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో అతి కీలకమైనది సీహెచ్‌సీ. ప్రతి 1.20 లక్షల మందికి ఒక సీహెచ్‌సీ ఉండాల్సి ఉన్నది. కేంద్ర ప్రభుత్వం పొందుపర్చిన నిబంధనల మేరకు సీహెచ్‌సీలలో తప్పనిసరిగా 30 బెడ్‌లు, లేబర్ రూమ్‌లు, ఆపరేషన్ థియేటర్లు, ప్రత్యేక సేవలు ఉండాలి. అయితే, గ్రామీణ భారతంలో క్షేత్రస్థాయిలో ఇవి పూర్తి విరుద్ధంగా ఉన్నాయని నిపుణులు చెప్పారు.

సీహెచ్‌సీ, పీహెచ్‌సీ లలో ల్యాబ్ టెక్నీషియన్ల సంఖ్య 2022లో స్వల్పంగా 50 మంది మాత్రమే పెరిగి 22వేల మందికి పైగా పని చేస్తున్నారు. నర్సింగ్ సిబ్బంది 79,044 మంది నుంచి 79,933 వరకు, రేడియో గ్రాఫర్ల సంఖ్య 2,418 నుంచి 2,448 వరకు స్వల్పంగా పెరిగాయి.

యూపీ, బీహార్, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో మాత్రం పరిస్థితులు మరింత కఠినంగా ఉన్నాయి. అక్కడ ప్రతి ఏడు వేల మందికి పైగా ప్రజలు ఒక ఎస్‌సీపై మాత్రమే ఆధారపడుతున్నారు. భారత్‌లోని పది రాష్ట్రాల్లోనూ ఇవే పరిస్థితులు ఉన్నాయి. ఇక యూపీ, బీహార్, జార్ఖండ్‌లతో పాటు పశ్చిమ బెంగాల్‌లో ప్రతి 50 వేల మందికి పైగా ప్రజలు ఒక పీహెచ్‌సీ పైనే ఆధారపడుతుండటం గమనార్హం. మరో ఐదు రాష్ట్రాల్లో ఈ సంఖ్య 30వేల నుంచి 50 వేల మధ్య ఉన్నది. కర్నాటక, ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, బీహార్, యూపీ వంటి రాష్ట్రాల్లో 2 నుంచి 5 లక్షల మంది ప్రజలు ఒక సీహెచ్‌సీపై ఆధారపడుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వాలు ముందుచూపుతో ఆలోచించి తగిన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో దేశ ప్రజలకు మరిన్ని ఇబ్బందులు ఎదురుకాక తప్పవని ఆరోగ్య నిపుణులు హెచ్చరించారు.

కార్మిక వర్గంపై దాడిని తిప్పికొట్టాలి

ఐక్య పోరాటాలతోనే సాధ్యం

- ఏప్రిల్ 5న కిసాన్ -మజ్దూర్ మార్చ్‌కు మద్దతు
- సీఐటీయూ అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ కె. హేమలత



బెంగళూరు నుంచి అచ్చిన ప్రశాంత్

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో కార్మికులపై దాడి తీవ్రతరం అవుతున్నదని సీఐటీయూ అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత అన్నారు. ఐక్య పోరాటాల ద్వారానే ఆ దాడిని తిప్పికొట్టగలమని ఆమె తెలిపారు. బెంగళూరులోని శ్యామల్ చక్రవర్తి నగర్‌లో (కామ్రేడ్ రంజనా నిరులా, రఘునాథ్ సింగ్ వేదిక) కొనసాగుతున్న సీఐటీయూ 17వ అఖిల భారత మహాసభ శుక్రవారం మూడో రోజుకు చేరుకుంది. ఈ మూడు రోజుల్లో చర్చించిన అంశాలను హేమలత మీడియాకు వెల్లడించారు. దేశంలోని కార్మిక సమస్యలతోపాటు, ప్రపంచ వ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటిపైనా మహాసభలో సుదీర్ఘంగా చర్చించామని తెలిపారు. ప్రపంచంలోని పెట్టుబడిదారి దేశాలన్నింటిలోనూ క్రమక్రమంగా కార్మికులపై దాడి పెరుగుతున్నదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా, ఫ్రాన్స్, యూకే, ఇటలీ, జర్మనీ...9లో

నూతన ఒరవడితో ముందుకు...



సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

శ్యామల్ చక్రవర్తి నగర్ నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

తెలంగాణలో నూతన ఒరవడితో ముందుకు సాగుతున్నామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. సీఐటీయూ అఖిల భారత మహాసభలో మూడో రోజైన శుక్రవారం ఆయన మాట్లాడారు. తెలంగాణలో...9లో

బీజేపీలో చేరండి.. లేదంటే సీఎం బుల్డోజర్ సిద్ధంగా ఉంది

కాంగ్రెస్ సభ్యులకు మధ్యప్రదేశ్ మంత్రి హెచ్చరికలు

- సోషల్ మీడియాలో వీడియో వైరల్




భోపాల్ : ప్రతిపక్ష నాయకులను ఉద్దేశించి... మధ్యప్రదేశ్ రాష్ట్ర మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో చేరాలనీ, లేకపోతే 'సీఎం బుల్డోజర్' కూల్చివేతలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. రుతియాయ్ పట్టణంలో జరిగిన ఓ బహిరంగ సమావేశంలో మధ్యప్రదేశ్ పంచాయతీ శాఖ మంత్రి మహేంద్ర సింగ్ సిసోడియా ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. "కాంగ్రెస్ సభ్యులారా... వినండి. బీజేపీలో చేరండి. ఇటువైపు (అధికార పార్టీ వైపు) నెమ్మదిగా మళ్లండి. 2023లో కూడా మధ్యప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుంది. మామ (సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్) గారి బుల్డోజర్ రెడీగా ఉన్నది" అని రఘోగర్ నగర్ నగరపాలిక ఎన్నికల ప్రచారంలో భాగంగా సిసోడియా అన్నారు. మంత్రి వ్యాఖ్యలపై రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ కూడా తీవ్రంగానే స్పందించింది. రఘోగర్ ప్రజలు ఇలాంటి బెదిరింపులకు భయపడేంత పిరికివారు కారని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యులు, ఆ రాష్ట్ర మాజీ...9లో

డ్రోన్‌తో రెండు మృతదేహాల గుర్తింపు

ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా అధికారుల నిర్ధారణ

- మరొకరి ఆచూకీ గల్లంతు
- సికింద్రాబాద్‌లో రెండో రోజూ శ్రమించిన రెస్క్యూ టీమ్స్

నవతెలంగాణ-సిటీబ్యూరో, బేగంపేట్
సికింద్రాబాద్ మినిస్టర్ రోడ్డులోని దక్కన్ స్పోర్ట్స్ నిట్‌వేర్ మాల్‌లో గురువారం జరిగిన అగ్నిప్రమాదం ఘటనలో ముగ్గురు మృతిచెందినట్టు అనుమానం వ్యక్తమవుతోంది. ప్రమాదం సమయంలో నలుగురిని అధికారులు రక్షించగా, బీహార్‌కు చెందిన ముగ్గురు కూలీలు జునైద్, వసీం, జహీర్ ఆచూకీ తెలియలేదు. శుక్రవారం మరోసారి సహాయక చర్యలు చేపట్టిన అధికారులు.. కూలీల సెల్‌ఫోన్ సిగ్నల్స్ ప్రమాదం జరిగిన భవనంలోనే చూపిస్తుండటంతో వారు సజీవ దహనయ్యే అవకాశముందని నిర్ధారణకు వచ్చారు. 22 అగ్నిమాపక వాహనాలతో మంటలను పూర్తిగా ఆర్పేసినప్పటికీ భవనంలో వేడి తీవ్రత అధికంగా ఉండటంతో రెస్క్యూ సిబ్బంది మాల్ లోపలకి వెళ్లలేకపోయారు. దాంతో శుక్రవారం డ్రోన్ కెమెరాలను పంపించి రెండు మృతదేహాలను గుర్తించినట్టు అధికారులు వెల్లడించారు. భవనం రెండో అంతస్తులో గుర్తుపట్టలేని స్థితిలో రెండు మృతదేహాలున్నాయని తెలుస్తోంది. ఇదిలా ఉండగా, అగ్నిప్రమాదంలో మొత్తం ముగ్గురు చనిపోయారని.. వీరి మృతదేహాలను అధికారులు...5లో



యోగికి షాక్

సీఏఏ నిరసనలను క్రూరంగా అణచివేశారు...

- వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌కు హాజరుకానున్న నేపథ్యంలో స్విట్జర్లాండ్ అటార్నీ జనరల్‌కు న్యాయవాదుల ప్రత్యేక బృందం ఫిర్యాదు



న్యూఢిల్లీ : యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌పై అంతర్జాతీయ క్రిమినల్, మానవహక్కుల న్యాయవాదుల ప్రత్యేక బృందం స్విట్జర్లాండ్ ఫెడరల్ ప్రాసిక్యూటర్ (అటార్నీ జనరల్)కు ఫిర్యాదుచేసింది. దావోస్‌లో నిర్వహిస్తున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌కు యోగి ఆదిత్యనాథ్ హాజరుకానున్న సంగతి తెలిసిందే. పౌరసత్వ సవరణ (సీఏఏ)కు వ్యతిరేకంగా శాంతియుతంగా ఆందోళన చేపడుతున్న నిరసనకారులపై 2019 డిసెంబర్ నుంచి 2020 జనవరి మధ్య యూపీలో క్రూరంగా జరిగిన దాడులపై ప్రత్యేక బృందం (గ్వార్నికా 37 ఛాంబర్) ఫిర్యాదు చేసింది. స్విస్ క్రిమినల్ కోడ్‌లోని ఆర్టికల్ 264 కింద సార్వత్రిక అధికార పరిధి సూత్రాన్ని పేర్కొంది. శాంతియుత నిరసనలను అణిచివేయడం మానవత్వ వ్యతిరేక నేరాలుగా పరిగణించబడుతుందని పేర్కొంది. యూపీ సీఎం, ఆయన పాలన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. సీఏఏ నిరసనలను అణచివేసేందుకు తప్పుడు జైలు శిక్ష, వేధింపులు, పౌరుల హత్యలకు యోగి ప్రభుత్వం ఆదేశించిందని పేర్కొంది. ముస్లిం కమ్యూనిటీపై విస్తృతంగా, క్రమబద్ధంగా దాడులు జరిగినట్లు వెల్లడించింది. ఆరు నెలల పాటు జరిగిన క్రూరమైన దాడుల్లో ముస్లిం కమ్యూనిటీకి చెందిన 22 మంది మరణించగా, 117 మందిని వేధించారనీ, 307 మందిని అకారణంగా నిర్బంధించారని...9లో

రోడ్డుపై రెజ్లర్ల రోదన

బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్‌పై చర్యలకు కేంద్ర ప్రభుత్వం వెనుకడుగు

- జంతర్‌మంతర్ వద్దే కుస్తీకి రెజ్లర్లు సిద్ధం
- ఏడుగురు సభ్యులతో ఐఓఏ కమిటీ
- మూడోరోజు కొనసాగిన రెజ్లర్ల ధర్నా

వివరాలు 2లో..



కామారెడ్డి, జగిత్యాల మాస్టర్ ప్లాన్లు రద్దు

మున్సిపల్ పాలకవర్గాల తీర్మానం

- ఫలించిన రైతుల, బాధితుల పోరాటం

వివరాలు 9లో..





27 నుంచి బదిలీలు, పదోన్నతులు

నేడు లేదా సోమవారం షెడ్యూల్ జారీ

- 37 రోజులపాటు వెబ్‌కౌన్సెలింగ్ నిర్వహణ
- విధివిధానాల రూపకల్పనపై విద్యాశాఖ కసరత్తు
- పారదర్శకంగా నిర్వహించాలి : అధికారులకు మంత్రి సబిత ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఈనెల 27 నుంచి ప్రారంభం కానుంది. ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు ఆదేశాలతో అందుకు సంబంధించి శుక్రవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో ఉన్న మంత్రి చాంబర్‌లో విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన, అదనపు సంచాలకులు లింగయ్యతో మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 27 నుంచి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించాలని కోరారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సమగ్ర షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని సూచించారు. అయితే బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన షెడ్యూల్ శనివారం లేదా సోమవారం విడుదల చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. 37 రోజులపాటు బదిలీల వెబ్‌కౌన్సెలింగ్‌ను నిర్వహించే అవకాశమున్నది. బదిలీలు, పదోన్నతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తారు. అయితే బదిలీలు వెబ్‌కౌన్సెలింగ్ ద్వారా, పదోన్నతులు ఆఫ్‌లైన్‌లో చేపడతారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు కసరత్తును వేగవంతం చేశారు.



హెచ్ఎంల బదిలీ గరిష్ట కాలపరిమితి 8 ఏండ్లకు పెంపు!

రాష్ట్రంలోని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల (హెచ్ఎం)కు తొలుత బదిలీల ప్రక్రియను నిర్వహిస్తారు. అయితే 2015, 2018లో నిర్వహించిన బదిలీల మార్గదర్శకాల్లో హెచ్ఎంల బదిలీల గరిష్ట కాలపరిమితి ఐదేండ్లు ఉన్నది. అంటే ...2లో

27 నుంచి బదిలీలు, పదోన్నతులు

(మొదటిపేజీ తరువాయి)

పాఠశాలలో ఐదేండ్ల సర్వీసు ఉన్న ప్రతి హెచ్‌ఎం తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. తాజా మార్గదర్శకాల్లో ఆ పరిమితిని ఎనిమిదేండ్లకు ప్రభుత్వం పెంచినట్టు విశ్వసనీయంగా తెలిసింది. హెచ్‌ఎంల బదిలీ గరిష్ట కాలపరిమితి ఐదేండ్ల నుంచి ఎనిమిదేండ్లకు పెంచాలన్న ఆలోచన సరైంది కాదని టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావ రవి, టీఎస్‌జీహెచ్‌ఎంఏ అధ్యక్షులు పి రాజభాను చంద్రప్రకాశ్ నవతెలంగాణతో చెప్పారు. ఈ నిర్ణయం వల్ల హెచ్‌ఎంలు నష్టపోతారని అన్నారు. ఐదేండ్ల సర్వీసు నిండిన వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి విద్యామంత్రి పి సబితా ఇంద్రారెడ్డి, కార్యదర్శి వాకాటి కరుణను రాజభాను చంద్రప్రకాశ్ కలిసి వినతిపత్రం సమర్పించారు. హెచ్‌ఎంల బదిలీల తర్వాత ఆయా ఖాళీల్లో స్కూల్ అసిస్టెంట్ల (ఎస్‌ఏ)కు పదోన్నతులు కల్పిస్తారు. అనంతరం ఎస్‌ఏల బదిలీలు చేపడతారు. ఆ తర్వాత సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ)కు పదోన్నతులు కల్పించి స్కూల్ అసిస్టెంట్ ఖాళీల భర్తీ చేస్తారు. అనంతరం ఎస్‌ఏ, ఎస్జీటీల ఖాళీల వివరాలను మరోసారి విద్యాశాఖ అధికారులు సేకరిస్తారు. వాటిని రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తారు. ఆర్థిక శాఖ ఆమోదం తర్వాత ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసే అవకాశమున్నట్టు తెలిసింది. రాష్ట్రంలో 2015 జులైలో బదిలీలు, పదోన్నతులు చేపట్టారు. 2018లో బదిలీలు నిర్వహించారు.

ఉద్యోగ విరమణకు మూడేండ్ల ముందు బదిలీలుండవు

ఉద్యోగ విరమణకు ఇంకా మూడేళ్ల సర్వీస్ మాత్రమే ఉన్నవారిని బదిలీ చేయొద్దని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది. ఇంతకుముందు రెండేళ్ల సర్వీస్ మాత్రమే మిగిలి ఉన్నవారికి బదిలీ నుంచి మినహాయింపు ఉండేది. ఉద్యోగ విరమణ వయస్సును 58 నుంచి 61 ఏండ్లకు పెంచినందున ఈ ఏడాది మూడేండ్ల సర్వీస్ మిగిలి ఉన్నా బదిలీ చేయొద్దని ప్రాథమిక నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. బదిలీకి దరఖాస్తు చేసుకునేందుకు కనీసం రెండేండ్ల సర్వీసు ఉండాలన్న నిబంధన 2015, 2018లో ఉన్నది. అయితే జీరో సర్వీసుతో ఉపాధ్యాయులందరికీ బదిలీ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని ఉపాధ్యాయ సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. మార్గదర్శకాల్లో రెండేండ్ల సర్వీసుతో ఉన్న వారికే అవకాశం కల్పిస్తారా? లేదా జీరో సర్వీసుతో ఉన్న వారిని పరిగణనలోకి తీసుకుంటారా? అన్నది వేచిచూడాల్సిందే.

రోడ్డుపై రెజ్లర్ల రోదన

నవతెలంగాణ-న్యూఢిల్లీ

విశ్వక్రీడా యవనికపై పతకాలు గెలిచి, యావత్ దేశం గర్వపడేలా చేసిన మల్లయోధులు దేశ రాజధానిలో మౌనంగా రోదిస్తున్నారు. మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై చర్యలు తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం సిద్ధంగా లేదు!. రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌పై చట్టపర చర్యలతో పాటు ప్రస్తుత రెజ్లింగ్ సమాఖ్య పాలక వర్గాన్ని రద్దు చేయాలని భారత రెజ్లింగ్ క్రీడాకారులు జంతర్‌మంతర్ వద్ద వరుసగా మూడోరోజు ధర్నా చేశారు.

ఇక్కడే ప్రాక్టీస్ చేస్తాం : రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై చట్టపర చర్యలు తీసుకునే వరకు రెజ్లర్ల ఆందోళన కొనసాగుతుందని వినేశ్ ఫోగట్ తెలిపింది. గురువారం రాత్రి క్రీడా మంత్రి అనురాగ్ ఠాకూర్‌తో సమావేశమైన రెజ్లర్లు, శుక్రవారం సాయంత్రం మరోసారి భేటీ అయ్యారు. బ్రిజ్‌భూషణ్‌పై చర్యలకు స్పష్టమైన హామీ లభించకపోవటంతో రెజ్లర్లు ఆందోళన కొనసాగించేందుకు నిర్ణయించారు. 'బ్రిజ్‌భూషణ్ లైంగిక వేధింపులకు సంబంధించి మా దగ్గర ఆధారాలు ఉన్నాయి. యువ రెజ్లర్లు చాలా మంది మాతో ఈ విషయాన్ని పంచుకున్నారు. బాధిత రెజ్లర్ల కుటుంబాల కోసమే వివరాలను బహిర్గతం చేయటం లేదు. మహిళా రెజ్లర్ల భవిష్యత్ కోసమే ఈ పోరాటం. జంతర్‌మంతర్‌కు రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫీస్ 100 మీటర్ల దూరం. మూడు రోజులుగా ధర్నా చేస్తున్నా ఎవరూ ఇక్కడికి వచ్చి సమాధానం చెప్పే ప్రయత్నం చేయలేదు. బ్రిజ్‌భూషణ్‌ను పదవి నుంచి తప్పించాలి. ఈ సమస్యకు పరిష్కారం చూపాలి. లేదంటే జంతర్‌మంతర్‌కు కుస్తీ మ్యాట్లతో వస్తాం, ఇక్కడే కుస్తీ సాధన చేస్తామని' వినేశ్ ఫోగట్ తెలిపింది. రెజ్లింగ్ సమాఖ్య ఉపాధ్యక్షుడి లైంగిక వేధింపులపై ఓ యువ రెజ్లర్ 30 నిమిషాల ఆడియో సైతం ఉందని ఫోగట్ భావోద్వేగంగా వెల్లడించింది.

ఏడుగురు సభ్యులతో ఐఓఏ కమిటీ : రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడిపై లైంగిక ఆరోపణల కింద చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐదుగురు స్టార్ రెజ్లర్లు భారత ఒలింపిక్ సంఘానికి లేఖ రాశారు. వినేశ్ ఫోగట్, బజరంగ్ పూనియా, సాక్షి మాలిక్, రవి దహియా, దీపక్ పూనియాలు ఐఓఏకు లేఖాస్త్రం సంధించారు. అత్యవసరంగా సమావేశమైన ఐఓఏ ఎగ్జిక్యూటివ్ కమిటీ రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడిపై ఆరోపణలను విచారించేందుకు ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీని నియమించింది. మేరీకోమ్, డోలా బెనర్జీ, అలకనంద అశోక్, యోగేశ్వర్ దత్, సహదేవ్ యాదవ్ సహా ఇద్దరు న్యాయవాదులు కమిటీ సభ్యులుగా ఉంటారు. సమస్యకు ఇరువైపులా విచారణ జరిపి త్వరగా నివేదిక ఇవ్వాలని ఐఓఏ ఆదేశించింది. ఇదిలా ఉండగా, భారత స్టార్ రెజ్లింగ్ క్రీడాకారులు మూడురోజులుగా ధర్నాకు దిగినా.. బ్రిజ్‌భూషణ్‌ను పదవి నుంచి తప్పుకోవాలని ఆదేశించేందుకు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకత్వం సిద్ధంగా ఉన్నట్టు కనిపించటం లేదు. కుస్తీ యోధుల ఆందోళనపై ప్రతి విమర్శలు చేసేందుకు బీజేపీ సోషల్ మీడియా వెనుకాడటం లేదు. నిరసనల నేపథ్యంలో భారత రెజ్లింగ్ సమాఖ్య ఏజీఎం జనవరి 22న నిర్వహించనున్నారు. సమావేశంలో తాజా పరిణామాలపై చర్చించి, ఓ ప్రకటన చేసేందుకు బ్రిజ్‌భూషణ్ సిద్ధమవుతున్నాడు.

జెట్ ఫ్రైట్ లాజిస్టిక్ రైట్స్ ఇష్యూ షురూ..

హైదరాబాద్ : జెట్ ఫ్రైట్ లాజిస్టిక్ లిమిటెడ్ రూ.37.70 కోట్ల రైట్స్ ఇష్యూ శుక్రవారం ప్రారంభించింది. త్వరగా పాడయ్యే లక్షణాలున్న సరుకు రవాణలో విశిష్టత కలిగిన ఈ సంస్థ విస్తరణ ప్రణాళికల కోసం నిధులను సమీకరించాలని నిర్ణయించింది. గోదాముల కొనుగోలు, వర్కింగ్ కాపిటల్ తీర్చుకోవడం, కొత్త ప్రాంతాల్లోకి ప్రవేశించడానికి ఈ నిధులను ఉపయోగించనున్నట్లు పేర్కొంది. ఈ రైట్స్ ఇష్యూ జనవరి 31న ముగియనుంది. రూ.5 ముఖ విలువ కలిగిన 2,32,01,892 ఫుల్లీ పెయిడ్ అప్ ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. ఒక్కో ఈక్విటీ షేర్‌ను రూ.16.25కు జారీ చేయనుంది.

ప్రభుత్వ పాఠశాలలకు పిఎన్‌బి మద్దతు



హైదరాబాద్ : కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్‌ఆర్)లో భాగంగా జెకెఎంఆర్ ఫౌండేషన్‌కు పంజాబ్ నేషనల్ బ్యాంక్ సాయం అందించింది. చేవెళ్ల ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో శుభ్రత లేని మూత్రశాలల వల్ల చాలా మంది పిల్లలు స్కూళ్ల నుంచి డ్రాపవుట్లుగా మారుతున్నారు. అలాంటి పాఠశాలల్లో టాయిలెట్లను శుభ్రంగా ఉంచడానికి జెకెఎంఆర్ ఫౌండేషన్‌కు సిఎస్‌ఆర్ కింద మొబైల్ క్లీనింగ్ ట్రక్కులను అందించింది. వీటిలో నీటి ట్యాంక్, ప్రెజర్ పంప్ ఇతర పరికరాలు ఉంటాయి. ఇలాంటి రెండు మినీ మొబైల్ క్లీనింగ్ ట్రక్కులను జెకెఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధులకు పిఎన్‌బి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కల్యాణ్ కుమార్, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు మక్సూద్ అలీ, ఎస్‌విఎస్‌పి రెడ్డి అందజేశారు.

2030 నాటికి రూ.36,300 కోట్లు

రాష్ట్రంలో అమెజాన్ భారీ పెట్టుబడులు

- స్వాగతించిన మంత్రి కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అమెజాన్ వెబ్ సర్వీసెస్ విస్తరణ, అదనపు పెట్టుబడి ప్రకటనను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే.తారకరామారావు స్వాగతించారు. ఆ సంస్థ ఏషియా పసిఫిక్ రీజియన్ కేంద్రంగా ఉన్న హైదరాబాద్‌లో 2030 నాటికి రూ.36,300 కోట్లు పెట్టుబడిగా పెట్టేందుకు ముందుకు రావడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. హైదరాబాద్ ఇంటర్‌నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఎంపవర్ ఇండియా ఈవెంట్‌లో దావోస్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ప్రసంగించారు. ఆ సంస్థ భారీ పెట్టుబడులతో డేటా సెంటర్ ప్రధాన కేంద్రంగా తెలంగాణ మారుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అమెజాన్, తెలంగాణ మధ్య మంచి సంబంధాలు న్నాయన్నారు. సంస్థ విస్తరణ ప్రణాళికలకు తమ సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. ఇండియాతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ వినియోగదారులకు అత్యుత్తమ క్లౌడ్ సేవలను అందించాలన్న లక్ష్యంలో భాగంగా హైదరాబాద్ చందన్‌వెల్లి, ఫ్యాబ్ సిటీ, ఫార్మా సిటీలో మూడు డేటా సెంటర్లను అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఏర్పాటుచేసింది. ఈ మూడు డేటా సెంటర్ల మొదటి దశ పూర్తికాగా, వినియోగదారులకు పూర్తిస్థాయిలో క్లౌడ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ మూడు డేటా సెంటర్లలో మొదట (2020 సంవత్సరంలో) రూ.20,096 కోట్ల పెట్టుబడిగా పెట్టాలనుకుందని తెలిపారు. విస్తరణ ప్రణాళికలు, వ్యాపార వ్యూహాల్లో భాగంగా దశల వారీగా రూ.36,300 కోట్ల పెట్టుబడిగా పెట్టాలని ఆ సంస్థ తాజాగా నిర్ణయించుకుంది. అమెజాన్ సంస్థకు పెట్టుబడుల గమ్యస్థానంగా ముందునుంచి హైదరాబాద్ ఉంది. ప్రపంచంలోనే తన అతిపెద్ద వెబ్ సర్వీసెస్ క్యాంపస్‌తో పాటు ఫుల్ ఫిల్మెంట్ సెంటర్‌లు రెండింటిని హైదరాబాద్‌లోనే అమెజాన్ ఏర్పాటు చేసింది. ఇక ఆ సంస్థ వెబ్ సర్వీసెస్ అందించే క్లౌడ్ కంప్యూటింగ్ సేవలను తెలంగాణ ప్రభుత్వం ఉపయోగించుకుంటుంది. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన మంత్రి హైదరాబాద్ డేటా సెంటర్లలో పెట్టుబడులను అమెజాన్ విస్తరిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలోకి వస్తున్న అతిపెద్ద ఎఫ్‌డీఐలలో ఇదొకటన్నారు. ఇ-గవర్నెన్స్, హెల్త్‌కేర్, పురపాలక కార్యకలాపాలను మెరుగు పరచడానికి ఏడబ్ల్యుఎస్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. హైదరాబాద్ లోని అమెజాన్ వెబ్ సర్వీసెస్ క్యాంపస్‌లతో ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలతో పాటు స్టార్టప్‌లకు ప్రయోజనం కలుగుతుందన్న నమ్మకం తనకు ఉందన్నారు.

ఎన్‌ఎల్‌సి ఇండియా సిఎండిగా ప్రసన్న కుమార్



హైదరాబాద్: ఎన్‌ఎల్‌సి ఇండియా లిమిటెడ్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి)గా ప్రసన్న కుమార్ మోటుపల్లి బాధ్యతలు స్వీకరించారు. ఇంతక్రితం ఆయన గుజరాత్ స్టేట్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యా సంస్థ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్‌లో గోల్డ్ మెడల్ పొందారు. విద్యుత్, బొగ్గు రంగాల్లో ఆయనకు మూడు దశాబ్దాల పైగా విశేష అనుభవం ఉంది. ఎన్‌టిపిసిలో ప్రసన్న కుమార్ తన కెరీర్‌ను ప్రారంభించారు. తమిళనాడులోని నైవేలీలోని కంపెనీ కార్పొరేట్ ఆఫీసులో నూతన బాధ్యతల స్వీకరణ సమయంలో ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

జక్కి శ్రీకాంత్‌కు జాతీయ యువజన అవార్డు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల నుంచి జాతీయ యువజన అవార్డును వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామానికి చెందిన జక్కి శ్రీకాంత్ పొందారని యువజన సర్వీసుల శాఖ కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12నుంచి 16వరకు కర్నాటకలో జరిగిన యువజన వారోత్సవాల్లో శ్రీకాంత్... ఆ రాష్ట్ర గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్,సీఎం బసవరాజ బొమ్మై, కేంద్ర యువజన వ్యవహారాల మంత్రి అనురాగ్ ఠాగూర్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారని తెలిపారు.

కృష్ణా జలాలపై మార్చి 14కి విచారణ వాయిదా

న్యూఢిల్లీ : కృష్ణా జలాల పంపకంపై దాఖలైన పిటిషన్ల విచారణను సర్వోన్నత న్యాయస్థానం మార్చి 14కి వాయిదా వేసింది.కృష్ణా జలాల పంపకంపై కర్నాటక 2014లో దాఖలు చేసిన ఒరిజినల్ పిటిషన్ తో పాటు వ్యాజ్యకాలీన దరఖాస్తు(ఐఏ)పై జనవరి 10, 11ల్లో సుప్రీంకోర్టులో సుదీర్ఘ వాదనలు కొనసాగాయి. తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల తరపు న్యాయవాదులు ఆయా రాష్ట్రాల వాదనలు వినిపించారు. తాజాగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి. రామసుబ్రమణియన్ తో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం పిటిషన్ల విచారణను చేపట్టాయి. ఇతర పిటిషన్ల విచారణలో తలమునకలుగా ఉన్నందున తరువాత విచారణ చేపడతానని జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. ఈదశలో కర్నాటక, మహారాష్ట్ర తరపు సీనియర్ న్యాయవాదులు శ్యాం దివాన్, నఫడే త్వరగా కేసు విచారణను పూర్తి చేయాలనీ, ఏండ్ల తరబడి న్యాయస్థానంలో కేసు ఉండిపోతోందని తెలిపారు. తమకు తగిన సమయం కేటాయించాలని తెలంగాణ తరపు సీనియర్ న్యాయవాది సిఎస్ వైద్యనాథన్ కోరారు. అవసరమైన వివరాల అందజేతకు, తమ వాదనలు వినిపించేందుకు సిద్ధమేనని కేంద్రం తరపు న్యాయవాదులు తెలిపారు. ఈ దశలో జోక్యం చేసుకున్న జస్టిస్ వి. సూర్యకాంత్ మార్చి 14 నుంచి ఐఏతో పాటు ఒరిజినల్ పిటిషన్ విచారణ చేపడతామంటూ కేసు విచారణను వాయిదా వేశారు.

ప్రోకెమ్‌లో తపస్య విలీనం

హైదరాబాద్ : ప్రోకెమ్ లో తపస్య విలీనం అయ్యింది. వివిధ డొమైన్‌ల కోసం ఏపీఐ పౌడర్ హ్యాండ్లింగ్ సొల్యూషన్స్‌లో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రోకెమ్ ఫార్మా డివిజన్‌లో గ్రాన్యులేషన్‌లో ఫార్మాస్యూటికల్, న్యూట్రాస్యూటికల్, ఫుడ్ ఇండస్ట్రీలకు సాలిడ్ ఫార్ములేషన్‌లను అందించే సింగిల్-స్టాప్ సొల్యూషన్ ప్రొవైడర్ అయిన తపస్యతో విలీనమయినట్లు ఇరు సంస్థలు శుక్రవారం హైదరాబాద్‌లో ప్రకటించాయి. దీని వలన కంపెనీలు ఫార్మా, ఫుడ్ ఇండస్ట్రీకి ప్రముఖ వన్-స్టాప్ సొల్యూషన్‌గా ఉద్భవించటానికి మిశ్రమ నైపుణ్యం, తయారీ బలాలను ఉపయోగించుకునేలా చేస్తుందని పేర్కొన్నాయి. "ఈ విలీనమైన అవకాశాల గురించి నేను నిజంగా సంతోషిస్తున్నాను. మేము కలిసి మా క్లయింట్‌లకు నిలువుగా, మెరుగైన పనితీరు , విశ్వసనీయతను అందించే వినూత్న పరిష్కారాలను అందించగలుగుతాము. మేం కొనసాగిస్తున్న 'మేక్ ఇన్ ఇండియా' విజన్‌కు ప్రతిబింబంగా, మరింత బలపడేందుకు, మెరుగైన ప్రభావాన్ని చూపేందుకు ఎదగగలం" అని ప్రోకెమ్ డైరెక్టర్ శశి రాయ్ అన్నారు.

ప్రభుత్వానికి బీఎన్ తిమ్మాపురం నిర్వాసితుల డెడ్‌లైన్

- రేపటిలోగా సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం
- పరిహారం విషయం తేల్చాకే ప్రాజెక్టు పనులు: వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు
- నిర్వాసితుల పాదయాత్ర, కలెక్టరేట్ ఎదుట మహాధర్నా



నవతెలంగాణ- భువనగిరి

బస్వాపురం ప్రాజెక్టులో ముంపునకు గురవుతూ సర్వం కోల్పోతున్న బీఎన్ తిమ్మాపురం గ్రామ నిర్వాసితుల సమస్యలను రేపటి లోగా పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వారి సమస్యలను పరిష్కరించిన తర్వాతే ప్రాజెక్టు పనులు చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం బస్వాపురం ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న తిమ్మాపురం భూనిర్వాసితుల కమిటీ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం వద్ద 48 గంటల మహాధర్నా చేశారు. అక్కడే వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పిన్నం లతారాజు, ఎంపీటీసీ ఉడత శారద ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ అధ్యక్షతన నిర్వహించిన సభలో వెంకట్రాములు మాట్లాడుతూ.. తిమ్మాపూర్ గ్రామస్తులు బస్వాపురం ప్రాజెక్టులో సర్వం కోల్పోతున్నారని వారిని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం 52 రోజులుగా ప్రాజెక్టు క్యాంపు కార్యాలయం దగ్గర కరకట్టపై నిరసన దీక్ష చేపట్టినా ప్రభుత్వంగానీ జిల్లా యంత్రాంగంగానీ ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. నిర్వాసితుల పట్ల నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్చలకు పిలిచి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలు కోల్పోతున్న వారందరికీ 250 గజాల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కుటుంబంలోని ప్రతి సభ్యునికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలన్నారు.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్, పీసీసీ కార్యదర్శి తంగళ్ళపల్లి రవికుమార్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏషాల అశోక్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ధర్నాకు మద్దతు తెలిపి మాట్లాడారు. జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన నిర్వాసిత గ్రామవాసులందరికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలన్నారు. 2009లో ప్రకటించిన ఈ ప్రాజెక్టుకు ఫిబ్రవరి 2019లో 1724 ఎకరాల భూములు తీసుకుని నేటివరకు పూర్తి స్థాయిలో నష్ట పరిహారం అందించలేదన్నారు. నిధులు మంజూరైనట్టు చెబుతున్నా ఇవ్వడం లేదన్నారు. గ్రామంలో చదువుకున్న యువతీయువకులకు డ్యాంలో, యాదాద్రి దేవాలయంలో ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. పట్టా భూములకు, ప్రభుత్వ భూములకు ఒకేసారి నష్టపరిహారం కింద డబ్బులు చెల్లించాలన్నారు. వ్యవసాయ కూలీలందరికీ 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలన్నారు.

వృత్తిదారులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు అన్ని విధాలా ఆదుకోవాలని, లేకపోతే రాజకీయ పార్టీలకతీతంగా ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తామని హెచ్చరించారు. జెడ్పీటీసీ బీర్.మల్లయ్య, ఎంపీపీ నరాల నిర్మల వెంకటస్వామి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మెన్, డైరెక్టర్ ఎడ్ల సత్తిరెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ ఎడ్ల దర్శన్‌రెడ్డి, మాజీ గ్రామ సర్పంచ్ రావుల అనురాధ నందు, మాజీ ఎంపిటిసి జిన్న మల్లేష్, సుదగాని ఫౌండేషన్ చైర్మెన్ సుధాగాని హరిశంకర్‌గౌడ్, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాటూరి బాలరాజ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కల్లూరి మల్లేష్, ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ, బీఎస్పీ రాష్ట్ర నాయకులు బట్టు రామచంద్రయ్య, పెద్దఎత్తున రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణా కార్యక్రమాలు భేష్...

- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఆరోగ్య సంరక్షణా కార్యక్రమాలు బాగున్నాయని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటి తెలిపింది. శుక్రవారం ఆరోగ్యం, కుటుంబ సంక్షేమంపై పార్లమెంటరీ స్థాయి స్టాండింగ్ కమిటీ అధ్యయనం నిమిత్తం హైదరాబాద్ పర్యటనకు వచ్చింది. పార్లమెంటరీ కమిటీ సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో రాష్ట్రంలో అమలవుతుస్తున్న ఆరోగ్య సంరక్షణ, నిర్వహణ చర్యలు, ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ అమలు కార్యక్రమాలపై సమీక్షించారు. భువనేశ్వర్ కలితా నేతృత్వంలోని కమిటీ ఆరోగ్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ప్రభుత్వ నిర్వహణా కార్యక్రమాల గురించి వివరించారు. ప్రతి జిల్లాలో వైద్య కళాశాలలు ఏర్పాటు చేయటం ద్వారా రాష్ట్రంలో ఆరోగ్య మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తున్నదని వివరించారు. వైద్య కళాశాలల నిమిత్తం ప్రభుత్వం భారీ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను చేపట్టినట్టు కమిటీకి తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్ పథకం ద్వారా గర్భిణులకు ఆర్థిక సాయం, ఇతర ఆరోగ్య సంబంధిత పథకాల వివరాలను కమిటీకి తెలియజేశారు. కంటి వెలుగు కార్యక్రమం ద్వారా "అంధత్వ రహిత తెలంగాణ" కోసం ప్రభుత్వ లక్ష్యంగా కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు ఆమె పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ పథకాల అమలుతీరుపై పార్లమెంటరీ కమిటీ సభ్యులు ప్రశంసించారు . ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కొనియాడారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి రిజ్వీ, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ శ్వేతా మహంతి, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్‌ప్లాన్ రద్దుపై 'బండి' హర్షం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కామారెడ్డి, జగిత్యాల మాస్టర్ ప్లాన్ రద్దు చేయడంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. దీన్ని సాధించిన ఆయా జిల్లాల రైతుల ఉద్యమ స్ఫూర్తికి అభినందనలు తెలిపారు. బీఆర్ఎస్ సర్కార్‌ను తరిమికొట్టేదాకా ఇదే ఉద్యమస్ఫూర్తిని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్ అప్పుల పాలన ఇలాగే కొనసాగితే తెలంగాణ మరో శ్రీలంక, పాకిస్తాన్ మాదిరిగా మారే దుస్థితి ఏర్పడుతుందన్నారు.

23న టీడీపీ రాష్ట్ర విస్తృతస్థాయి భేటి

- అందరూ హాజరు కావాలి:కాసాని

నవతెలంగాణ-హైదరాబాద్

తెలుగుదేశం తెలంగాణ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం నెల 23వ తేదీన నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని రాష్ట్ర పార్టీ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఈ సమావేశం జరుగుతుందని చెప్పారు. తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర అనుబంధ సంఘాల పూర్తి కార్యవర్గం, పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు, కో-ఆర్డినేటర్లు, త్రిమెన్, ఫైవ్ మెన్ కమిటీ సభ్యులను ఈ సమావేశానికి ఆహ్వానించినట్టు జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. ప్రతి ఆహ్వానితుడూ సమావేశానికి తప్పనిసరిగా హాజరవ్వాలని సూచించారు. త్వరలో తెలంగాణ వ్యాప్తంగా చేపట్టనున్న ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం, పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ వేగవంతం, పార్టీ సంస్థాగత నిర్మాణం, తదితర అంశాలపై రాష్ట్ర పార్టీ విస్తృత స్థాయి భేటిలో ప్రధాన ఎజెండాగా చేపట్టనున్నట్టు పేర్కొన్నారు.

రంజాన్‌లోగా మక్కా మసీదు పనులు పూర్తి చేయాలి.

- ఎ కే. ఖాన్‌కు పరిశీలన బాధ్యతలు:మంత్రి కొప్పుల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రంజాన్‌లోగా మక్కా మసీదు పనులు పూర్తి చేయాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో క్రిస్టియన్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వచ్చే నెల 15నాటికి క్రిస్టియన్ భవన్ టెండర్లు పూర్తి చేయాలన్నారు. పది కోట్లతో క్రిస్టియన్ భవన్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఫారీన్ మోడల్‌లో క్రిస్టియన్ భవన్ నిర్మాణాన్ని చేపట్టాలని సూచించారు. ఇందుకు సంబంధించి మోడళ్లను మంత్రి పరిశీలించారు. రంజాన్ నాటికి మక్కామసీదుతో పాటు జామియానిజామియా, అనిగుల్ గుర్బా మరమ్మత్తు, పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని సూచించారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రుణాలు మంజూరు అంశంపై చర్చించారు. ఇప్పటి వరకు రెండు లక్షల దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పనుల పరిశీలన బాధ్యతలు ప్రభుత్వ సలహాదారు ఎ.కే. ఖాన్ చూస్తారని తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు ఎకే ఖాన్, వక్ఫ్ బోర్డు చైర్మెన్ మసి ఉల్లాఖాన్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ ఇంతియాజ్ ఇషాక్, మైనార్టీ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, ఎండి కాంతి వెస్లీ, డైరెక్టర్ షఫీవుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సమస్యతో ఇద్దరి ఆత్మహత్య

నవతెలంగాణ -చిట్యాల

ఆర్థిక సమస్యలు కుటుంబాన్ని చిదిమేశాయి. పురుగుల మందు తాగి దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన శుక్రవారం నల్లగొండ చిట్యాల మండలంలోని పిట్టంపల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పిట్టంపల్లి గ్రామానికి చెందిన పసునూరి వెంకన్న(57) 20 ఏండ్ల కిందట భార్య కొడుకు, కుమార్తెను వదిలేసి హైదరాబాద్‌కు వెళ్లాడు. తనకు వరుసకు మరదలైన పసునూరి ధనలక్ష్మిని(45) వెంట తీసుకెళ్లాడు. వారికి ఇద్దరు కుమారులు సంతానం. ఇటీవల ఆర్థికపరమైన ఇబ్బందులు తలెత్తడంతో గురువారం రాత్రి వారు వెలిమినేడు గ్రామ సరిహద్దుల్లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నామని ఫోన్ ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే పిట్టంపల్లి గ్రామస్తులకు తెలియజేశారు. గ్రామంలో, చుట్టుపక్కల గాలించినా రాత్రి కావడంతో వారి ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో సమీపంలోని కోంటుగుట్ట వద్ద ఇద్దరి మృతదేహాలను గుర్తించారు. మృతుడు పసునూరి వెంకన్న కుమారుడు అవినాష్ ఆ మృతదేహాలను గుర్తించాడు. ఎస్ఐ ధర్మ కేసు నమోదు చేసుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. గ్రామస్తుల ఆర్థిక సహాయంతో అంత్యక్రియలు నిర్వహించారు.

రాష్ట్రంలో అనాథలెంతమందో తేల్చాలి

అనాథల హక్కుల పోరాట వేదిక ఆవిర్భావం: మంద కృష్ణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో అనాథలెంతమంది ఉన్నారో తేల్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎంఆర్‌పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఎంవి ఫౌండేషన్ అధ్యక్షులు ఆర్ వెంకట్ రెడ్డితో కలిసి శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'అనాథల హక్కుల పోరాట వేదిక'ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ అనాథల సమస్యలను పరిష్కరించటానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రి వర్గ ఉప సంఘం సిఫార్సులను వెంటనే అమలు చేయాలన్నారు. లేదంటే అన్ని రాజకీయ పార్టీలను ఏకం చేసి, రాజకీయ పోరాటానికి సిద్ధం కానున్నట్టు తెలిపారు. విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అనాథలకు ఐదు శాతం రిజర్వేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం లాగానే అనాథ వివక్షత నిరోధక చట్టాన్ని తీసుకు రావాలని కోరారు. అనాథల సమస్యల పరిష్కారానికి 2022 జనవరి 8న మంత్రివర్గ ఉప సంఘం సిఫార్సు చేసిన స్మార్ట్ కార్డు మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు ప్రారంభించాలన్నారు. 2015లో సీఎం కేసీఆర్ హామీ ఇచ్చినట్టుగా రాష్ట్రవ్యాప్తంగా అనాథలకు రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 23న రాజకీయ పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం, 30న ధర్నా చౌక్‌లో మహాదీక్ష చేపడుతున్నట్టు ప్రకటించారు.

బీజేపీ చీలిక సిద్ధాంతాన్ని అడ్డుకుంటాం

- ప్రతిపక్షాల ఐక్యత కోసం కాంగ్రెస్ కృషి: ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి తారిక్ అన్వర్ వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దేశంలో బీజేపీ చీలిక సిద్ధాంతాన్ని అడ్డుకుంటామని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి తారిక్ అన్వర్ చెప్పారు. ప్రతిపక్షాలన్నీ చీలిపోకుండా ఐక్యత కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలో ఎంఐఎం బీజేపీకి బీటీమ్‌గా మారిందనీ, అది ఎట్టి పరిస్థితుల్లోనూ పొత్తు ఉండదని తెలిపారు. భారత్ జోడో యాత్ర లక్ష్యాలు నెరవేరే వరకు కాంగ్రెస్ ప్రయత్నం కొనసాగుతుందని తెలిపారు. బీజేపీకి మేలు చేయడమే ఎంఐఎం పని పెట్టుకుందని ఎద్దేవా చేశారు. భారత్ జోడో యాత్ర స్ఫూర్తిని దేశంలో ప్రతీ గ్రామానికి తీసుకెళ్లేందుకే 'హాత్ సే హాత్ అభియాన్ యాత్ర' కొనసాగిస్తామన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, పార్టీ నేతలు షబ్బీర్ అలీ, చిన్నారెడ్డి, నదీమ్ జావిద్, కమలాకర్‌రావు, ఆనంతుల శ్యామ్‌మోహన్, అనిల్‌కుమార్ యాదవ్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. యూపీఏ ప్రభుత్వం రూ. 10 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తే...కేసీఆర్ ప్రభుత్వం రూ ఐదు లక్షల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ త్యాగాలు చేసి తెలంగాణ ఇస్తే టీఆర్ఎస్ సర్కారు దోచుకుంటుందని ఆరోపించారు. ప్రజల ఆశలను కేసీఆర్ నేరవేర్చలేకపోయారని చెప్పారు. తెలంగాణ ఏర్పడి ఎనిమిదేండ్ల యినా రాష్ట్ర ఏర్పాటు లక్ష్యం నెరవేరలేదన్నారు. కాంగ్రెస్ లేకుండా కూటమి ఏర్పాటు చేస్తే ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ను బలహీనపరిచేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తున్నదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉందని చెప్పారు. పార్టీలో వేర్వేరు వాదనలు వినిపించినా... పార్టీ కోసం అంతా కలిసికట్టుగా పని చేస్తారు.

23న టీడీపీ రాష్ట్ర విస్తృతస్థాయి భేటి

అందరూ హాజరు కావాలి:కాసాని

నవతెలంగాణ-హైదరాబాద్

తెలుగుదేశం తెలంగాణ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం నెల 23వ తేదీన నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని రాష్ట్ర పార్టీ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఈ సమావేశం జరుగుతుందని చెప్పారు. తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర అనుబంధ సంఘాల పూర్తి కార్యవర్గం, పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు, కో-ఆర్డినేటర్లు, త్రిమెన్, ఫైవ్ మెన్ కమిటీ సభ్యులను ఈ సమావేశానికి ఆహ్వానించినట్టు జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. ప్రతి ఆహ్వానితుడూ సమావేశానికి తప్పనిసరిగా హాజరవ్వాలని సూచించారు. త్వరలో తెలంగాణ వ్యాప్తంగా చేపట్టనున్న ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం, పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ వేగవంతం, పార్టీ సంస్థాగత నిర్మాణం, తదితర అంశాలపై రాష్ట్ర పార్టీ విస్తృత స్థాయి భేటిలో ప్రధాన ఎజెండాగా చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కాసాని జ్ఞానేశ్వర్ నియమితులయ్యాక జరుగుతున్న తొలి విస్తృత సమావేశం కావడం గమనార్హం.

మంత్రిని కలిసిన రాష్ట్ర టూరిజం చైర్మెన్

నవతెలంగాణ-నాగోల్

వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావును వారి నివాసంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పాడి రైతులకు రుణాలు ఇస్తాం

- ప్రతినియోజకవర్గానికి మూడువేల యూనిట్లు
- విజయడెయిరీ రైతులకు ముద్రరుణాలు
- ఔట్‌లెట్ల సంఖ్య పెంచుతాం : మంత్రి తలసాని

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



పాడిరంగంపై ఆధారపడిన రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలిప్పించడం ద్వారా పాడి పరిశ్రమను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. బ్యాంకు రుణాల ద్వారా ఒక్కో నియోజకవర్గానికి 2500 నుంచి మూడు వేల యూనిట్ల వరకు పాడి పశువులను ఇప్పించడం ద్వారా యువతకు, పాడి రంగంపై ఆధారపడి ఉన్న రైతులకు ఆర్థిక స్వావలంభన వచ్చేలా కార్యక్రమాన్ని రూపొందించాలని కోరారు. విజయ డెయిరీ ఉత్పత్తుల ఔట్‌లెట్ల సంఖ్య పెంచుతామని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మాసాబ్‌ట్యాంక్‌లోని మంత్రి కార్యాలయంలో విజయ డెయిరీ చైర్మెన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సోమా భరత్ కుమార్ అధ్యక్షతన బోర్డు సమావేశమైంది. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అధర్ సిన్హా, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ రాంచందర్, టీఎస్ఎల్‌డీఏ సీఈవో మంజువాణి, వెటర్నరీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వీరోజిరావు, ఎన్‌డీడీబీ అధికారి సునీల్ సిన్హా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ పాడి సంపద అభివృద్ధి ద్వారా విజయ డెయిరీకి పాలు పోసే రైతుల సంఖ్య పెంచాలనీ, రైతులు, డెయిరీ భాగస్వామ్య పద్ధతిలో నూతనంగా నిర్మిస్తున్న మెగా డెయిరీకి అవసరమైన పాలను సునాయసంగా పొందేలా విధివిధానాల రూపొందించాలని ఆదేశించారు. విజయ డెయిరీకి సక్రమంగా పాలు పోసే రైతులకు ముద్ర రుణాలు మంజూరు చేయించడం ద్వారా రైతులు అదనపు పాడి పశువులను కొనుగోలు చేసి పాల ఉత్పత్తిని పెంచే అవకాశం ఉంటుందని చెప్పారు. సొసైటీ సభ్యత్వ నమోదు కోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని చెప్పారు. విజయ డెయిరీ పాల ఉత్పత్తుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ప్యాకేజీపై ఒరిస్సా, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలకు సరఫరా చేసేందుకు, బాదంపాలు తదితర ఉత్పత్తులు గ్లాస్ బాటిల్స్ స్థానంలో పెట్ బాటిల్స్ ద్వారా సరఫరా చేసేందుకు నిర్ణయించినట్టు తెలిపారు. విజయ డెయిరీ ఉత్పత్తులను వివిధ ప్రాంతాలలో తిరిగి విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమ్మక్క సారక్క, పెద్దగట్టు, కొమురెల్లి, ఏడుపాయల తదితర జాతర్లలో సంతలు, సమావేశాలు జరిగే ప్రాంతాలలో విజయ ఉత్పత్తులు అమ్మేందుకు ప్లాన్ చేయాలని సూచించారు.

కేంద్ర బడ్జెట్లో విద్య, వైద్యానికి నిధులు పెంచాలి

ప్రభుత్వ ఆధీనంలో ఈ రంగాలు ఉంటేనే దేశాభివృద్ధి సాధ్యం
ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



నవతెలంగాణ-నార్కట్‌పల్లి

2023-24 కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి 10 శాతం, వైద్య రంగానికి 6 శాతం నిధులు కేటాయించాలని తెలంగాణ పౌర స్పందన వేదిక వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో శుక్రవారం తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్లో కొఠారి కమిషన్ (మొట్టమొదటి జాతీయ విద్యా విధాన ప్రాతిపదిక) నివేదిక ప్రకారం.. విద్యారంగానికి 10 శాతం, వైద్య రంగానికి 6 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ అధ్యాపకులు, విద్యార్థులతో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య, వైద్యం ప్రభుత్వ బాధ్యత అన్నారు. ఏ దేశమైనా అభివృద్ధి చెందాలంటే ప్రజానీకానికి నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందాలన్నారు. విద్య, వైద్య రంగాలు ప్రభుత్వ ఆధీనంలో వున్నప్పుడే అది సాధ్యమవుతుందన్నారు. ఇది అనేక అభివృద్ధి చెందిన దేశాల అనుభవం చెబుతోందని చెప్పారు. కానీ, దేశంలో ఈ రెండు రంగాలు పూర్తిగా ప్రయివేటు, కార్పొరేట్ల చేతిలోకి పోయి సామాన్య ప్రజానీకానికి అందుబాటులో లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడేండ్లలో ఈ విషయం మరింతగా స్పష్టమైందన్నారు. ఈ క్రమంలో కడుపు కట్టుకునైనా పిల్లలకి మంచి విద్య చెప్పించాలనే తపన దిగువ మధ్యతరగతి, మధ్యతరగతి కుటుంబాల్లో పెరుగుతోందన్నారు. దీనిని అవకాశంగా తీసుకొని ప్రయివేటు రంగం దోపిడీ మరింత పెరుగుతోందన్నారు.

ఏదైనా తీవ్ర అనారోగ్యానికి గురైతే ఆస్తులు అమ్ముకున్నా నయం కాక.. అప్పులపాలయ్యే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విస్తృత ప్రజానీకానికి నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం ప్రభుత్వం అందిస్తే చాలు, ఇతర పథకాల అవసరం చాలా తగ్గిపోతుందనే చర్చ బలపడుతోందని చెప్పారు. అనేక ప్రజాసంఘాలు, సంస్థలు, ఆఖరికి రాజకీయ పార్టీలు కూడా ఉచిత విద్య, వైద్యం కావాలని డిమాండ్ చేస్తున్నాయని గుర్తు చేశారు. 14 ఏండ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా, ఉచితంగా నాణ్యమైన విద్య అందించాలన్నారు. కానీ ఈ రంగాలకు బడ్జెట్ కేటాయింపులు నానాటికీ కుదిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గత ఐదు సంవత్సరాల్లో ఎన్నడూ విద్యకు నాలుగు శాతం, వైద్యానికి మూడు శాతం కూడా నిధులు కేటాయించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో విద్య, వైద్య రంగాల బలోపేతానికి ప్రజానీకం వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆకుల రవి, అధ్యాపకులు అంజిరెడ్డి, రమణారెడ్డి, మధు పాపయ్య, తెలంగాణ పౌర స్పందన వేదిక జిల్లా అధ్యక్షులు పాల్వాయి అంజిరెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి వనం వాణిశ్రీ, యూటీఎఫ్ జిల్లా కోశాధికారి నారా శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితబంధుతో సామాజిక మార్పులు

- తమిళనాడు వీసీకే పార్టీ ఎమ్మెల్యే, ఫ్లోర్ లీడర్ సింతనై సెల్వన్
- దళితబంధు, పల్లె ప్రగతి, హరితహారం పనులను పరిశీలించిన తమిళనాడు బృందం



బృంద సభ్యులను సన్మానిస్తున్న లబ్దిదారులు

నవతెలంగాణ - హుజూరాబాద్/ జమ్మికుంట/ వీణవంక

దళితుల ఆర్థిక వృద్ధికి అమలు చేస్తున్న దళితబంధు పథకం భేష్ అని, దళితుల జీవన ప్రమాణాల్లో మార్పులు ఏర్పడుతున్నాయని తమిళనాడు కట్టుమర్నాకోల్ నియోజకవర్గం ఎమ్మెల్యే, వీసీకే(విధుతలై చిరుతైగల్ కచ్చి) పార్టీ ఫ్లోర్ లీడర్ సింతనై సెల్వన్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గంలో దళితబంధు, పల్లెప్రగతి పనులను తమిళనాడు బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సింతనై సెల్వన్ మాట్లాడుతూ.. దళితబంధు పథకం వినూ త్నమైన పథకం అన్నారు. ఎస్సీ సామాజిక తరగతిని ఆర్థికంగా బలోపేతం చేస్తూ, వారిని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేలా ప్రవేశపెట్టిన ఈ పథకం జాతీయ స్థాయిలో మొదటిదని చెప్పారు. నిన్నటి వరకు కూలీలుగా ఉన్నవారిని ఇప్పుడు యజమా నులుగా తీర్చిదిద్ది, వారు ఆర్థిక సాధికా రతను సాధించే దిశగా గొప్ప పథకాన్ని ప్రవేశపెట్టి, పేద దళితుల అభ్యున్నతికి కృషిచేస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మరో ఎంజీఆర్ అని అభివర్ణించారు. దళితబంధు పథకం అన్నిరాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. తమ పర్యటన అనం తరం తెలంగాణలో ప్రవేశపెడుతున్న పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను తమిళనాడులో కూడా ప్రవే శపెట్టేలా తమ ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్‌కు వివరి స్తామని చెప్పారు. ఈ సందర్భంగా హుజూరాబాద్, కనుకుల గిద్ద, జమ్మికుంటలో దళితబంధు పథకం కింద నిలకొల్పిన పలు యూనిట్లను పరిశీలించి, లబ్ది దారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనం తరం కనుకులగిద్ద గ్రామంలోని పల్లెప్రకృతి వనం, శ్మశానవాటిక, రైతువేదిక, గ్రామీణ క్రీడా ప్రాంగణాన్ని బృంద సభ్యులు పరిశీలించారు. ఈ పర్యటనలో తిరుప్పూర్ ఎమ్మెల్యే ఎస్ఎస్ బాలాజీ, చెన్నయ్ ఎగ్జి క్యూటివ్ డైరెక్టర్ రిచర్డ్ దేవదాస్, సాసీ(ఎస్ఏఎస్ఐ) త్రివేంద్రం రాష్ట్ర కోఆర్డినేటర్ మురుగప్పన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ వి.ఎ.రమేష్ నాథన్, సోషల్ వాచ్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ బండ శ్రీనివాస్, ట్రైనీ కలెక్టర్ లెనిన్‌వాత్సల్ టోప్పో, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ అధికారి నాగార్జున, అధికారులు ఉన్నారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి

- వన్యప్రాణుల సంరక్షణ, ఎకో టూరిజంతో టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ అభివృద్ధి
- స్థానిక ఆదివాసి, చెంచులు, మహిళలకు ఉపాధి కల్పన : మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ - అచ్చంపేట రూరల్

రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని అటవీ, దేవాదాయ, పర్యావరణ, న్యాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని మన్ననూర్ టైగర్ రిజర్వ్‌లో ఎకో టూరిజంలో భాగంగా ఎంపీ రాములు, ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో కలిసి 8 నూతన సఫారీ వాహనాలను, వనమాలికలోని 6 టూరిజం కాటేజీలను శుక్రవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యాటకులకు అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ఎంతో ఆహ్లాదకరమైనదని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలోని కవ్వాల్ రిజర్వ్ ఫారెస్ట్, అమ్రాబాద్ రిజర్వ్ ఫారెస్ట్‌లను ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌ల పరిధిలో నివసించే గిరిజన, చెంచు, ఆదివాసీలకు అటవీ సంరక్షణ సిబ్బందిగా, వాచ్‌మెన్లుగా ఉపాధి కల్పిస్తామని తెలిపారు. కలప స్మగ్లింగ్‌ను పూర్తిగా అరికట్టడం వల్ల వన్యప్రాణుల సంఖ్య పెరగడంతో పాటు చెట్ల అభివృద్ధి బాగా పెరిగిందన్నారు. టైగర్ రిజర్వుల సమీపంలో మరిన్ని ఎకో టూరిజం ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో రూ.1.20 కోట్లతో ప్రత్యేకంగా తయారు చేసిన 8 సఫారీ వాహనాలు, రూ.90 లక్షలతో నిర్మించిన 6 కాటేజీలను ప్రారంభించినట్టు చెప్పారు. నేటి నుంచి అంతర్జాలం ద్వారా బుక్ చేసుకునేందుకు అవి అందుబాటులో ఉంటాయన్నారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ 71 కి.మీ. కృష్ణా నది పరివాహక ప్రాంతంతో శ్రీశైలం, ఉమామహేశ్వరం, సలేశ్వరం, మద్దిమడుగు అంజనేయస్వామి వంటి ప్రముఖ దేవాలయాలు ఉండటం వల్ల ఎకో టూరిజానికి అపారమైన అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లు మంచి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చెందాయన్నారు. జంతువుల సంరక్షణ కోసం 160 ఊట చెరువులు, 99 చెక్‌డ్యాంలు, 1149 సాసర్ పిట్స్, 29 సోలార్ బోర్‌వెల్స్ ఉన్నాయన్నారు. అడవులను ప్లాస్టిక్ ఫ్రీ జోన్లుగా ప్రకటించామని, వన్యప్రాణులకు హాని చేసే ప్లాస్టిక్‌ను అడవులకు దూరంగా ఉంచాలని చెప్పారు.

యురేనియం విషయం ముగిసిన కథ

యురేనియం తవ్వకాల కథనాలపై పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ.. యురేనియం తవ్వకాల విషయం ముగిసిన కథ అన్నారు. దీనిపై సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా తీర్మానం చేశారని గుర్తు చేశారు. ఇదే అంశంపై ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ.. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ లబ్ది కోసం ఈ అంశాన్ని తిరగదోడుతూ కుట్రలకు తెర లేపుతున్నారని ఆరోపించారు. వీరంతా ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఎంపీ రాములు మాట్లాడుతూ.. మంత్రి చెప్పిన విధంగానే పార్లమెంట్‌లో కూడా యురేనియం తవ్వకాల నిషేధంపై తీర్మానం చేశారని, తవ్వకాలపై ప్రజలు నమ్మొద్దని చెప్పారు.

ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మెన్ శాంతికుమారి, ఫారెస్ట్ కార్పొరేషన్ చైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, పీసీసీఎఫ్,హెచ్ఓఎఫ్ఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్, పీసీసీఎఫ్ (కంపా) లోకేష్ జైస్వాల్, ఎఫ్డీసీ వీసీ, ఎండీ చంద్ర శేఖర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ పి.ఉదయ్ కుమార్, అమ్రాబాద్ ఫీల్డ్ డైరెక్టర్ క్షితిజ, నాగర్‌కర్నూల్ డీఎఫ్ఓ రోహిత్ గోపిడి తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

రాజ్యం దృష్టిలో నిజాన్ని నిర్భయంగా రాసే కలాలన్నీ మారణాయుధాలే. వాటిని వినిపించే గళాలన్నీ రాజద్రోహాలే. అందుకే సత్యం కోసం నినదించేవారెప్పుడూ చీకటి గాలాని వెలాడుతున్నట్టే, ఈ బీబీసీ కథనం కూడా తన వెబ్‌సైట్ నుండి తొలగించబడింది. ఇలాంటి అసమంజసతల పట్ల, అన్యాయాల పట్ల దేశం నిండా వ్యక్తమవుతున్న వేదన బోలెడుంది. దీనిని సంఘటితంగా నిలిపి దిశానిర్దేశం చేయగల ఉద్యమాలు బలపడనంత వరకూ ఈ చీకటి ఇలాగే కొనసాగుతుంది. ఇప్పుడీ చీకట్లను ఛేదించే వెలుతురు పిడికిళ్ళు కావాలి.

నెత్తుటి చారికలు

దేశమంతటినీ తాను సృష్టించిన అబద్ధాల ఊబిలో ముంచాలని రాజ్యం ప్రయత్నిస్తున్నప్పుడు... ఒక్క సత్యవాక్కు చాలు దాన్ని ఉలికిపాటుకు గురిచేయడానికి. ఓ అంతర్జాతీయ మీడియా వెల్లడించిన కథనం, దానిపై భారత ప్రభుత్వ కదనం చూస్తుంటే ఇప్పుడు అలాంటి ఉలికిపాటే కనిపిస్తోంది. గుజరాత్‌లో జరిగిన 2002నాటి అల్లర్లపై బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బీబీసి) చేసిన ఓ ప్రసారం ఇప్పుడు దుమారం రేపుతోంది. "ఇండియా ది మోడీ క్వశ్చన్" పేరుతో ఇది ప్రసారమైంది. దీనిపై భారత ప్రభుత్వం ఎనలేని ఆగ్రహం ప్రదర్శిస్తోంది. బ్రిటిష్ అంతర్గత విచారణ బృందం నివేదిక ఆధారంగా రూపొందిన ఈ డాక్యుమెంటరీ వలసవాద ధోరణికి తార్కాణమని దుయ్యబట్టింది. భారత ప్రధాని మోడీని అపఖ్యాతిపాలు చేయడానికే ఈ ప్రయత్నమని విరుచుకు పడుతోంది. కారణం... ఇది నాటి గుజరాత్ మత మారణహోమానికి మోడీని దోషిగా చూపుతోంది. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఆనాటి ఆయన ప్రభుత్వాన్ని బోనులో నిలుపుతోంది.



నిజానికి దేశ విభజన తరువాత జరిగిన అతిపెద్ద మారణహోమం ఇది. అత్యంత అమానవీయమైన, భయానకమైన ఈ హింసాకాండకు దేశమే కాదు, ప్రపంచమే విలపించింది. వెయ్యిమందికి పైగా చనిపోయారని గుజరాత్ ప్రభుత్వ అధికారిక నివేదికే చెప్పిందంటే వెలుగు చూడని మరణాలు ఇంకెన్నో..! ఈ ఊచకోతకు కారణాలేమిటో కారకులెవరో అంతా బహిరంగ రహస్యమే. కానీ ఆరని ఆ నెత్తుటి చారికలు నేటికీ తడిగానే కనిపిస్తున్నా ఘనమైన మన దర్యాప్తు సంస్థలకు, న్యాయస్థానాలకు ఆధారలే లభించకపోవడం వైచిత్రి! ఈ ఘోరం జరిగిన దశాబ్దకాలం తరువాత మన ప్రత్యేక విచారణ బృందం(సిట్) సాక్షాధారాలు లేవని మోడీ సహా నిందితులందరికీ క్లీన్ చిట్ ఇచ్చి చేతులు దులుపుకోగా అత్యున్నత న్యాయస్థాం సైతం దానిని ఆమోదించింది.

తిరిగి ఇన్నాళ్ళకు, రెండు దశాబ్దాల తరువాత, నాటి గుజరాత్ ముఖ్యమంత్రి మోడీయే నేటి దేశ ప్రధానిగా కొలువుదీరి ఉన్న సమయాన ఇప్పుడీ బ్రిటిష్ విచారణ బృందం నివేదిక, దాని ఆధారంగా రూపొందిన బీబీసీ డాక్యుమెంటరీ ఆ ఉదంతాన్ని మరోసారి తెరపైకి తెచ్చాయి. మరి మన ఏలినవారి ఉలికిపాటులో మండిపాటులో ఆశ్చర్యమేముంటుంది?! అసలే ఆ "గుజరాత్ నమూనా"ను నేడు దేశమంతటికీ విస్తరింపజేసే విపరీత పోకడలు ఒకవైపు సాగుతున్నాయి. మరోవైపు వీరి పాలనా నిర్వాకాల మూలంగా ప్రజల వ్యక్తిగత జీవితం అభద్రంగా, సామాజిక జీవితం కల్లోలంగా మారిపోతోంది. ఇలాంటి ఒకానొక రాజకీయ సందర్భంలో ఇది మళ్ళీ చర్చకు రావడం ఏ ఏలికలెవరికైనా ఎలా సహిస్తుందీ?! పైగా ఆ ఘోరకలికి ఆనాటి ముఖ్యమంత్రీ నేటి ప్రధానమంత్రీ మోడీగారే ప్రధాన బాధ్యులని ఈ నివేదిక తేల్చి చెపుతోందాయే. ఇది పక్కా రాజకీయ ప్రేరేపితమనీ, ఆ అరాచక మూకలకు ప్రభుత్వమే అన్ని విధాలా సహకరించిందనీ, ఏంచేసినా పోలీసులు అడ్డుకోరనే ప్రభుత్వ సంకేతాల వల్లే ఈ ఘోర దారుణాలంటూ బ్రిటిష్ విచారణ బృందం నిర్ధారించిందని ఈ డాక్యుమెంటరీ ప్రకటించింది.


ఈ డాక్యుమెంటరీలో బ్రిటిష్ మాజీ విదేశాంగ కార్యదర్శి జాక్ స్ట్రా మాట్లాడుతూ... "ముఖ్యమంత్రి మోడీ ఒకవైపు ఉన్మాదులను ఉసిగొలిపి, మరోవైపు పోలీసుల చేతులు కట్టేశాడ"ని వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ దాడులకు వీహెచ్‌పి, ఆర్ఎస్ఎస్‌లే ప్రణాళికలేసాయని, పోలీసుల రక్షణతోనే అల్లరి మూకలు చెలరేగిపోయాయని నివేదిక స్పష్టం చేసిందని, ఈ నివేదిక బ్రిటిష్ ప్రభుత్వానికి చేరినప్పటికీ విషయాలేవీ బయటకు రాలేదని కూడా ఈ డాక్యుమెంటరీ పేర్కొంది. ఈ కారణాలతోనే కదా ఆనాడు బ్రిటిష్ ప్రభుత్వమే కాదు, అమెరికా సైతం మోడీకి వీసా నిరాకరించింది. అలాంటిది అవసరమో అవకాశవాదమో తెలియదుగానీ, నేడు అదే బ్రిటిష్ ప్రధాని ఈ సందర్భంలో మోడీకి మద్దతు తెలుపుతూ దేశమేదైనా ఏలికల నైజమొకటేనని నిరూపిస్తున్నారు! రాజకీయాల్లో నైతికతకూ నిజమైన తాత్వికతకూ స్థానంలేని విపరీతకాలం కదా ఇది! ఇలాంటి విపరీతాలు ఇంకెన్ని చూడాల్సివస్తుందో...!

రాజ్యం దృష్టిలో నిజాన్ని నిర్భయంగా రాసే కలాలన్నీ మారణాయుధాలే. వాటిని వినిపించే గళాలన్నీ రాజద్రోహాలే. అందుకే సత్యం కోసం నినదించేవారెప్పుడూ చీకటి గాలానికి వేలాడుతున్నట్టే, ఈ బీబీసీ కథనం కూడా తన వెబ్‌సైట్ నుండి తొలగించబడింది. ఇలాంటి అసమంజసతల పట్ల, అన్యాయాల పట్ల దేశం నిండా వ్యక్తమవుతున్న వేదన బోలెడుంది. దీనిని సంఘటితంగా నిలిపి దిశానిర్దేశం చేయగల ఉద్యమాలు బలపడనంత వరకూ ఈ చీకటి ఇలాగే కొనసాగుతుంది. ఇప్పుడీ చీకట్లను ఛేదించే వెలుతురు పిడికిళ్ళు కావాలి.

కామ్రేడ్ లెనిన్ యావత్తు కృషిని రెండు కీలక అంశాలనుండి ప్రారంభించాడు. ఒకటి - 'మార్క్సిజం యొక్క శక్తి (బలం) అది నిజం అనే వాస్తవంలో ఉంది'. రెండవది - మార్క్సిజం పిడివాదం కాదు. అది ఆచరణకు కరదీపిక. ఆయన సైద్ధాంతిక అవగాహన, విప్లవ కార్యాచరణకు యివే ప్రాతిపదికలు.

సోషలిస్టు దేశాలైన చైనా, వియత్నాం, క్యూబా, కొరియాలు అప్రతిహతంగా ముందుకు పోతున్నాయి. మరోప్రక్క లాటిన్ అమెరికాలో వామపక్ష పార్టీలు అధికారంలోకి వస్తున్నాయి. ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీల్లో కార్మిక పోరాటాలు విజృంభిస్తున్నాయి. క్రమంగా పెట్టుబడిదారీ వ్యవస్థ కోలుకోలేని స్థితిలోకి జారిపోయింది. ఈ స్థితిలో లెనిన్ని చదవడం, చర్చించడం, ఆ మహోన్నత విప్లవ నేతను అనుసరించడం మన బాధ్యత. కర్తవ్యం.

లెనిన్‌ను చదువుతూనే ఉండాలి!



1892లో సమారా ప్రాంతీయ కోర్టులో న్యాయవాదిగా చేరాడు. అక్కడే మార్క్సిస్టు స్టడీ సర్కిల్ ప్రారంభించాడు. "నిరాడం బరత, తెలివి తేటలు, అమితమైన విజ్ఞానం, నిలకడగా నిష్కర్షగా ఉండటం, ఆత్మగౌరవం ఈ 23సంవత్సరాల యువకుడిలో కలబోసి ఉన్నాయని" ఆయన మిత్రుడు ఐ.లాలయన్స్ జ్ఞాపకాలలో రాసాడు. కార్మికవర్గ అంతిమ విజయంలో అపారమైన విశ్వాసం, అత్యంతలోతైన మార్క్సిస్టు అవగాహన ప్రజాబాహుళ్యపు కీలక సమస్యల పరిష్కారానికి మార్క్సిజాన్ని అన్వయిం చడం ఆయన ప్రావీణ్యత ఆయనకు రష్యన్ విప్లవ కారులలో గుర్తింపు తెచ్చాయి.

20వ శతాబ్దం ప్రారంభం నాటికి అనేక దేశాలలో వలస పాలనకు వ్యతిరేకంగా విముక్తి పోరాటాలు, రష్యాలో ఓ ప్రక్క తీవ్రమైన ఆర్థిక సంక్షోభం, క్రూరమైన జార్ ప్రభువుల పాలన. మరో ప్రక్క బద్దలవుతున్న రైతాంగ అసంతృప్తి, కార్మికుల సుదీర్ఘ సమరశీల పోరాటాలు. ఈ సందర్భంగా (1902) 'గ్రామీణ పేదలకు' అని ఆయన రాసిన పుస్తకం గురించి చెప్పుకోవాలి. అందులో లెనిన్ కార్మికవర్గ పార్టీ ఏమి సాధించాలని కోరుకుంటున్నది.

1917 నవంబర్ 7 తొలి శ్రామిక విప్లవం జయప్రదం అయిన తరువాత దాన్ని పుట్టుకలోనే అంతం చేయాలని చర్చిల్ యిచ్చిన పిలుపును త్రిప్పికొడుతూ "బోల్షివిక్ పసిగుడ్డు హెర్క్యులస్ అంత బలంతో పుట్టిందన్న విషయం అర్థం చేసుకోవడం లేదు... ఈ పసిగుడ్డు అయిన సోవియట్ రిపబ్లిక్ అంతర్జాతీయ, జాతీయ ప్రతీఘాత విప్లవ రాక్షసుల్ని మట్టి కరిపించింది. ఆ విధంగా అక్టోబర్ విప్లవం ద్వారా ప్రతిష్టించబడ్డ సోవియట్ సోషలిస్టు వ్యవస్థ సృష్టి. అది సృష్టించే ప్రకంపనాలు సర్వాంతర్యామిగా మారాయి" అని లెనిన్ ప్రకటించాడు.

లాటిన్ అమెరికాలో వామపక్ష పార్టీలు అధికారంలోకి వస్తున్నాయి. ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీల్లో కార్మిక పోరాటాలు విజృంభిస్తున్నాయి. క్రమంగా పెట్టుబడిదారీ వ్యవస్థ కోలుకోలేని స్థితిలోకి జారిపోయింది. ఈ స్థితిలో లెనిన్ని చదవడం, చర్చించడం, ఆ మహోన్నత విప్లవ నేతను అనుసరించడం మన బాధ్యత. కర్తవ్యం.

లెనిన్ గురించి 125సంవత్సరాలుగా ప్రపంచం చర్చిస్తూనే ఉంది. పెట్టుబడిదారీ ప్రపంచం ఆయన పేరు వినగానే ఉలిక్కిపడుతూనే ఉంది. శ్రామిక జనం జేజేలు పలుకుతూనే ఉన్నారు. ఉంటారు. కేవలం 30సంవత్సరాల జీవితంతో (1893-1923) మార్క్సిస్టు సిద్ధాంత ఔన్నత్యాన్ని, శాస్త్రీయతను, అనివార్యతను ఎల్ల దేశాలకు, ఎల్ల కాలాలకు దాని ప్రాసంగికతను చెవులు చిల్లులు పడేలా వినిపించాడు. అంతేకాదు మతం, కులం, జాతి, రంగు, భాష, ప్రాంత, లింగం పేరిట మనిషిని మనిషి దోచుకోని ఓ నూతన సమాజాన్ని ఓ పెద్ద భూభాగంలో ఆవిష్కరింపజేసి మానవ చరిత్ర గమనాన్ని శాశ్వతంగా సోషలిజం వైపు తిప్పేశాడు.



ఆర్ రఘు

ఈ పువ్వు పుట్టగానే కాదు, రాలిన తర్వాత కూడా...

రష్యాలోని ఓ మధ్యతరగతి ప్రగతిశీల కుటుంబంలో లెనిన్ (వ్లాదిమిర్ ఇల్విచ్ ఉల్యనోవ్) జన్మించాడు. లెనిన్ తండ్రి ఇల్యా ఉల్యనోవ్ పట్టుదల, క్రమశిక్షణ, కష్టపడి పనిచేసే మనస్తత్వం ప్రభావం ఆయన పిల్లలందరి మీద పడింది. అలాగే లెనిన్ తల్లి మారియా. లెనిన్ అన్న అలెగ్జాండర్ విప్లవ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటుండటం వలన జార్ ప్రభుత్వం ఉరితీసి చంపింది. లెనిన్ సోదరి అన్నాని నిర్బంధించింది. లెనిన్‌కి అన్న అలెగ్జాండర్ అంటే అమితమైన ప్రేమ. 'మా అన్న ఏమి చేసివుండేవాడు అదే నేను చేస్తాను' అని చెప్తూ ఉండేవాడు. 'అలెగ్జాండర్ వీర మరణం పొందాడు. ఆయన విప్లవ బలిదానం నా మరో సోదరుడు వ్లాదిమిర్ (లెనిన్)కి వెలుగు బాటయ్యింది' అని వారి సోదరి అన్నా పేర్కొంది. ఎనలేని ప్రేమ ఉన్నప్పటికీ మార్క్సిజాన్ని తనకు పరిచయం చేసింది తన సోదరుడు అలెగ్జాండర్ అయినప్పటికీ ఆయన ఎంచుకొన్న ఉగ్రవాద నరోడ్నిక్ మార్గం సరైంది కాదని లెనిన్ నిర్ణయానికి వచ్చాడు. తండ్రి, ఆ తరువాత అన్న చనిపోయారన్న దుఃఖాన్ని దిగమింగాడు. చదువుపై అపారమైన శ్రద్ధ పెట్టాడు. అమోఘమైన తెలివితేటలు ప్రదర్శిస్తున్నప్పటికీ 'రాజద్రోహి' అలెగ్జాండర్ తమ్ముడు కాబట్టి ఆయనకు డిగ్రీలో బంగారు పతకం యివ్వడానికి అధికారులు భయపడ్డారు. కజన్ విశ్వవిద్యాలయం మీటింగ్ హాల్లో జరిగిన సభలో విద్యార్థులు అభివృద్ధి నిరోధక నిబంధనలను విశ్వవిద్యాలయం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

"ప్రస్తుత పరిస్థితులలో ఈ యూనివర్సిటీలో చదువు కొనసాగించడం నాకు సాధ్యం కాదని భావిస్తున్నాను. ఈ ఇంపీరియల్ కజన్ యూనివర్సిటీ విద్యార్థుల లిస్టు నుండి నా పేరు తొలగించాల్సిందిగా కోరుచున్నాను" అని లేఖ రాసి పంపాడు. అయన్ని ప్రభుత్వం అరెస్టు చేసింది. తోటి కామ్రేడ్స్‌కు అప్పుడు తన ముందున్న ఏకైక మార్గం విప్లవం అని తేల్చి చెప్పాడు. ప్రభుత్వం ఆయన్ని కోకుష్కినో అనే సుదూర గ్రామానికి ప్రవాసం పంపింది. ఆయనపై పోలీసు నిఘా పెట్టింది. ఆయన సోదరి అన్నా అప్పటికే పీటర్స్‌బర్గ్ నుండి వెలివేయబడి అక్కడికి చేరుకుని ఉంది. అప్పటికి లెనిన్ వయస్సు కేవలం 17సంవత్సరాలు. ఆ గ్రామంలో ప్రవాసం ఉండగానే ఆయన "పీటర్స్‌బర్గ్ జైలులో ఉన్నప్పుడు కన్నా, సైబీరియాలో వెలివేతలో ఉన్నప్పుడు కన్నా ఈ గ్రామంలో ఉన్న సంవత్సరంలోనే ఎక్కువ పుస్తకాలు చదివాను" అన్నారు. చదవడం, నోట్సు రాసుకోడం నిత్యకృత్యం. రష్యన్ విప్లవ కారుల రచనలను లోతుగా అధ్యయనం చేశాడు. సంవత్సరం తరువాత వచ్చినా కజన్ యూనివర్సిటీ ఆయన్ని తిరిగి తీసుకోవడానికి నిరాకరించింది. విదేశాలకు వెళ్లి చదువుకోవాలనుకుంటే పాస్‌పోర్టు యివ్వవద్దని పోలీసుశాఖ ప్రభుత్వానికి రాసింది. అయినా వీటన్నింటినీ అధిగమించి న్యాయశాస్త్ర పట్టా అందుకున్నాడు. 1892లో సమారా ప్రాంతీయ కోర్టులో న్యాయవాదిగా చేరాడు. అక్కడే మార్క్సిస్టు స్టడీ సర్కిల్ ప్రారంభించాడు. "నిరాడం బరత, తెలివి తేటలు, అమితమైన విజ్ఞానం, నిలకడగా నిష్కర్షగా ఉండటం, ఆత్మగౌరవం ఈ 23సంవత్సరాల యువకుడిలో కలబోసి ఉన్నాయని" ఆయన మిత్రుడు ఐ.లాలయన్స్ జ్ఞాపకాలలో రాసాడు. కార్మికవర్గ అంతిమ విజయంలో అపారమైన విశ్వాసం, అత్యంతలోతైన మార్క్సిస్టు అవగాహన ప్రజాబాహుళ్యపు కీలక సమస్యల పరిష్కారానికి మార్క్సి జాన్ని అన్వయించడం ఆయన ప్రావీణ్యత ఆయనకు రష్యన్ విప్లవ కారులలో గుర్తింపు తెచ్చాయి. ఆయన కొద్ది కాలంలోనే విప్లవ పార్టీ నిర్మాణ అవశ్యకతను గుర్తించాడు. "ఒక విప్లవ కారుల సంస్థను యిస్తే రష్యాని మేం తిరగతిప్పుతాం" అనే వారు. అప్పటికే రష్యాలో కార్మికోద్య మం ఊపందుకున్నది. కార్మికులకు రాజకీయ విద్య అందిం చడంపై పూర్తి శక్తినంతా వినియోగించడం ప్రారంభించాడు.

లెనిన్ అన్న అలెగ్జాండర్ విప్లవ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటుండటం వలన జార్ ప్రభుత్వం ఉరితీసి చంపింది. లెనిన్ సోదరి అన్నాని నిర్బంధించింది. లెనిన్‌కి అన్న అలెగ్జాండర్ అంటే అమితమైన ప్రేమ. 'మా అన్న ఏమి చేసివుండేవాడు అదే నేను చేస్తాను' అని చెప్తూ ఉండేవాడు. 'అలెగ్జాండర్ వీర మరణం పొందాడు. ఆయన విప్లవ బలిదానం నా మరో సోదరుడు వ్లాదిమిర్ (లెనిన్)కి వెలుగు బాటయ్యింది'

శాస్త్రీయ సోషలిజం-కార్మికోద్యమం-సాంఘిక విప్లవం

ఈ మూడు అంశాల ప్రాధాన్యతనూ, మూడింటిని అనుసంధానం చేయడం యొక్క ప్రాధాన్యతనూ ప్రత్యేకించి అందుకు విప్లవ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ ఆవశ్యకతనూ మార్క్స్, ఏంగెల్సుల తరువాత, వారిద్దరి స్థాయిలో అవగాహన సామర్థ్యం కలిగిన వ్యక్తి కామ్రేడ్ లెనిన్. కమ్యూనిస్ట్ లీగ్ ఏర్పాటు, మొదటి ఇంటర్నేషనల్, రెండవ ఇంటర్నేషనల్ (1864), పారిస్ కమ్యూన్ (1871), నాటికి ప్రపంచం అంతా విస్తరించివున్న వలస విధానం-పరిష్కారాలు, కమ్యూనిస్టు ప్రణాళిక రచనలో, వారిద్దరి యితర రచనలన్నింటిలో ఈ మూడు అంశాల ప్రాధాన్యత, వాటిని అర్థం చేస్కోవడానికి వారు వినియో గించిన శాస్త్రీయ విశ్లేషణ, ఈ క్రమంలో రూపొందించబడ్డ అత్యంత శాస్త్రీయ, ఆధునిక వర్గ పోరాట సిద్ధాంతం- మార్క్సిజాన్ని కామ్రేడ్ లెనిన్ 'అవపోసన' పట్టాడు. కామ్రేడ్ లెనిన్ యావత్తు కృషిని రెండు కీలక అంశాలనుండి ప్రారంభించాడు. ఒకటి - 'మార్క్సిజం యొక్క శక్తి (బలం) అది నిజం అనే వాస్తవంలో ఉంది'. రెండవది - మార్క్సిజం పిడివాదం కాదు. అది ఆచరణకు కరదీపిక. ఆయన సైద్ధాంతిక అవగాహన, విప్లవ కార్యాచరణకు యివే ప్రాతిపదికలు. అందుకే యితర హేమాహేమీ మార్క్సిస్టు సిద్ధాంతకారులు ఎవరూ అర్థం చేసుకోలేకపోయిన 20వ శతాబ్దం నాటికి ఆవిష్కరించబడ్డ ఓ నూతన చారిత్రక దశ సామ్రాజ్యవాద దశను ఆయన గుర్తించాడు. 'పెట్టుబడిదారీ వ్యవస్థ అత్యున్నత దశ సామ్రాజ్యవాదం' అనీ, 'ఇది సోషలిస్టు విప్లవాల దశ' అని, దీనితో 'నూతన యుగం' ఆరంభం అయ్యిందని నిర్వచించాడు, నిరూపించాడు. మార్క్సిస్టు సిద్ధాంతాన్ని అద్భుతంగా అభివృద్ధి చేశాడు. కామ్రేడ్ స్టాలిన్ "లెనినిజం అంటే సామ్రాజ్యవాద కాలపు మార్క్సిజం" అన్నారు. ఎలాగైతే అనేక అశాస్త్రీయ, ఊహాజనిత సోషలిస్టు సిద్ధాంతాలకు, పొరపాటు అవగాహనలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంతో శాస్త్రీయ సోషలిస్టు (మార్క్సిస్టు) సిద్ధాంతాన్ని మార్క్స్, ఏంగెల్సులు రూపొందించారో అలాగే లెనిన్ 20వ శతాబ్దం (19వ శతాబ్ది చివర నుండి - మార్క్స్, ఏంగెల్స్ మరణానంతరం) నాటి అనేక మార్క్సిస్టు మేధావుల అవకాశవాద, రివిజనిస్టు, దుందుడుకు చర్యలను నిష్కర్షగా చిత్తు చేయడం ద్వారా మార్క్సిజాన్ని మరింత అభివృద్ధి చేశాడు లెనిన్. మార్క్సిజానికి పర్యాయపదంగా 'మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంతం' అయింది.

విప్లవ సిద్ధాంతం-విప్లవ కార్యాచరణ-సాంఘిక విప్లవం

20వ శతాబ్దం ప్రారంభం నాటికి అనేక దేశాలలో వలస పాలనకు వ్యతిరేకంగా విముక్తి పోరాటాలు, రష్యాలో ఓ ప్రక్క తీవ్రమైన ఆర్థిక సంక్షోభం, క్రూరమైన జార్ ప్రభువుల పాలన. మరో ప్రక్క బద్దలవుతున్న రైతాంగ అసంతృప్తి, కార్మికుల సుదీర్ఘ సమరశీల పోరాటాలు. ఈ సందర్భంగా (1902) 'గ్రామీణ పేదలకు' అని ఆయన రాసిన పుస్తకం గురించి చెప్పుకోవాలి. అందులో లెనిన్ కార్మికవర్గ పార్టీ ఏమి సాధించాలని కోరుకుంటున్నది. కార్మిక వర్గంతో గ్రామీణ పేదలు ఎందుకు కలవాలి అన్న అంశాన్ని చాలా వివరంగా, సరళంగా రాశాడు. వర్గపోరాటంపై మార్క్సిస్టు అవగాహన అశేషంగా ఉన్న గ్రామీణ పేదలకు ఎక్కందే కార్మికవర్గ విప్లవం ముందుకుపోదన్న నాటి చారిత్రక వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకుని, దాన్ని ప్రధాన కర్తవ్యంగా ఎంచుకుని రాసిన చిన్న పుస్తకం అది. అలాగే క్రూరమైన భూస్వామ్య వ్యవస్థనూ, దాని అవశేషాలను నిర్మూలించే కర్తవ్యం వదిలేసి విప్లవ ప్రతీఘాతంగా పెట్టుబడిదారీ వర్గం తయ్యారయింది. కాబట్టి, సామ్రాజ్యవాద దశలో ఆ కర్తవ్యం విప్లవ కార్మికవర్గంపై ఉందని చెప్పి మార్క్సిస్టు ఎత్తుగడలకు ఓ క్రొత్త అంశాన్ని జోడించాడు లెనిన్. ఇలా అయన నాటి అంతర్జాతీయ, జాతీయ పరిస్థితులలో వచ్చిన ప్రతి మార్పుని గమనించాడు. వాటిపై స్పష్టమైన అవగాహన యివ్వడం ద్వారా తరతరాల కమ్యూనిస్టులకూ మార్క్సిజం ఒక పిడివాదంగా చేయకుండా, దాని విప్లవ స్వభావానికి ద్రోహం చేయకుండా, కరదీపికగా స్వీకరిస్తూ ముందుకు పోయే పరిస్థితిని చూపించాడు. 1917

"ప్రస్తుత పరిస్థితులలో ఈ యూనివర్సిటీలో చదువు కొనసాగించడం నాకు సాధ్యం కాదని భావిస్తున్నాను. ఈ ఇంపీరియల్ కజన్ యూనివర్సిటీ విద్యార్థుల లిస్టు నుండి నా పేరు తొలగించాల్సిందిగా కోరుచున్నాను" అని లేఖ రాసి పంపాడు. అయన్ని ప్రభుత్వం అరెస్టు చేసింది. తోటి కామ్రేడ్స్‌కు అప్పుడు తన ముందున్న ఏకైక మార్గం విప్లవం అని తేల్చి చెప్పాడు. ప్రభుత్వం ఆయన్ని కోకుష్కినో అనే సుదూర గ్రామానికి ప్రవాసం పంపింది.

నవంబర్ 7 తొలి శ్రామిక విప్లవం జయప్రదం అయిన తరువాత దాన్ని పుట్టుకలోనే అంతం చేయాలని చర్చిల్ యిచ్చిన పిలుపును త్రిప్పికొడుతూ "బోల్షివిక్ పసిగుడ్డు హెర్క్యులస్ అంత బలంతో పుట్టిందన్న విషయం అర్థం చేసుకోవడం లేదు... ఈ పసిగుడ్డు అయిన సోవియట్ రిపబ్లిక్ అంతర్జాతీయ, జాతీయ ప్రతీఘాత విప్లవ రాక్షసుల్ని మట్టి కరిపించింది. ఆ విధంగా అక్టోబర్ విప్లవం ద్వారా ప్రతిష్టించబడ్డ సోవియట్ సోషలిస్టు వ్యవస్థ సృష్టి. అది సృష్టించే ప్రకంపనాలు సర్వాంతర్యామిగా మారాయి" అని లెనిన్ ప్రకటించాడు. ఒక మహిళా ఉగ్రవాది కాల్చిన కాల్పుల్లో గాయపడి 1924లో ఒక కార్మికవర్గ మేధస్సు ఆగిపోయింది.

నిజం. నేడు రష్యాలో సోషలిజం లేదు. ఎంత గింజుకున్నా సామ్రాజ్యవాదం తాను పైచేయి సాధించానని ఎంత విర్రవీగినా ప్రపంచ గమనం దాని కోరికకు భిన్నంగా సాగుతున్నది. సోషలిస్టు దేశాలైన చైనా, వియత్నాం, క్యూబా, కొరియాలు అప్రతిహతంగా ముందుకు పోతున్నాయి. మరోప్రక్క లాటిన్ అమెరికాలో వామపక్ష పార్టీలు అధికారంలోకి వస్తున్నాయి. ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీల్లో కార్మిక పోరాటాలు విజృంభిస్తున్నాయి. క్రమంగా పెట్టుబడిదారీ వ్యవస్థ కోలుకోలేని స్థితిలోకి జారిపోయింది. ఈ స్థితిలో లెనిన్ని చదవడం, చర్చించడం, ఆ మహోన్నత విప్లవ నేతను అనుసరించడం మన బాధ్యత. కర్తవ్యం.

సెల్:9490098422

లెనిన్... మరో ప్రపంచపు విజయ గీతిక

లెనిన్... మరో ప్రపంచపు విజయ గీతిక
"జెండాల ఎర్రని కనురెప్పల నుంచి
కన్నీటి మంచు పడుతోంది
ఎక్కడి నుండి వచ్చాడు? ఎవరాయన?
ఏం చేశాడు?
మానవులందరి కన్నా మానవత్వం ఉన్న
ఈ మహామనిషి."

సోవియట్ విప్లవ సాధకుడు కామ్రేడ్ లెనిన్ మరణించిన రోజున ప్రముఖ కవి మయకోవ్‌స్కీ అన్న మాటలివి. కామ్రేడ్ లెనిన్ 1924 జనవరి 21న మరణించాడు. ప్రపంచవ్యాప్తంగా ఈ రోజున లెనిన్ వర్ధంతి జరుగుతుంది. ఈ సందర్భంగా లెనిన్‌ను స్మరించుకోవడం అంటే అదొక గొప్ప బాధ్యత. ఎందుకంటే ఆయనకు నివాళి అర్పించడం అంటే ఆయన ప్రాపంచిక దృష్టిని (సిద్ధాంతాన్ని), విప్లవ కార్యాచరణను

ప్రతి ఓటమి నుంచి గుణపాఠం తీయడం, ప్రతి ఆచరణలో లోపాలను శాస్త్రీయంగా విశ్లేషించడం, తిరిగి సరైన సైద్ధాంతిక అవగాహనతో కార్యరంగంలోకి దూకడం లెనిన్ ప్రత్యేకత. అందుకే లెనిన్ విప్లవాన్ని విజయవంతం చేయగలిగాడు. సోషలిజం ఫలాలను ప్రజలకు అందించేందుకు తగిన ప్రణాళికలు రచించాడు. వాటికి ఓపికగా ప్రజలను సిద్ధం చేశాడు. ప్రపంచ శ్రామికవర్గానికి స్ఫూర్తినిచ్చాడు. లెనిన్ మరణించి దాదాపు వంద సంవత్సరాలు అవుతున్నా, ప్రపంచంలో జరుగుతున్న ప్రతీ ప్రజాపోరాటంలో లెనిన్ కనిపిస్తున్నాడు. లెనిన్ వినిపిస్తున్నాడు. లెనిన్ జీవిస్తున్నాడు. తన లాగే మానవత్వం ఉన్న మనుషులుగా మారమని, మనకు పిలుపునిస్తున్నాడు.

(ఆచరణని) అర్థం చేసుకోవడం. మారుతున్న ప్రతి పరిస్థితికీ, ప్రతి మలుపుకూ లెనిన్ మార్క్సిజాన్ని అన్వయించాడు. అలాంటి సైద్ధాంతిక ఆలోచనలతోనే తన ఆచరణను సాగించాడు. అందుకే ఆ సిద్ధాంత ఆచరణల మేలు కలయికే మార్క్సిజం - లెనినిజమయ్యింది. అందుకే శ్రామికవర్గ విముక్తి కోసం పనిచేసే ప్రతి కమ్యూనిస్టు లెనిన్‌ను అధ్యనం చేయాలి. ఆ అధ్యయనాన్ని తమ కార్యాచరణకు అన్వయం చేసుకోవాలి.

సునిశిత పరిశీలన, పరిశోధన లెనిన్ అధ్యయన పద్ధతులు

లెనిన్ తన జీవితకాలంలో ప్రతి విషయాన్ని సునిశితంగా పరిశీలించేవాడు. పరిశోధించేవాడు. లెనిన్ తన మొదటి రచన "రష్యన్ రైతాంగ జీవితంలో నూతన ఆర్థిక పరిణామాలు" అనే గ్రంథాన్ని 1893లో రాశాడు. 1894లో "ప్రజామిత్రుల నిజ స్వరూపం" అనే మరో గ్రంథాన్ని రాశాడు. వాటి రచన కోసం ఆయన మొత్తం రష్యన్ గ్రామీణ సమాజాన్ని అధ్యయనం చేశాడు. అందుకు అవసరమైన విస్తారమైన సమాచారాన్ని సేకరించాడు. రష్యన్ రైతాంగం ఏకవర్గంగా లేదని, రైతాంగంలో వర్గ విభజన ఉందని నిరూపించాడు. వేల ఎకరాలతో కూడిన ఎస్టేట్ల యజమా నులుగా ధనిక రైతాంగం, అతిస్వల్ప భూమితో పెద్ద, మధ్య తరగతి రైతాంగం, అసలు భూమేలేని గ్రామీణ ప్రజలు...

ఇలా రష్యన్ రైతాంగంలో అంతర్‌వర్గ విభజన కనపడుతోందని వాదించాడు. భూమి లేని పేదలు, పేద రైతులు క్రమంగా పట్టణ కార్మికులుగా మారుతున్నారని తెలిపాడు. కేవలం రైతాంగమే విప్లవం తెస్తుందనే సిద్ధాంతాన్నీ తప్పుపట్టాడు. సంఖ్య రీత్యా చిన్నదైనా, కార్మికవర్గం చైతన్యంతో కూడి ఉంటుందన్నాడు. రష్యన్ పేద, మధ్యతరగతి రైతాంగాన్ని కలుపుకుని కార్మికవర్గం విప్లవానికి నాయకత్వం వహించాలని సూత్రీకరిం చాడు. కార్మిక కర్షక మైత్రి చారిత్రక అవసరమని నిర్ధారించాడు. దానిలో భాగంగానే లెనిన్ 1895లో నాటి రష్యా రాజధాని సెయింట్ పీటర్స్ బర్గ్ పట్టణం కేంద్రంగా తన విప్లవ కార్యాచరణను ప్రారంభించాడు. దేశంలోని అన్ని రకాల మార్క్సి స్టు కారిక్మ, కర్షక బృందాలన్నింటినీ ఒప్పించి ఐక్య "శ్రామిక విమోచనా పోరాట సమితి" అనే సంస్థను ఏర్పాటు చేశాడు. ఇది ఒక రకంగా రష్యాలో విప్లవకర కార్మికవర్గ పార్టీ ఆవిర్భావానికి పునాదిగా భావించవచ్చు. ఈ సంస్థ ద్వారా దేశవ్యాప్తంగా మార్క్సిజాన్ని ప్రచారం చేశాడు లెనిన్. అందుకోసం తానే సంపాదకుడిగా ఉంటూ అనేక ప్రాంతీయ పత్రికలను ముద్రించాడు. కరపత్రాలను రాశాడు. కార్మి, కర్షకులను సంస్థలో చేరేలా పర్యటనలు చేశాడు. నిర్మాణ స్వరూపాన్ని సాధించేందుకు కృషి చేశాడు. అందుకే లెనిన్ ప్రజలలో పనిచేసిన తీరును, సమాజ పరిశీలన పద్ధతులను, విప్లవ కార్యాచరణ అనుభవాలను ప్రతి కమ్యూనిస్టు, కార్యకర్త నాయకుడు అధ్యయనం చేయాలి. ఆచరణకు అన్వయించుకోవాలి.



శత్రువు వేటాడుతున్నా విప్లవ కాగడా వదలలేదు

రష్యాలోని నిరంకుశ జారు ప్రభుత్వం నిత్యం లెనిన్‌ను వేటాడుతూ ఉండేది. లెనిన్ విప్లవ కార్యాచరణకు అడ్డుకట్ట వేయాలని ప్రయత్నం చేసేది. అందులో భాగంగా 1897 ఫిబ్రవరి 13 నుంచి 1900 జనవరి 29 వరకు, అంటే మూడు సంవత్సరాల పాటు ఆయనకు తూర్పు సైబీరియాలో ప్రవాస (జైలు) శిక్షను విధించింది. అది చాలదన్నట్టు చివరికి లెనిన్‌ను హత్య చేయాలని జారు పోలీసు యంత్రాంగం కుట్ర పన్నింది. దీన్ని తప్పించుకోవడం కోసం లెనిన్ జర్మనీలోని మ్యానిచ్, లండన్ తదితర యూరప్ దేశాలకు వలసవెళ్ళి ఐదుసంవత్సరాల పాటు అజ్ఞాత జీవితాన్ని గడపాల్సి వచ్చింది. అయితే శత్రువు నిత్యం వేటాడుతున్నా విప్లవ కాగడాను వదల లేదు. ఈ ఐదు సంవత్స రాల అజ్ఞాత జీవితాన్ని, మూడు సంవత్సరాల ప్రవాస కాలాన్ని విప్లవ పాఠశాలగా మలచుకున్నాడు. ఈ కాలంలోనే 1899లో "రష్యాలో పెట్టుబడిదారీ విధానం - అభివృద్ధి" అనే మహత్తర గ్రంథాన్ని రాశాడు. ఈ గ్రంథం ఒక రకంగా మార్క్స్ పెట్టుబడి గ్రంథానికి ఒక కొనసాగింపుగా చెప్పవచ్చు. ఈ రచన ద్వారా రష్యాలో పెట్టుబడిదారీ వ్యవస్థ పరిశ్రమలలోనే కాక, వ్యవసాయంలో కూడా ముందుకొస్తుందని నిరూపించాడు. మొత్తం తన ప్రవాస కాలంలో ముప్పైకి పైగా రచనలు చేశాడు. వాటిలో విశిష్టమైనది "రష్యన్ సోషల్ డెమోక్రట్ల (కమ్యూనిస్టుల) కర్తవ్యాలు" అనే పుస్తకం. దీని ద్వారా ఆయన విప్లవ కార్యాచరణకు ఐక్య కార్మికవర్గ పార్టీ అవసరాన్ని నొక్కి చెప్పాడు. ఆ పార్టీ కర్తవ్యాలు, నిర్మాణం

లెనిన్ విప్లవాన్ని విజయవంతం చేయగలిగాడు. విప్లవ విజయం తర్వాత, విప్లవ వ్యతిరేక శక్తులను శక్తివంతంగా ఎదుర్కొన్నాడు. సోషలిజం ఫలాలను ప్రజలకు అందించేందుకు తగిన ప్రణాళికలు రచించాడు. వాటికి ఎదురయ్యే రోజువారీ ఆటంకాలను అధిగమించేందుకు, ఓపికగా ప్రజలను సిద్ధం చేశాడు.

ఎలా ఉండాలో ఆలోచించాడు. అందుకు అవసరమైన సైద్ధాంతిక రచన చేయాలని పూనుకున్నాడు. అదే ఆయన 1902లో రాసిన మహత్తర ప్రామాణిక గ్రంథం "ఏమి చేయాలి?". కార్మికవర్గం కేవలం ఆర్థిక పోరాటాలు చేయాలని, రాజకీయ పోరాటాన్ని బూర్జువావర్గానికి వదిలి వేయాలని "ఆర్థికవాదులు" చేసే అశాస్త్రీయ వాదనలను లెనిన్ ఈ గ్రంథంలో తిప్పికొట్టాడు. కేవలం ట్రేడ్ యూనియన్ల కార్యకలా పాలతోనే విప్లవం రాదని, విప్లవ సాధనకు రాజకీయ సంస్థ (పార్టీ) అవసరమని నిర్ధారించాడు. అది కార్మిక అగ్రగామి దళంగా ఉండే కమ్యునిస్టు పార్టీ కావాలన్నాడు. పార్టీ కార్మికవర్గానికి అవసరమైన సోషలిస్టు చైతన్యాన్ని నిత్యం అందిస్తూ ఉండాలన్నాడు. పార్టీ నిర్మాణం రెండు భాగాలుగా ఉండాలని ప్రతిపాదించాడు. ఒక భాగం విప్లవానికి పూర్తిగా అంకితమైన వృత్తి విప్లవకారుల పరిమితి బృందంగా, మరో భాగం స్థానిక పార్టీ శాఖల విస్తారమైన భాగంగా ఉండాలన్నాడు. ప్రపంచంలో ఈనాడు శ్రామికవర్గ విముక్తి కోసం పనిచేస్తున్న అన్ని కమ్యూనిస్టు పార్టీల నిర్మాణం, ఆనాటి లెనిన్ ప్రతిపాదనల లోంచి జరిగినదే. కష్టకాలన్ని, ప్రవాస - జైలు జీవిత కాలాన్ని, వలస కాలాన్ని లెనిన్ సైద్ధాంతిక రచనల కోసం, పటిష్ట విప్లవ కార్యాచరణ కోసం అద్భుతంగా ఉపయోగించుకున్నాడు. శత్రువు వేటకు చిక్కకుండా, రహస్య కార్యకలాపాలను కొనసాగిస్తూ రష్యన్ కార్మిక వర్గానికి స్ఫూర్తినిచ్చాడు.



బండారు రమేష్
9490098251

ప్రతి మలుపునూ గెలుపువైపు నడిపించాడు

1905లో వలస జీవితం ముగిసిన తర్వాత లెనిన్ పార్టీకి, రష్యన్ విప్లవ పోరాటానికి ప్రత్యక్ష నాయకత్వం వహించాడు. ముందు పీఠిన నిలబడి అశేష కార్మికవర్గానికి అంతులేని విశ్వాసాన్ని అందించాడు. 1905లో రష్యాలో జరిగిన బూర్జువా విప్లవాన్ని ఆయన రష్యన్ సోషలిస్టు విప్లవానికి "డ్రస్ రిహార్సల్స్"గా పేర్కొన్నాడు. దాని విజయాలను, వైఫల్యాలను శాస్త్రీయంగా విశ్లేషించి మరింత వేగంగా లెనిన్ ముందుకు నడిచాడు. ఉక్కు క్రమశిక్షణ కలిగిన బోల్షివిక్ (కమ్యూనిస్టు) పార్టీని నిర్మించాడు. రివెజనిజానికి వ్యతిరేకంగా పార్టీని నిలిపాడు. 1914లో ప్రారంభమైన మొదటి ప్రపంచ యుద్ధాన్ని యూరప్‌లోని అనేక సోషల్ డెమొక్రటిక్ (కమ్యూనిస్టు) పార్టీలు జాతీయవాద యుద్ధాలుగా భావించాయి. ఇది తప్పుడు అవగాహన అని, ఈ యుద్ధం సామ్రాజ్యవాద యుద్ధమని లెనిన్ సూత్రీకరించాడు. కుహనా జాతీయవాదాన్ని, దేశభక్తిని ఎదిరించి ఎంతో సాహసంతో ఆయన ఈ సూత్రీకరణ చేశాడు. దీనిని నిరూపించి, ప్రపంచ కార్మికవర్గాన్ని చైతన్యం చేయడం కోసం "సామ్రాజ్యవాదం - పెట్టుబడిదారీ విధానం యొక్క అత్యున్నత దశ" అన్న మహత్తర గ్రంథాన్ని రాశాడు. ప్రపంచ యుద్ధం తీవ్రస్థాయిలో జరుగుతున్న నేపథ్యంలో విప్లవ కార్యాచరణలో తలమునకలైన సందర్భంలో, (1916లో) లెనిన్ ఈ గ్రంథాన్ని రాయడం అద్భుతమైన విషయం. లెనిన్ ప్రపంచ పరిణామాలలో ముందుకొచ్చిన మలుపును, గెలుపుగా మలిచాడు. అందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రచించాడు. 1917 మార్చి 8వ తేదీన, అంటే అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున లెనిన్ మార్గదర్శకత్వంలో రష్యన్ బోల్షివిక్ పార్టీ నాయకత్వంలో కార్మికవర్గం కదంతొక్కింది. తరతరాల దోపిడీ తెరలను నిలువునా చీల్చి, సోషలిస్టు వెలుగులను వెదజల్లేందుకు ముందుకు ఉరికింది. నిరంకుశ జారు ప్రభుత్వాన్ని కూలదోసింది. బూర్జువా ప్రజాతంత్ర విప్లవం విజయవంతం అయ్యింది. ఈ మలుపులో లెనిన్ మరో పిలుపునిచ్చాడు. విప్లవం బూర్జువా ప్రజాతంత్ర విప్లవ దశతోనే ఆగిపోకూడదు, అది సోషలిస్టు విప్లవంగా మార్చబడాలన్నాడు. అందుకు అవసరమైన కార్యాచరణ పథాన్ని నాటి బోల్షివిక్కు పార్టీ కేంద్ర కమిటీలో ప్రవేశపెట్టాడు. అదే ఏప్రిల్ థీసిస్‌గా ప్రసిద్ధి చెందింది. బూర్జువావర్గం చేతిలోని అధికారాన్ని, అవసరమైతే సాయుధ పోరుతోనైనా శ్రామికవర్గం అందిపుచ్చుకోవాలని కోరాడు. "శాంతి, భూమి, భుక్తి, సోవియట్లకే సర్వాధికారాలు" అనే నినాదాలతో కూడిన ప్రతిపాదనలను థీసిస్‌లో పేర్కొన్నాడు. వీటికి ఆటంకంగా ఉండే బూర్జువావర్గ రాజ్యాంగ యంత్ర స్వభావాన్ని తెలుపుతూ "రాజ్యం - విప్లవం" అనే మరో గ్రంథాన్ని ఆయన రాశాడు. ఈ నేపథ్యంలోనే లెనిన్ విప్లవానికి ప్రత్యక్ష నాయకత్వం వహించాలని 1917 అక్టోబర్ 7న పెట్రిగాడ్ చేరుకున్నాడు. లెనిన్ అంచనాలు నిజమయ్యాయి. పరిస్థితులు పరిపక్వమయ్యాయి. దీంతో 1917 అక్టోబర్ 25న రష్యన్ రాజ్యాధికారం విప్లవ కార్మికవర్గానికి అందింది. మానవ చరిత్రలో మహత్తర ఘటన జరిగింది. దోపిడీ రహిత సోషలిస్టు సమాజ నిర్మాణానికి ఒక అవకాశం దొరికింది. ప్రతి ఓటమి నుంచి గుణపాఠం తీయడం, ప్రతి ఆచరణలో లోపాలను శాస్త్రీయంగా విశ్లేషించడం, తిరిగి సరైన సైద్ధాంతిక అవగాహనతో కార్యరంగంలోకి దూకడం లెనిన్ ప్రత్యేకత. అందుకే లెనిన్ విప్లవాన్ని విజయవంతం చేయగలిగాడు. సోషలిజం ఫలాలను ప్రజలకు అందించేందుకు తగిన ప్రణాళికలు రచించాడు. వాటికి ఓపికగా ప్రజలను సిద్ధం చేశాడు. ప్రపంచ శ్రామికవర్గానికి స్ఫూర్తినిచ్చాడు. వలస దేశాలలో జరుగుతున్న స్వాతంత్ర్య పోరాటాలకు గుండె ధైర్యమయ్యాడు. చివరకు 1924, జనవరి 21న తుదిశ్వాస విడిచాడు. లెనిన్ మరణించి దాదాపు వంద సంవత్సరాలు అవుతున్నా, ప్రపంచంలో జరుగుతున్న ప్రతీ ప్రజాపోరాటంలో లెనిన్ కనిపిస్తున్నాడు. లెనిన్ వినిపిస్తున్నాడు. లెనిన్ జీవిస్తున్నాడు. తన లాగే మానవత్వం ఉన్న మనుషులుగా మారమని, మనకు పిలుపునిస్తున్నాడు.

(జనవరి 21, లెనిన్ వర్ధంతి సందర్భంగా)



లెనిన్ కావ్యం

ఇదే అదను లెనిన్ కథను
రచించెదను నేను
లెనిన్ బతుకు జనం కొరకు
ధ్వనించెదను నేడు
మనోవేదన నాలోన
నశించెనని కాదు
విశాలమగు విషాద గుహ
వసించితిని నేడు
లెనిన్ కథాక్రమం సదా
జపించితిని నేను
విషాదాశ్రు తుషారాల
నిషా నాకు లేదు
లెనిన్ నేడు లేడూ? చూడు
జనంలో ఉన్నాడు
లెనిన్ వేడి లెనిన్ వాడి
జగంనాడి, ధమని
లెనిన్ శాంతి లెనిన్ కాంతి
లెనిన్ మనకు ద్యుమణి
కామ్రేడ్ లెనిన్ ఛత్రం. ప్రేమ
సామ్రాజ్యానికి చిహ్నం,
కామ్రేడ్ లెనిన్ క్షాత్రం, శాత్రవ
దుర్మార్గాల విత్రం
లెనిన్ పరాకాష్ట లెనిన్
లెనిన్ మన పరాక్రమం
కామ్రేడ్ లెనిన్ ఆయుధం
మన ఆసరా, మన జ్ఞానం
లెనిన్ దృష్టి లెనిన్ సృష్టి
లెనిన్ మన విధానం..
లెనిన్ లెనిన్ లెనిన్ లెనిన్
లెనిన్ మన ప్రమాణం
లెనిన్ మనం మనం లెనిన్
లెనిన్ మనం ప్రయాణం
నీలో నాలో నీతో నాతో
లెనిన్ మహా ప్రవాహం

మయకోవ్‌స్కీ
అనువాదం: శ్రీశ్రీ

అమలినం_ఐక్యస్వరం www.praja.khammam@gmail.com
నవతెలంగాణ
5 ఖమ్మం
శనివారం 21 జనవరి 2023



కామినేని సావిత్రమ్మ మృతికి ప్రముఖుల నివాళి

నవతెలంగాణ-వైరాటౌన్



వైరా మున్సిపాలిటీ పరిధిలోని గండగలపాడు గ్రామంలో సిపిఐ(ఎం) పార్టీ సానుభూతిపరురాలు కామినేని సావిత్రమ్మ (90) శుక్రవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మరణించారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు కామినేని వేంకటేశ్వరరావు పార్టీ సానుభూతిపరులు. రెండవ కుమారుడు కామినేని నాగేశ్వరరావు ఖమ్మంలో విద్యుత్ శాఖ జెఏఓగా ఉద్యోగం చేస్తూ సిఐటియు అనుబంధం తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఖమ్మం రీజినల్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. చిన్న కుమారుడు కామినేని రవి సిపిఐ (ఎం) పార్టీ సీనియర్ సభ్యునిగా కొనసాగుతూ రైతు సంఘంలో పని చేస్తున్నారు. కామినేని సావిత్రమ్మ మరణవార్త తెలిసిన వెంటనే సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, భుక్యా వీరభద్రం, వైరా పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్ కామినేని సావిత్రమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వీరితోపాటు విద్యుత్ శాఖ ఖమ్మం ఎఏఓ ఈఆర్ఓ శ్రీధర్, తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు యం.ప్రసాద్, సిహేచ్.ముకుందారెడ్డి, దోడ్డా వెంకటి, పార్టీ నాయకులు మచ్చా మణి, వాసిరెడ్డి విద్యాసాగర్ రావు, బోడపట్ల రవీందర్, మల్లెంపాటి రామారావు, చింతనిప్పు చలపతిరావు, మల్లెంపాటి వీరభద్రరావు, గుమ్మా నరసింహారావు, మల్లెంపాటి ప్రసాదరావు, హరి వెంకటేశ్వరరావు, సంక్రాంతి నర్సయ్య, పారుపల్లి కృష్ణారావు, గుడిమెట్ల మోహనరావు, ఇమ్మడి వీరభద్రం, ఇమ్మడి సుదీర్, పల్లెబోయిన కృష్ణ, కిన్నెర మోతీ, బొడ్డు నారాయణ, పాపగంటి రాంబాబు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తదితరులు నివాళులు అర్పించారు.



మహనీయుల మార్గంలో నడుచుకోవాలి

కెవీపీఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన బి.వి.రాఘవులు, తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ-ఖమ్మం

మహనీయుల మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని కెవిపిఎస్ వ్యవస్థాపకులు దళిత శోషణ్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) జాతీయ కార్యదర్శి బివి.రాఘవులు, ఖమ్మం జిల్లా కెవిపిఎస్ సైకిల్ యాత్ర రథసారథి తమ్మినేని వీరభద్రంలు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎన్నెస్పీ క్యాంప్‌లోని మంచికంటి ఫంక్షన్ హాల్‌లో కెవిపిఎస్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన మహనీయుల చిత్రాలతో కూడిన కెవిపిఎస్ క్యాలెండర్‌ను బి.వి.రాఘవులు, తమ్మినేని వీరభద్రంలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన ఆవిష్కరణ సభలో వారు మాట్లాడుతూ సామాజిక అంతరాలు సృష్టిస్తూ ప్రజల మధ్య ఐక్యతకు భంగం కలిగించే మతోన్మాద భావజాలానికి వ్యతిరేకంగా సామాజిక ఉద్యమ నేతల స్ఫూర్తితో రాజ్యాంగ పరిరక్షణకు పోరాడాలని వారు పిలుపునిచ్చారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ మాట్లాడుతూ ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన లక్ష్యాలతో 1998లో ఏర్పడిన కెవిపిఎస్ అనేక సామాజిక పోరాటాలు నిర్వహిస్తూ జస్టిస్ పున్నయ్య కమిషన్, ఎస్సి, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం, 1235 జీఓ స్మశానవాటికల కొరకు, 342 జీఓ ఉచిత విద్యుత్ కొరకు పోరాడి విజయాలు సాధించిన సంఘంగా రాష్ట్రంలో గుర్తింపు వచ్చిందని వారు పేర్కొన్నారు. డా.బిఆర్.అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, నారాయణ గురు, పెరియార్, సాహు మహరాజ్, పుచ్చలపల్లి సుందరయ్యల చిత్రాలతో క్యాలెండర్‌ను ముద్రించి జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఇంచార్జీ మాచర్ల భారతి, జిల్లా అధ్యక్షులు ముత్తమాల ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, కెవిపిఎస్ జిల్లా నాయకులు బొట్ల సాగర్, కొమ్ము శ్రీను, పాపిట్ల సత్యనారాయణ, కుక్కల సైదులు, నకరికంటి చిరంజీవి, జి.కిరణ్, గుమ్మడి భిక్షం, ఎస్‌కె.సైదులు, గుర్రం ఉపేందర్, ఆరేంపుల ఉప్పలయ్య, పంది నాగరాజు, పల్లి రమేష్, నాగటి సురేష్, మాచర్ల గోపాల్, నందిపాటి పావని, మర్రి శ్రీదేవి, బీబీ తదితరులు పాల్గొన్నారు.

బోనకల్ పంచాయతీకి ఎల్ఈడి వీధిలైట్లు వితరణ

నవ తెలంగాణ - బోనకల్



మండల కేంద్రమైన బోనకల్ గ్రామపంచాయతీకి మండల పరిధిలోని గోవిందాపురం ఏ గ్రామానికి చెందిన ఎన్నారై భాగం రాకేష్ 30 వేల రూపాయల విలువ చేసే 12 ఎల్ఈడి వీధిలైట్లను గ్రామ సర్పంచ్ బుక్యా సైదానాయక్, పంచాయతీ కార్యదర్శి దామల్ల కిరణ్‌కు శుక్రవారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సైదానాయక్ మరో ఎనిమిది ఎల్ఈడి వీధిలైట్లు అడిగారు. దీంతో భాగం రాకేష్ సానుకూలంగా స్పందించి మరో ఎనిమిది వీధిలైట్లు కూడా ఇవ్వటానికి అంగీకరించారు. మండల కేంద్రమైన బోనకల్లుకు ఎల్ఈడీ వీధిలైట్లు ఇచ్చినందుకు బుక్యా సైదానాయక్, దామల్ల కిరణ్, గ్రామస్తులు రాకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పలు కుటుంబాలకు భట్టి పరామర్శ

నవతెలంగాణ - బోనకల్



మండల పరిధిలోని చిరునోముల గ్రామంలో పలు కుటుంబాలను మధిర ఎమ్మెల్యే, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం పరామర్శించారు. నిమ్మ తోట వెంకటేశ్వర్లు, మర్రి కంటి గోపయ్య, నిమ్మ తోట పుల్లయ్య ఇటీవల అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. దీంతో వారి కుటుంబాలను మల్లు భట్టి విక్రమార్క పరామర్శించి సంతాప సానుభూతి తెలిపారు. అదేవిధంగా నిమ్మ తోట మోహన్ రావు ఇటీవల ప్రమాదవశాత్తు కాలు ఇరగటంతో ఆయనను కూడా బట్టి విక్రమార్క పరామర్శించి ఆరోగ్యం గురించి అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట టిపిసిసి మెంబర్ పైడిపల్లి కిషోర్ కుమార్ కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి కలకోట సొసైటీ అధ్యక్షులు కర్నాటి రామకోటేశ్వరరావు, జడ్పిటిసి మోదుగు సుధీర్‌బాబు, కాంగ్రెస్ నాయకులు నల్లమోతు సత్యనారాయణ, గూడ నరసయ్య శాస్త్రి, పల్లిపాటి తిరుపతిరావు, నిమ్మ తోట జనప్రియకుమార్, మారుపల్లి ప్రేమ్‌కుమార్, చిరునోముల సర్పంచ్ ములకారపు రవి, ఉప సర్పంచ్ ఆముదాల పుల్లారావు ఉన్నారు.

కంటి వెలుగు పరీక్ష కేంద్రాలను సందర్శించిన డీఎంహెచ్ఓ

నవ తెలంగాణ-ఖమ్మంరూరల్



ఎం.వెంకటాయపాలెం, పోలే పల్లిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు పరీక్ష కేంద్రాలను డీఎంహెచ్ఓ మాలతి శుక్రవారం సందర్శించారు. కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించి, కంటి వెలుగు కార్యక్రమంపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. పరీక్ష కేంద్రానికి వచ్చిన ప్రజలతో మాట్లాడారు. కంటి వెలుగుపై గ్రామాల్లో ప్రజలందరికి అవగాహన కల్పించాలని అధికారులకు, వైద్య సిబ్బందికి, పంచాయతీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎం.వీ.పాలెం పీహెచ్సీ వైద్యురాలు శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి అనురాధ, హెచ్ఐవో శ్రీరాములు, వైద్యురాలు దీప్తి, సిబ్బంది పాల్గొన్నారు.

తీర్థాల జాతర ఏర్పాట్లపై సమీక్ష సమావేశం

నవతెలంగాణ-ఖమ్మం రూరల్



ఫిబ్రవరి 18న మహాశివరాత్రిని పురస్కరించుకుని మండల పరిధిలోని తీర్థాల సంగమేశ్వర ఆలయం వద్ద నిర్వహించనున్న జాతర ఏర్పాట్లపై ఆర్డీవో రవీంద్రనాథ్ శుక్రవారం ఆలయ ప్రాంగణంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడారు.జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే ఆయా శాఖల అధికారులు తమ పరిధిలో చేపట్టాల్సిన పనులను ప్రారంభించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది కలిసి సమన్వయంతో జాతర ఏర్పాట్లు చేపట్టాలన్నారు. రహదారి సౌకర్యం, ఆర్టీసీ బస్సుల రవాణా, పార్కింగ్ ప్రదేశాలు ముందుగా గుర్తించి ఆ ప్రదేశాలను శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కారుమంచి శ్రీనివాసరావు, ఎంపీడీవో అశోక్ కుమార్, ఉప తహసీల్దార్ కరుణశ్రీ, ఎంపీవో శ్రీనివాసరావు, సర్పంచ్ బాలునాయక్, ఆలయ ఈవో శేషయ్య, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిస్కాంల దగా.. ఏసీడీ మోత..

'అదనపు' విద్యుత్ బిల్లుల భారం

- రూ.100 నుంచి రూ.వేలల్లో అడిషనల్ చార్జీలు
- గతంలో డెవలప్‌మెంట్..ఇప్పుడు అదనపు వినియోగం పేరుతో వడ్డన
- పేరేదైనా కామన్‌గా మారిన బాదుడు
- డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు మితిమీరిన స్వేచ్ఛే కారణం

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

డిస్ట్రిబ్యూషన్ కంపెనీ(డిస్కాం)లకు విద్యుత్ నియంత్రణ మండలి ఇస్తున్న మితిమీరిన స్వేచ్ఛ ఫలితంగా వినియోగదారులపై భారాలు అధికమవుతున్నాయి. ఆ పేరుతో ఈ పేరుతో డిస్కాంలు అదనపు చార్జీలు వేస్తూ వినియోగదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రతినెలా ఇంధన సర్దుబాటు చార్జీలు పెంచుకోవచ్చనీ, ఈ పెంపుదలకు రెగ్యులేటరీ కమిషన్ అనుమతులు అవసరం లేదంటూ కేంద్ర ప్రభుత్వం కల్పించిన వెసులుబాటుతో రకరకాల పేర్లతో డిస్కాంలు మోత మోగిస్తున్నాయి. ఈ అవకాశాన్ని వినియోగించుకుంటూ గతేడాది 'డెవలప్‌మెంట్ చార్జీలు' పేరుతో విద్యుత్ వినియోగదారులపై రూ.వేల కోట్ల అదనపు భారం వేశాయి. తిరిగి ఈ ఏడాది అదనపు వినియోగ ధరావత్ (అడిషనల్ కన్జమ్షన్ డిపాజిట్)ను జనవరి బిల్లులో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్సీ) చేర్చింది. రెగ్యులేషన్-6 ప్రకారం ఈ చార్జీ విధించింది.

ఏసీడీ మోత ఎలా...

గత ఏడాది కాలంలో వినియోగదారులు వాడుకున్న సరాసరి యూనిట్లను లెక్కించి రెండు నెలల బిల్లును డిపాజిట్‌గా జనవరి బిల్లులో చేర్చారు. ఫిబ్రవరి బిల్లుతోపాటు దీన్ని చెల్లించాలని సూచించారు. వినియోగదారుడు సర్వీసు తీసుకునే సమయంలో కిలో వాట్‌కు రూ.200 చొప్పున సెక్యూరిటీ డిపాజిట్ (ఎస్‌డీ) చెల్లించాలి. ఆ తర్వాత వారు వాడుకునే యూనిట్ల ప్రకారం ఏసీడీని లెక్కిస్తారు. దీనిలోంచి ఎస్డీని మినహాయించి నికర మొత్తాన్ని ఏసీడీగా చూపుతారు. ఈ డిపాజిట్‌పై ఏడాదికి ఒకసారి రిజర్వ్‌బ్యాంకు వడ్డీ రేట్ల ప్రకారం లెక్కించి వినియోగదారుల బిల్లులో జమ చేస్తారు. ఒకవేళ సర్వీసు రద్దు చేసుకుంటే తిరిగి చెల్లిస్తారు. అవసరం ఉండి సర్వీసు తీసుకున్న ఏ వినియోగదారుడూ రద్దు చేసుకునే పరిస్థితి ఉండదు. కాబట్టి తిరిగి చెల్లించే పరిస్థితి నూటికి ఒక దానికీ రాదు.



రూ.157 కరెంట్ బిల్లులో ఏసీడీ పేరుతో రూ.420 వడ్డన

ఏసీడీ డ్యూ పేరిట భారంపై గగ్గోలు..

ఎలాంటి ముందస్తు సమాచారమూ లేకుండా ఏసీడీ డ్యూ పేరిట విద్యుత్ బిల్లులో చొప్పించిన అదనపు చార్జీలపై వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది డెవలప్‌మెంట్ చార్జీల పేరుతో.. ఇప్పుడు ఏసీడీ పేరుతో భారాలు వేశారని వాపోతున్నారు. నెలవారీ వాడకానికి రూ.100, రూ.150 బిల్లు వస్తే ఏసీడీ డ్యూ రూ.వేలల్లో రావడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అదనపు చార్జీలను తామెందుకు చెల్లించాలని అధికారులను నిలదీస్తున్నారు. ఏసీడీ డ్యూ చెల్లిస్తే తప్ప బిల్లు కట్టించుకోబోమని బిల్లు కలెక్టర్లు చెబుతుండటం.. ఒకవేళ ఈనెల కుదరకపోతే వచ్చేనెల బిల్లుతోనైనా చెల్లించాలని సూచిస్తున్నారు. ఫిబ్రవరిలో కచ్చితంగా ఏసీడీ డ్యూ చెల్లిస్తేనే బిల్లు కట్టించుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఒకవేళ వచ్చే నెలలోనూ చెల్లించకపోతే వడ్డీతోపాటు ఆ తర్వాతి నెలలోనైనా చెల్లించాల్సిందేనని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. అది కిరాయి ఇండ్లలో ఉండేవారు కాకుండా సంబంధిత యజమాని చెల్లించాల్సి ఉంటుంది.

ఖమ్మం జిల్లాలో మొత్తం 6.1 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వీటిలో 1.05 లక్షలు పోను మిగిలిన 5.05 లక్షల కనెక్షన్‌లకు బిల్లులు చెల్లించాలి. ప్రతినెలా 3.9 లక్షల సర్వీసులకు బిల్లింగ్ చేయాల్సి ఉండగా, ఈనెల తీసిన బిల్లులో అధికశాతం సర్వీసులకు ఏసీడీ డ్యూ పేరుతో బిల్లు రావడం గమనార్హం.

ఏసీడీ కచ్చితంగా చెల్లించాల్సిందే..

సురేందర్- సూపరింటెండెంట్ ఇంజనీర్- ఖమ్మం

ఏసీడీ కచ్చితంగా చెల్లించాల్సిందే. కాకపోతే మీటర్ ఎవరి పేరుతో అయితే ఉంటుందో వారే చెల్లించాలి. అద్దె ఇండ్లలో ఉంటే ఇంటి యజమాని చెల్లించాలి. ఎందుకంటే ఏసీడీపై వినియోగదారుకు వడ్డీ లభిస్తుంది. సర్వీసు రద్దు చేసుకున్నప్పుడు రిజర్వ్‌బ్యాంక్ నిర్ణీత ప్రకారంగా వడ్డీ, అసలు తిరిగి ఇస్తాం.

గడికో పేరుతో విద్యుత్ భారం వేస్తే ఊరుకోం

నున్నా నాగేశ్వరరావు- సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి



గడికో పేరుతో ప్రజలపై భారాలు వేయడం సరికాదు. డెవలప్‌మెంట్ పేరుతో గతేడాది వేశారు. ఇప్పుడు అదనపు కన్జమ్షన్ కింద ఏసీడీ పేరుతో వసూలు చేస్తున్నారు. ఇలా రకరకాల పేర్లతో ప్రజలపై భారం వేస్తే సహించేది లేదు. శనివారం ఖమ్మంలోని డీపీఆర్సీ భవన్‌లో విద్యుత్ సమస్యలపై తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి నిర్వహించే సమావేశంలో ఈ అంశాన్ని లేవనెత్తుతాం. ప్రభుత్వ కార్యాలయాల్లో పేరుకుపోయిన బకాయిలు వసూలు చేయాలి, సంస్థాగతంగా ఉన్న లోపాలను సరిచేసుకోవాలి తప్ప.. ఏదో ఒక పేరుతో ప్రజలపై భారాలు వేయడం సరికాదు. దీనిపై సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తాం.



మాజీ ఎంపీ పొంగులేటి పర్యటన

ఆశీర్వాదాలు.. పరామర్శలు

పలు కుటుంబాలకు ఆర్థికసాయాలు అందజేత

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఖమ్మం రూరల్ మండలంలో శుక్రవారం పర్యటించారు. పర్యటనలో భాగంగా ఖమ్మం రూరల్ మండలంలోని గూడూరుపాడు గ్రామానికి చెందిన అమ్మరాజు పెద్దనాన్న ఇటీవల చనిపోగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అదే విధంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఓ వ్యక్తిని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

ఖమ్మం నియోజకవర్గంలో పర్యటన

పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం నియోజక వర్గంలో శుక్రవారం పర్యటించారు. పర్యటనలో భాగంగా ఖమ్మం నగరంలోని మోతీనగర్, రాపర్తినగర్, ఎన్ఎస్‌టి రోడ్, బైపాస్రోడ్, ముస్తఫానగర్, మధురానగర్ ప్రాంతాల్లో, రఘునాథపాలెంలోని బూడిదం పాడు గ్రామాన్ని సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన శుభ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలు బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఆర్థిక సాయాలను కూడా అందజేశారు. ఈ పర్యటనలో పొంగులేటి వెంట మద్దినేని బేబి స్వర్ణ కుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్ళూరి బ్రహ్మయ్య, కొణిజర్ల ఎంపీపీ గోసు మధు, కార్పొరేటర్లు దొడ్డా నగేష్, మలీదు జగన్, వడ్డెబోయిన శ్రీనివాసరావు, దుంపల రవికుమార్, మైనారిటీ నాయకులు షేక్ ఇమామ్బాయ్, చింతమళ్ల గురుమూర్తి, తాళ్లూరి రాము, చల్లా రామకష్ణారెడ్డి, మొగిలిచర్ల సైదులు, కాంపాటి రమేష్, కరాటే వేణు, మేడా విజయ్కుమార్, ఆటో ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులు నిరంతరం అధ్యయనం చేయాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ-ఖమ్మం



వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులు నిరంతరం అధ్యయనం చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. శుక్రవారం ఖమ్మం సుందరయ్య భవన్లో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రైతు సదస్సులో తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ సరళీకరణ విధానాలు వల్లన వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు భారతదేశ పంటలు, విదేశీ పెట్టుబడులు, కార్పొరేట్ ఉత్పత్తులపై ఆధారపడే పరిస్థితి నెలకొందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి బడ్జెట్ కేటాయింపులలో కోత విధిస్తున్నారని అన్నారు. దీనివల్ల రైతులు అప్పుల ఊబిలోకి నెట్టబడు తున్నారన్నారు. పంటల వారీగా వ్యవసాయ మార్పులు అధ్యయనం చేయాలి అని అన్నారు. రైతు చేతుల్లో వ్యవసాయ ఉత్పత్తులు ఉన్న సమయాల్లోనే ఉద్యమం నిర్వహించా లన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు తాతా భాస్కరరావు, వాసిరెడ్డి వరప్రసాద్, సహాయ కార్యదర్శులు చింతనిప్పు చలపతిరావు, ఎస్కె మీరా సాహెబ్, గొడవర్తి నాగేశ్వరరావు, శీలం పకీరమ్మ, జిల్లా కమిటీ సభ్యులు మాజీ ఎంపిపిలు బొంతు సమత, తూళ్ళూరి రమేష్, శీలం సత్యనారాయణరెడ్డి, తాటికొండ శ్రీనివాసరావు, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, తుళ్ళూరి నాగేశ్వరరావు, దొడ్డపనేని కృష్ణార్జున్‌రావు, మిద్దె రామారావు తదితరులు పాల్గొన్నారు.

మన ఊరు-మన బడి పనులలో వేగం పెంచాలి : కలెక్టర్

నవతెలంగాణ -ఖమ్మం



మన ఊరు-మన బడి, మన బస్తీ-మన బడి కార్యక్రమంలో చేపట్టిన పనులలో వేగం పెంచి, త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విపి.గౌతమ్ అన్నారు. శుక్రవారం ఖమ్మం మునిసిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి ఖమ్మంలోని ఇందిరానగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, రోటరీనగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మన బస్తీ-మన బడి కార్యక్రమం క్రింద చేపట్టిన పనుల పురోగతిని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో రూ. 23.27 లక్షలతో, రోటరీనగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. వీటిలో కాంపౌండ్ వాల్, వంట గదులు, డైనింగ్ హాల్, టాయిలెట్ బ్లాకులు, విద్యుత్, మైనర్, మేజర్ మరమ్మత్తు పనులు ఉన్నాయన్నారు. పనులు పూర్తి దశలో ఉన్నట్లు ఆయన అన్నారు. టాయిలెట్ బ్లాకుల వద్ద ఖాళీ ప్రదేశాల్లో సువాసన వచ్చే మొక్కలు నాటాలన్నారు. పెయింటింగ్ పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రవేశం వద్ద గెట్‌తో పాటు ఆర్చ్ నిర్మాణం చేయాలన్నారు. పనులు జరుగుతున్నందున పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పనుల పురోగతిపై పర్యవేక్షణ చేయాలన్నారు. పూర్తయి పనులకు ఎంబి తదితర రికార్డులను వెంట వెంటనే సమర్పించి, చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇఇ కృష్ణ లాల్, మండల విద్యాధికారి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న జర్నలిస్టుకు ఆర్థికసాయం

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మంలో ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై, తీవ్ర గాయాలు పాలైన రఘునాథపాలెం మండల వార్త విలేకరి పాశం వెంకటేశ్వర్లకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సూచన మేరకు మంత్రి వ్యక్తిగత సహాయకుడు (పిఏ) చిరుమామిళ్ల రవికిరణ్ కొంత ఆర్థిక సహాయం చేశారు. రోడ్డు ప్రమాదానికి గురైన విషయాన్ని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టి జె ఎఫ్) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి లు మంత్రి దృష్టికి తీసుకు వెళ్లడంతో ఖమ్మం చైతన్య నగర్‌లో నివాసం ఉంటున్న జర్నలిస్ట్ పాశం వెంకటేశ్వర్లు ఇంటికి వెళ్లి బాధితున్ని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి, ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకొని ఆర్థిక సహాయం చేశారు. బాధితున్ని పరామర్శించిన వారిలో కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టి జె ఎఫ్) ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు రామకష్ణ, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు టీ.ఎస్ చక్రవర్తి, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, నగర అధ్యక్ష కార్యదర్శులు బాల బత్తుల రాఘవ, అమరవరపు కోటేశ్వరరావు, నగర ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష కార్యదర్శులు యలమందుల జగదీష్, అశోక్, జిల్లా, నగర నాయకులు తిరుపతి రావు, ఉపేందర్, బిక్కీ గోపి, తదితరులు ఉన్నారు.

స్మశాన వాటికలోని శివుడి విగ్రహం ధ్వంసం

నవతెలంగాణ-నేలకొండపల్లి

మండలంలోని మోటాపురం గ్రామంలో స్మశాన వాటికలో ఏర్పాటుచేసిన శివుడి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, తెలిపిన వివరాలు ప్రకారం గ్రామంలో స్మశాన వాటిక ఏర్పాటు చేసిన స్థలం విషయంలో గత కొంతకాలంగా వివాదం నడుస్తున్నట్లు సమాచారం. వివాదాస్పద స్థలంలో అధికారుల ఆదేశాల మేరకు స్థానిక గ్రామపంచాయతీ పాలకవర్గం స్మశాన వాటిక నిర్మాణం చేపట్టి ప్రారంభోత్సవం కూడా చేశారు. నేడు స్మశాన వాటికలో దహన సంస్కార కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇటీవల గ్రామానికి చెందిన చావా కృష్ణమూర్తి సహకారంతో స్మశాన వాటికలో శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో శివుడి విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంపై గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



జాతీయోద్యమ నాయకుల స్ఫూర్తితో పోరాటాలు నిర్వహించాలి

నవతెలంగాణ- ఖమ్మం



జాతీయోద్యమ నాయకుల స్ఫూర్తితో పోరాటాలు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, మాజీ జిల్లా అధ్యక్షులు బొంతు రాంబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో ఎస్ఎఫ్ఐ నూతన సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ పోరాట నాయకుల ఫోటోలతో ఎస్ఎఫ్ఐ క్యాలెండర్‌ను ముద్రించడం అభినందనీయమన్నారు. బిజెపి ప్రభుత్వం నేడు త్యాగధనులు పోరాడిన దేశంలో ప్రభుత్వ విద్యారంగాన్ని మొత్తం నిర్వీర్యం చేస్తూ నూతన విద్యవిధానం పేరుతో ప్రభుత్వ విద్యారంగాన్ని కార్పొరేట్, ప్రైవేట్ శక్తులకు అప్పచెప్పే దానికోసం ప్రయత్నాలు చేస్తోందని, దాన్ని తిప్పి కొట్టే దానికోసం విద్యార్థి లోకం, యువత పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా బిజెపి ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చి అన్ని వర్గాల ప్రజలకు విద్యను దూరం చేసే ప్రణాళికలు రూపొంది స్తుందన్నారు. నిధులు కేటాయించకుండా వసతులు కల్పించకుండా ఉపకార వేతనాలు ఇవ్వకుండా కుట్రలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టి.ప్రవీణ్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు పర్వీన్, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు నందిపాటి మనోహర్, కొమ్ము శ్రీను, వజ్జా రామారావు, నగర నాయకులు శ్రీవిద్య, శిరీష, రమ్య, చైతన్య, షరీఫా, శ్రావ్య ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

నవతెలంగాణ- రఘునాథపాలెం



బూడిదంపాడు గ్రామపంచాయతీకి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త సింగి ప్రవీణ్ కుమార్ ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబానికి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అందించిన 5వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని మంత్రి వ్యక్తిగత సహాయకులు చిరుమామిళ్ల రవికిరణ్ అందజేశారు. వాంకుడోతండాకు చెందిన పార్టీ కార్యకర్త ధరావత్ భావసింగ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన నేపథ్యంలో వారి కుటుంబాన్ని పరామర్శించి 5వేల రూపాయల ఆర్థికసహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మీరా, అమలి, బిఆర్ఎస్ మండల నాయకులు మోహన్‌రావు, మండదపు నర్సింహా రావు, అప్పారావు, వెంకటరమణ, రమేష్, రాజేష్, సంతు, తారా చంద్, పంతులు, కోట్య పాల్గొన్నారు.

దళిత బంధు యూనిట్ల పరిశీలన

నవ తెలంగాణ-చింతకాని

దళితులు ఆర్థికంగా ఎదగాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మంజూరీ చేసిన దళిత బంధు పథకం ద్వారా లబ్ది పొందిన లబ్ధిదారుల స్థితిగతులను ఖమ్మం జిల్లా అడిషనల్ కలెక్టర్ స్నేహలత శుక్రవారం పొద్దుటూరు, అనంతసాగర్ గ్రామంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో మంజూరైన ఫోటో స్టూడియో, డైరీ యూనిట్లను ఆమె పరిశీలించారు. లబ్ధిదారుల ఆదాయ వ్యయాలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ పరంధామరెడ్డి, గ్రామ సర్పంచ్‌లు నూతలపాటి మంగతాయమ్మ, తుడుం రాజేష్ , ఎంపీడీవో టి శ్రీనివాసరావు, ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు ప్రణీత, అనిల్ కుమార్, కోటేశ్వరి, సైదులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘ భవనం పనులు పూర్తి చేస్తా

- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర హామీ

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి విశ్రాంత ఉద్యోగుల సంఘ భవన పెండింగ్ పనులను సొంత నిధులతో పూర్తి చేస్తానని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హామీ ఇచ్చారు. శుక్రవారం పెన్షనర్స్ డేను పురస్కరించుకుని జవహర్‌నగర్‌లోని సుకార్‌భవన్‌లో సంఘ నాయకులు ప్రకాశ్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు ఎమ్మెల్యే సండ్ర ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సండ్రకు అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతీనెల ఒకటో తేదీనే పెన్షన్‌చెల్లింపు, పెండింగ్ బకాయిల విడుదల, పీఆర్సీ, హెల్త్‌కార్డు తదితర సమస్యలను వివరించారు. ఎమ్మెల్యే సండ్ర మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ సమావేశాల్లో పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘ భవనానికి తన నిధుల నుంచి రూ.5లక్షల మంజూరు చేయించి, చాలకపోతే సింగరేణి నిధులు కూడా వినియోగించి భవన పనులు పూర్తి చేస్తానని తెలిపారు. అనంతరం సంఘ బాధ్యులు సండ్రను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, సత్తుపల్లి మున్సిపల్ ఛైర్మెన్ కూసంపూడి మహేశ్, ఎంపీపీ దొడ్డా హైమావతి శంకరరావు, బీఆర్ఎస్ నాయకులు మల్లూరు అంకమరాజు, సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కళ్యాణం కృష్ణయ్య, ఎం.సుబ్బయ్య, నాయకులు వనమారెడ్డి చెంచిరెడ్డి, రామిశెట్టి సుబ్బారావు, జి.కృష్ణయ్య సాంబశివరెడ్డి, వెంకటాచార్యులు, మధుసూదనరాజు, వాణి, కమల, కుమారి, గంగుల బాబు, బోడేపూడి బాబు, సీతారావమ్మ పాల్గొన్నారు.

ఏ రోజు ఉత్పత్తి... ఆ రోజే రవాణా జరగాలి

- రైలు ద్వారా రోజూ 10-11 రేకులు రవాణా

- ఓబీ టార్గెట్‌ను సకాలంలో పూర్తి చేయాలి

- సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం రమేశ్

నవతెలంగాణ- సత్తుపల్లి

ఏరోజు ఉత్పత్తి అయిన బొగ్గును అదేరోజు రవాణా జరగాలని సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం జక్కం రమేశ్ సత్తుపల్లి జేవీఆర్, కిష్టారం ఓసీల అధికారులను ఆదేశించారు. శుక్రవారం సత్తుపల్లి వచ్చిన జీఎం రమేశ్ జేవీఆర్ ఓసీ, జీకేఆర్, సుషీ ఓబీ అప్ లోడింగ్ కంపెనీల వ్యూ పాయింట్ల నుంచి గనులను పరిశీలించారు. ప్రతీరోజూ 10 నుంచి 11 రేకుల బొగ్గును రైల్వేమార్గం ద్వారా రవాణా జరిగేలా చర్యలు తీసుకోవాలని జీఎం రమేశ్ అధికారులను ఆదేశించారు. ఇందుకు రైల్వే అధికారులతో మాట్లాడి వ్యాగన్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సరఫరా జరిగేలా చూడాలన్నారు. జీకేఆర్, సుషీ ఓబీ కంపెనీల యాజమాన్య బాధ్యులతో మాట్లాడారు. ఈ రెండు నెలలు చాలా కీలకమని, ఎలాంటి ప్రమాదాలు జరక్కుండా ఓబీ టార్గెట్‌ను పూర్తి చేయాలన్నారు. విధించిన ఓబీ టార్గెట్‌ను పూర్తి చేసేందుకు ఆయా యాజమాన్యాలు జీఎం రమేశ్‌కు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేవీఆర్ ఓసీ ఇన్‌ఛార్జి పీవో ఎంవీ నరసింహారావు, ఎస్ఎంవో బంగారు శ్రీనివాస్, మేనేజర్ పి.నరసింహారావు, సర్వే ఆఫీసర్ మధుసూదన్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కంటి వెలుగు పకడ్బందీగా అమలు చేయాలి

అడిషనల్ కలెక్టర్ స్నేహలత

నవతెలంగాణ-చింతకాని

కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ స్నేహలత మొగిలి అధికారులకు సూచించారు. శుక్రవారం చింతకాని మండలం వందనం గాంధీనగర్ కాలనీలో జరుగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలంతా కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా పంచాయతీ కార్యదర్శులు చొరవచూపాలని సూచించారు. కార్యక్రమంలో వందనం గాంధీనగర్ కాలనీ సర్పంచ్‌లు కొరిపల్లి సునీత, కాలంగి లలిత ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు మహేష్, కొండపల్లి అనిల్ కుమార్ చారి, నాగరాజు, వినోద్ , శివ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌కు ప్రభుత్వ కార్యాలయ భవనం కేటాయించాలి

జిల్లా కలెక్టర్ గౌతమ్ వినతి

నవతెలంగాణ- ఖమ్మం

కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్ కు ప్రభుత్వ కార్యాలయ భవనం కేటాయించాలని జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్‌కి టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు అఫ్జల్ హాసన్, సాగర్, మజీద్ కోరారు. సానుకూలంగా స్పందించి కలెక్టర్ తక్షణమే జాయింట్ డైరెక్టర్ అగ్రికల్చర్ కార్యాలయ భవనాన్ని కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. దానిలో భాగంగా డిప్యూటీ కమిషనర్ బాలాజీ నాయక్, అసిస్టెంట్ కమిషనర్లు దశరథ్, బద్యానాయక్, డిప్యూటీ స్టేట్ టాక్స్ ఆఫీసర్లు మజీద్, నర్సింహారావులు లిఖితపూర్వక దరఖాస్తు ఇవ్వగా జాయింట్ డైరెక్టర్ అగ్రికల్చర్ కార్యాలయాన్ని కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా టీఎన్జీఓ జిల్లా ఉపాధ్యక్షులు, కమర్షియల్ టాక్స్ ఫోరమ్ అధ్యక్షులు మజీద్ జిల్లా కలెక్టర్ వీ పి గౌతమ్‌కి, టీఎన్జీఓ జిల్లా అధ్యక్షులు అఫ్జల్ హాసన్, సాగర్‌లకు కమర్షియల్ టాక్స్ డిపార్ట్మెంట్ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుండి జరిగే కబడ్డీ క్రీడలకు సర్వం సిద్ధం

నవతెలంగాణ - ఎర్రుపాలెం

మండల పరిధిలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో శనివారం నుండి నిర్వహించే 17 సంవత్సరాల బాల బాలికల కబడ్డీ పోటీల ప్రారంభానికి సర్వం సిద్ధం చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీమోహన్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయులు చిన్ని విజయరాజ్ శుక్రవారం తెలిపారు. కబడ్డీ టోర్నమెంట్‌కు సంబంధించి వ్యాయామ ఉపాధ్యాయులు డ్రాలు నిర్వహించారు. బాలురు విభాగానికి 15 టీములు, బాలికల విభాగానికి 16 టీములు పోటీలో పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు, పాఠశాలలతో పాటు గురుకుల, కేజీబీ పాఠశాలలకు సంబంధించి 210 పది మంది క్రీడాకారులు క్రీడలలో పాల్గొంటారని తెలిపారు. కోవిడ్ కారణంగా గత రెండు సంవత్సరాల నుండి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు క్రీడలకు దూరం కావడంతో మండల స్థాయిలో ఉన్నటువంటి హైస్కూలు చదువుతున్న 10వ తరగతిలోపు విద్యార్థులకు కబడ్డీ టోర్నమెంట్ ఏర్పాటు చేసినట్టు క్రీడల ఆర్గనైజింగ్ సెక్రెటరీ చిన్ని జయరాజ్ తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. క్రీడల దాత గూడూరు కోటిరెడ్డి క్రీడాకారులకు ఉచిత భోజన వసతి, ప్రైజ్ మనీ మెమొంటో ఇవ్వనున్నారని తెలిపారు. మండలంలో అధికారులు ప్రజాప్రతినిధులు విద్యార్థులు వ్యాయామ ఉపాధ్యాయులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో టోర్నమెంట్ పరిశీలకులు దండెం సత్యనారాయణ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు మారాబత్తుల జమలయ్య, సాంబశివారెడ్డి, భీమా, నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు బావ సన్, వీరన్న, కుటుంబరావు, గ్రామస్తులు జానకి శివ, తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ కోర్టులు క్రీడాకారులకు అందుబాటులో తేవాలి : కలెక్టర్

నవతెలంగాణ- ఖమ్మం

నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో చేపడుతున్న టెన్నిస్ కోర్టుల మిగులు పనులు నెలాఖరులోగా పూర్తిచేసి, క్రీడాకారులకు అందుబాటులో తేవాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్మిస్తున్న నూతన టెన్నిస్ కోర్టుల పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.58 లక్షల వ్యయంతో 3 సింథటిక్ టెన్నిస్ కోర్టుల ఏర్పాటు పనులు జరుగుతున్నట్లు తెలిపారు. కోర్టుల నిర్మాణం పూర్తయినట్లు తెలిపారు. గ్యాలరీ నిర్మాణ పనులు ప్రగతిలో ఉన్నాయన్నారు. పనులు జరుగుతున్నందున కోర్టుల్లో డస్ట్ పడకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. పనుల్లో వేగం పెంచాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఏఇ ఆదిత్యరాజ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన భట్టి

నవతెలంగాణ-మధిర



నవతెలంగాణ క్యాలెండర్‌ను మధిర ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సీఎల్పీ నేత, స్థానిక ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నవతెలంగాణ క్యాలెండర్‌ను, డైరీని భట్టికి మధిర విలేకరి ఎ.అర్జున్ అందజేశారు.

కార్పొరేట్ స్థాయిలో వైద్యం తెలంగాణ ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

నవతెలంగాణ- వేంసూరు

ప్రతి ఒక్కరికి కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలనే ధ్యేయంతో ముఖ్యమంత్రి అనేక సంక్షేమ పథకాలు ప్రారంభిస్తున్నారని ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక పంచాయతీ కార్యాలయం నందు కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశానికి రూల్ మోడల్‌గా తెలంగాణను తీర్చిదిద్దిన గొప్ప మానవతా ముఖ్యమంత్రి కెసిఆర్ అని వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు విశిష్ట కృషి చేస్తున్నారని, జిల్లా కేంద్రంలో పాత కలెక్టరేట్ భవనాన్ని మెడికల్ కాలేజీకి కేటాయించడం నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎమ్‌డి ఫైజుద్దీన్, తహశీల్దార్ ముజాహిద్, ఎంపీడీవో ఎన్.వీరేశం, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పాల వెంకటరెడ్డి, డిసిసిబి డైరెక్టర్ గొర్ల సంజీవరెడ్డితోపాటు పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వెలుగుని సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

నవతెలంగాణ- ఖమ్మం



జిల్లాలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విపి.గౌతమ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం మునిసిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి నగరంలోని 12వ డివిజన్ పోలీస్ కాలనీలోని సిటీ సెంట్రల్ కన్వెన్షన్ సెంటర్, 9 డివిజన్ రోటరీనగర్‌లోని శ్రీశ్రీశ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి కళ్యాణ మండపంలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆహ్వాన పత్రాలు పంపిణీని అడిగి తెలుసుకున్నారు. కేంద్ర పరిధిలో ఎంత మందికి పరీక్షలు చేయనుంది, ఎన్ని కళ్లద్దాలు సిద్ధంగా ఉంది అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ మొదలు పరీక్ష పూర్తయ్యే వరకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు నిర్వహించుకుని కంటి అద్దాలు ఉచితంగా పొందాలని అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రజలకు కార్యక్రమంపై అవగాహన కల్పించాలని అన్నారు. పరీక్ష అనంతరం ప్రజలకు వారి కంటి సమస్య గురించి వివరంగా తెలియజేయాలని, రీడింగ్ గ్లాస్ లు అవసరమైన వారికి వెంటనే రీడింగ్ గ్లాస్‌లు అందజేస్తారని అన్నారు. ప్రిస్క్రిప్షన్ గ్లాస్‌లు వారం, పది రోజుల్లో వారి వారి ఇండ్లకు చేరేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వివరాల నమోదు ఎటువంటి పొరపాట్లు లేకుండా చేపట్టాలని, ఉదయం, మధ్యాహ్నం పూటలుగా ప్రజల సమీకరణకు చర్యలు తీసుకోవాలని, క్యూ పద్ధతి చేపట్టి, కేంద్రం వద్ద నిర్వహణ సజావుగా చేపట్టాలన్నారు. దృష్టి లోపంతో ఎవరూ ఇబ్బందులు పడకుండా ఉండడానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ నేత్ర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లద్దాలను పంపిణీ చేసేలా విస్తృత చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు అందించే సేవల్లో ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చిరుమామిళ్ల లక్ష్మి, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ బి.మాలతి, జిల్లా ఉప వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ రాంబాబు, వైద్యాధికారులు డాక్టర్ రీతూ చౌదరి, డాక్టర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయరంగం గుణాత్మక మార్పుకు శ్రీకారం

- **పామాయిల్ సాగుపై ప్రభుత్వ ప్రత్యేక దృష్టి**
- **28 జిల్లాల్లో పామాయిల్ సాగుకు కసరత్తు**
- **కేంద్రం కనీస మద్దతు ప్రకటించి ప్రోత్సహించాలి**
- **సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య**
- **రేగళ్లపాడులో 2.50 లక్షల పామాయిల్ మొక్కల పంపిణీ**

నవతెలంగాణ- సత్తుపల్లి



తెలంగాణ ఏర్పడి కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయరంగంలో గుణాత్మక మార్పులు తీసుకురావడానికి శ్రీకారం చుట్టిందని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. సత్తుపల్లి మండలం రేగళ్లపాడులో 50 ఎకరాల విస్తర్ణంలో సిద్ధంగా ఉన్న 2.50లక్షల పామాయిల్ మొక్కలను ఎమ్మెల్యే సండ్ర శుక్రవారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సండ్ర మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పామాయిల్ సాగుపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అందులో భాగంగా పామాయిల్ తోటల సాగుకు వచ్చే వారిని ప్రోత్సహిస్తోందన్నారు. రానున్న రోజుల్లో 28 జిల్లాల్లో పామాయిల్ సాగు చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. ఇండోనేషియా, మలేషియా, కోస్టారికా, థాయిలాండ్ దేశాలకు మాత్రమే పామాయిల్‌పై పేటెంట్ హక్కులు ఉన్నాయన్నారు. అక్కడ అభివృద్ధి చేసిన పామాయిల్ గింజలను విమానాల్లో తీసుకొచ్చి ఇక్కడ మన నర్సరీల్లో మొక్కలను పెంచడం జరుగుతోందన్నారు. రైతులను ప్రోత్సహించే విధంగా అవసరమైన మొక్కలను అందించేందుకు విదేశాల నుంచి దిగుమతులకు పేటెంట్ హక్కులను కేంద్రప్రభుత్వం కల్పించాలన్నారు. పామాయిల్ సాగు చేస్తున్న రైతులను కేంద్రం ప్రోత్సహించాలన్నారు. కనీస మద్దతు ప్రకటించి రైతులు మరింత ఉత్సాహంతో సాగు విస్తరించేలా చూడాలన్నారు. పామాయిల్ తోటలపై కోతులు తదితర జంతువుల బెడత ఉండదన్నారు. పామాయిల్ సాగు లాభసాటిగా మారిందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పామాయిల్ సాగుకు విస్తీర్ణతకు, ఉత్పత్తికి తగినట్లుగా ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో అశ్వారావుపేట, అప్పారావుపేటలో పామాయిల్ ఫ్యాక్టరీలను నెలకొల్పగా త్వరలో వేంసూరు మండలం కల్లూరు గూడెంలో 25 ఎకరాల్లో మరో పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు స్థల సేకరణ జరిగిందన్నారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ రాధికా గుప్త, డీహెచ్ఎస్‌వో అనసూయ, స్పెషలాఫీసర్ ధన్‌రాజ్, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఆత్మ ఛైర్మెన్ శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, ఎంపీపీ దొడ్డా హైమవతిశంకరరావు, ఎంపీడీవో సుభాషిణి, దొడ్డా శంకరరావు, షేక్ రఫీ, అంకమరాజు, వల్లభనేని పవన్, భీమిరెడ్డి గోపాల్‌రెడ్డి, బాలకృష్ణ, సొసైటీ అధ్యక్షులు తుమ్మూరు శ్రీరాంప్రసాద్, రైతులు బొడ్డు శివరామకృష్ణ, తుమ్మూరు పెద్ద శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు సున్నం సుశీల పాల్గొన్నారు.

గ్రావెల్ కొనుగోలు డబ్బులు ఇవ్వాలంటూ రైతుల ధర్నా

నవతెలంగాణ-నేలకొండపల్లి



తమ పొలంలోని గ్రావెల్ కొనుగోలు చేసిన డబ్బులను తక్షణమే ఇవ్వాలంటూ నేషనల్ హైవే కాంట్రాక్టర్ పవర్ మేక్ కంపెనీ వద్ద శుక్రవారం రైతులు ధర్నాకు దిగారు. ముదిగొండ మండలం చిరుమర్రి గ్రామానికి చెందిన రైతులు వెంకటేశ్వర్లు, ఉపేందర్ తమ భూములలోని గ్రావెల్‌ను ముదిగొండ మండలానికి చెందిన ఓ మధ్యవర్తి ద్వారా స్థానిక నేషనల్ హైవే నిర్మాణం కోసం కాంట్రాక్టర్ పవర్ మేక్ కంపెనీ వారికి విక్రయించారు. కంపెనీవారు రైతుల వద్ద కొనుగోలు చేసిన గ్రావెల్ను హైవే నిర్మాణం పనులకు ఉపయోగించుకొని అందుకు సంబంధించిన పైకాన్ని రైతులకు చెల్లించక పోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యవర్తిగా వ్యవహరించిన వ్యక్తి పవర్ మేక్ కంపెనీ వారితో మాట్లాడిన ఫలితం లేకపోవడంతో ఆగ్రహించిన రైతులు కంపెనీ వద్ద రహదారిపై ధర్నాకు దిగారు. కంపెనీకి చెందిన గ్రావెల్ లోడు లారీలను అడ్డగించారు. గ్రావెల్ విక్రయించిన డబ్బులు చెల్లించే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని బైఠాయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని జరిగిన ఘటనపై వివరాలు సేకరించి బాధిత రైతులకు సర్ది చెప్పారు. తొలుత జరిగిన ఘటనపై ముదిగొండ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని బాధిత రైతులకు సూచించారు. తదుపరి తాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు. దీంతో బాధిత రైతులు ధర్నా విరమించారు.

సీపీఐ(ఎం) పోరాట ఫలితమే మున్నేరుపై నూతన బ్రిడ్జి మంజూరు

పార్టీ జిల్లా నాయకులు ఎర్రా శ్రీనివాస్‌రావు

నవ తెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్



సీపీఐ(ఎం) పోరాటాల ఫలితగానే ఖమ్మం మున్నేరుపై బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయని ఆ పార్టీ జిల్లా నాయకులు ఎర్ర శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పార్టీ ఖమ్మం త్రీ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్నేరుపై బ్రిడ్జి నిర్మాణం కొరకు సిపిఎం ఆధ్వర్యంలో పాదయాత్రలు, సంతకాల సేకరణ, ధర్నాలు నిర్వహించడం జరిగిందన్నారు. దాని ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం మున్నేరుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.180 కోట్లు మంజూరు చేసిందన్నారు. బ్రిడ్జి నిర్మాణంతోపాటు మున్నేరుకి ఇరువైపులా కరకట్ట నిర్మించి మినీ ట్యాంక్ బండ చేయాలని ఖమ్మానికి ఎంతో సుందర వందనం అయ్యే విధంగా నిర్మాణాన్ని చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఎం త్రీ టౌన్ కార్యదర్శి భూక్య శ్రీనివాసరావు, సిపిఎం త్రీ టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు వజేలేపల్లి శ్రీనివాసరావు, 35వ డివిజన్ కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకట్రావు, మహిళా సంఘం నాయకురాలు పత్తిపాక నాగ సులోచన, షేక్ ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగుపై ప్రజల్లో అవగాహన కల్పించండి

నవతెలంగాణ- కల్లూరు



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఏపిఎం వెంకట రామారావు స్వయం సహాయక గ్రూపులను కోరారు. శుక్రవారం శ్రీ శక్తి భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల అనుసరించి తెలంగాణ ప్రభుత్వ అత్యంత ప్రతిష్టాత్మ భావిస్తూ అమ లు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రతి ఒక్కరూ ప్రతి ఒక్కరి కి అవగాహన కల్పించడం చేయాలన్నారు. ఆయా కేంద్రాల్లో ప్రణాళిక ప్రకారం గ్రామాల్లో (ఎక్షన్ ప్లాన్)వారీగా గ్రామపంచాయతీలలో అందరూ ఎస్‌హెచ్‌జి మహిళలు తమ కుటుంబాల సభ్యులు అవసరమైన కంటి వెలుగు పరీక్షలు కార్యక్రమంలో పాల్గొని కంటి పరీక్ష చేయించుకోవాలన్నారు. అదేవిధంగా తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అమలు చేస్తున్న బ్యాంకు లింకేజీ శ్రీనిధి రుణాలు మరియు బకాయిలు కమ్యూనిటీ ఇన్వెస్ట్మెంట్ సిఐఎఫ్ మరియు బ్యాంకు రుణాలు ఆడిట్లు గురించి సీబీఓ ఆడిటర్ జనార్ధన్ అందరూ స్వయం సహాయక సంఘాల్లో సక్రమంగా చెల్లించాలని తెలియజేయడం జరిగింది సంస్థ నిర్మాణం గ్రామ సమాఖ్యలు ఆడిట్ గురించి స్వయం సహాయక సంఘాల గ్రేడింగ్ విధానాల గురించి వివరించడం జరిగింది. ఈ సమావేశంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కల్లూరు బ్రాంచ్ మేనేజర్ ఎస్బిఐ బ్యాంకు మేనేజర్ శ్రీరామ్ గారు బ్యాంకు పథకాల గురించి స్వయం సహాయక సంఘాల సభ్యులకు గురించి ఎస్బిఐ సేవల గురించి లింకేజి తీసుకోవాల్సిన 17గ్రూపులకు ఒక్కొక్క సంఘానికి 10 లక్షల వరకు రుణాలు అర్హతన వివరాలను బ్యాంకు లావాదేవీలు బ్యాంకు పథకాలు తెలియజేయడం జరిగింది బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ గారు కోటేశ్వరరావు గారు మరియు రీజనల్ ఆఫీసు వెంకట్ గారు ఎస్బిఐ బ్యాంకు తరపున పాల్గొన్నారు.ఆయా గ్రామ సమాఖ్యల అధ్యక్షులు అదేవిధంగా ఈ సమావేశంలో ఉషోదయ మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు గుగులోతు నిర్మల పాలకవర్గ కమిటీ సభ్యులు కమ్యూనిటీ కోఆర్డినేటర్లు పి వెంకటేశ్వర్లు కె వెంకయ్య టీ రాజ్యలక్ష్మి సిహెచ్ శ్యామల వి వెంకట్రావమ్మ ఎస్తేరు ఆనంద్ కుమారి జి రాధా రుక్మిణి అకౌంటెంట్ అపర్ణ లక్ష్మి పాల్గొన్నారు

హాత్ సే హాత్ జోడో కార్యక్రమాన్ని విజయవంతం చేయండి : భట్టి

నవ తెలంగాణ- మధిర



మధిర మల్లు భట్టి విక్రమార్క క్యాంప్ కార్యాలయం నందు మధిర మండల, గ్రామ శాఖ అధ్యక్షులు, బూత్ కమిటీ సభ్యులతో ఎంఎల్‌ఏ మల్లు భట్టి విక్రమార్క సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మల్లు భట్టి విక్రమార్క, మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుండి 40 రోజుల పాటు హాత్ సే హాత్ జోడో పాదయాత్ర ప్రారంభం అవుతుందని, మండలంలో ప్రతి గ్రామానికి, ఇంటింటికి కాంగ్రెస్ నాయకులు తిరిగి రాహుల్‌గాంధీ సందేశాన్ని ప్రజలకు వినిపించి కరపత్రం అందచేయాలన్నారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చావా వేణు, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రంగా హనుమంతరావు, మరియు మధిర మండలం, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తాత నిఖిల్‌కు పలువురి నివాళి

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో పిండిప్రోలుకు చెందిన తాత నిఖిల్ మృతిచెందగా భౌతికయాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. నిఖిల్ తల్లిదండ్రులైన టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్సీ తాత మధుసూదన్ సోదరుడు తాత విశ్వేశ్వరరావు నాగమణి దంపతులను మాజీ ఎంపీ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, వైరా ఎమ్మెల్యే లావుడియా రాము నాయక్, ఇల్లందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, మహబూబాద్ ఎంపీ మాలోత్ కవిత, మహబూబాద్ జిల్లా పరిషత్ ఛైర్మన్ అంగోత్ బిందు, వైరా మాజీ ఎమ్మెల్యే బాణోతు చంద్రావతి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నం నాగేశ్వరరావు, టిఆర్ఎస్ జిల్లా ఇంచార్జ్ నూకల నరేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్, కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ చావా వేణుగోపాలకృష్ణ, మండల రైతు బంధు కన్వీనర్ చావా శివరామకృష్ణ, తిరుమలాయపాలెం మండల పరిషత్ అధ్యక్షులు బోడ మంగీలాల్, ఖమ్మం రూరల్ మండల పరిషత్ అధ్యక్షురాలు బెల్లం ఉమా, టిఆర్ఎస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షులు భాష బోయిన వీరన్న, ఖమ్మం రూరల్ మండలం టిఆర్ఎస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షులు బెల్లం వేణు, సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను తదితరులు పరామర్శించారు.

సమన్వయంతో 'గణతంత్ర' ఏర్పాట్లు

అదనపు కలెక్టర్లు స్నేహలత మొగిలి, ఎన్.మధుసూదన్

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్లు స్నేహలత మొగిలి, ఎన్.మధుసూదన్ సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం సమావేశ మందిరంలో ఏర్పాట్లపై శుక్రవారం సమీక్షించారు. ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చేపట్టాలన్నారు. జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతిపై ప్రసంగ పాఠం తయారుకు నివేదిక వెంటనే సమర్పించాలన్నారు. పబ్లిక్ అడ్రస్ సిస్టం, జాతీయతా భావం పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. వివిధ శాఖలు నిర్వహించే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల మీద స్టాల్స్ ఏర్పాటు, మెడికల్ క్యాంప్, లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీకి కార్యాచరణ చేయాలన్నారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్వో శిరీష, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదివి ఉత్తీర్ణులు కావాలి

నవతెలంగాణ-ముదిగొండ

మార్చిలో జరిగే పదవ తరగతి కామన్ పరీక్షలకు బాగా చదివి విద్యార్థుల ఉత్తీర్ణులు కావాలని ఎంపీపీ సామినేని హరిప్రసాద్ అన్నారు. పదో తరగతి విద్యార్థిని, విద్యార్థుల ప్రేరణ అవగాహన సదస్సు వెంకటాపురం ఆర్యే గార్డెన్స్ లో ముదిగొండ హైస్కూల్ హెచ్ఎం ఇ వెంకటరామిరెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈసదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మండలంలోని పదవ తరగతి చదివే విద్యార్థిని, విద్యార్థులంతా పదికి పది పాయింట్లు సాధించి ఉన్నతస్థితికి ఎదగాలని ఆయన కోరారు.కామన్ పరీక్షలు 55 రోజులు ఉన్నాయని ఈ55 రోజులు దీక్ష, పట్టుదలతో చదివి ఖమ్మం జిల్లాలో ముదిగొండను అగ్రస్థానంలో నిలపాలన్నారు. ప్రతి విద్యార్థిని, విద్యార్థి రోజుకి ఐదు వందలు కాకుండా, 5వేలు సంపాదించి తల్లిదండ్రులు గర్వపడే విధంగా ఉన్నత శిఖరాలను చేరాలన్నారు. అనంతరం పదవ తరగతి సబ్జెక్టుల వారిగా విద్యార్థిని, విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బాణాల వెంకటరామాచారి, గ్రామసర్పంచ్ కోటి అనంతరాములు, ఉపాధ్యాయులు కన్నెగంటి వెంకటయ్య, ఎండి మక్సుద్ అలీ, డాక్టర్ రవికుమార్, కె రామయ్య, హరికృష్ణ, పి.ప్రభాకర్ రెడ్డి, ఆనంద్ కుమార్, అబ్దుల్ కలాం ఇనిస్టూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్ జెట్టి నరేష్, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వైష్ణవిని అభినందించిన శీలం వెంకటరెడ్డి దంపతులు

నవతెలంగాణ- మధిర

ఇటీవల రాష్ట్రస్థాయిలో నిర్వహించినటువంటి పదో తరగతి సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతి పొందిన కూరపాటి వైష్ణవిని మరియు శిక్షణ ఇచ్చినటువంటి ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయురాలిని శుక్రవారం మధిర భరత్ విద్యాసంస్థల అధినేత అభినందించారు. వెయ్యి రూపాయల ప్రోత్సాహక నగదును వైష్ణవికి బహుమతిగా అందించారు.



జాతీయస్థాయి నాలెడ్జ్ అసెస్మెంట్ పరీక్షలో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ - ఖమ్మంకార్పొరేషన్

ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్ (క్యాట్)లో స్థానిక మమత ఆసుపత్రి రోడనందుగల శ్రీచైతన్య ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పోటీ పరీక్ష లెవల్-2లో 239 మంది విద్యార్థులు అర్హత సాధించగా, అందులో 21 మంది నగదు పురస్కారంతోపాటు ప్రత్యేక బహుమతులు పొందారు. ఈ సందర్భంగా పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో శ్రీచైతన్య విద్యాసంస్థల ఛైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్యలు మాట్లాడుతూ. తమ విద్యాసంస్థలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు కేవలం తరగతి బోధనే కాకుండా పోటీ పరీక్షలకు సమాయత్తమయ్యే విధంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ఐదు వేల రూపాయలు నగదు బహుమతి పొందిన వారిలో 8వ తరగతి చదువుతున్న ముత్యాల అఖిలేష్, మూడువేల రూపాయలు నగదు బహుమతి పొందిన వారిలో 8వ తరగతి చదువుతున్న రాజ్యవర్ధన్ వర్మ, రెండు వేల రూపాయలు నగదు బహుమతి పొందిన వారిలో 9వ తరగతి చదువుతున్న చిరుతేజ్సంగ్ మరియు వేయి రూపాయలు నగదు బహుమతి పొందిన వారిలో మొత్తం 18మంది కాగా వీరిలో 6వ తరగతి విద్యార్థులు ముగ్గురు, 7వ తరగతి విద్యార్థులు ముగ్గురు, 8వ తరగతి విద్యార్థులు నాలుగురు, 9వ తరగతి విద్యార్థులు ఆరుగురు, 10వ తరగతి విద్యార్థులు ఇద్దరు ఉన్నారు.వీరితోపాటు 159మంది విద్యార్థులు ప్రత్యేక బహుముతులు సాధించగా 59మంది ప్రతిభా ధ్రువపత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో డిజియం. చేతన్ మాధుర్, ఆర్ఐ.జయప్రకాశ్, ప్రిన్సిపాల్స్ టిఎల్ఎస్. శర్మ, జి.నాగప్రవీణ, వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, సురేష్, అకడమిక్ కోఆర్డినేటర్ నాగేందర్, ఐపియల్ ఇంచార్జ్ రాజశేఖర్‌రెడ్డి, డీన్స్ కెవిఆర్.విష్ణు, నవీన్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అదనపు కరెంటు బిల్లులు నిలుపుదల చేయాలి

నవతెలంగాణ-బూర్గంపాడు

మండలంలో విద్యుత్తు అధికారులు నెలవారి బిల్లు వసూల్ చేయక పోవడం వల్ల అదనపు కరెంటు బిల్లులు వస్తున్నాయని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. అదనపు బిల్లు పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన అన్నారు. ప్రజలు పనులు దొరక్క చాలీ చాలని కూలి డబ్బులతో కుటుంబాలను నడుపుకోలేక నానా బాధలు పడుతున్నారని ఆయన అన్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టుగా ఈ బిల్లులు ఉన్నాయని ఆయన అన్నారు. మారుమూల ప్రాంతం గ్రామ ప్రజలు కట్టలేని పరిస్థితి నెలకొందని ఆయన అన్నారు. విద్యుత్తు అధికారులు మాత్రం కరెంటు బిల్లును నెల నెలనెలా కట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. అదనపు కరెంటు బిల్లులను నిలుపుదల చేయాలని ఆయన కోరారు. అధికారులు ప్రజల్ని ఇబ్బంది పెట్టకుండా వారి వైఖరిని మార్చుకోకపోతే పెద్ద ఎత్తున ప్రజలు ఆందోళన చేస్తామని ఆయన అన్నారు.

శ్రీచైతన్య పాఠశాల విజయభేరి

నవతెలంగాణ-మణుగూరు



శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. శుక్రవారం నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్ పాల్వంచలో నిర్వహించగా 89 మంది విద్యార్థులు పాల్గొన్నారని, దీనిలో 39 మంది విద్యార్థులు లెవెల్ టు కి ఎంపికయ్యారని శ్రీ చైతన్య పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయి కృష్ణ ప్రసాద్ తెలిపారు. అందులో ఐదుగురికి క్యాష్ అవార్డు, మెరిట్ సర్టిఫికెట్స్, మెడల్ దక్కాయన్నారు. మిగిలిన 34 మంది విద్యార్థులు మెడల్స్ సర్టిఫికెట్స్ సాధించారన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో ముఖ్యఅతిథిగా అకాడమిక్ కోఆర్డినేటర్ కృష్ణారావు పిల్లలని కొనియాడి తగిన సూచనలు సలహాలు అందజేశారు. క్యాట్ ప్రాముఖ్యతని తెలియజేశారు. విద్యార్థులు విజయాలను పొందుతూ ముందుకు సాగాలని కొనియాడారు. ఈ విజయానికి కృషిచేసిన ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థినీ, విద్యార్థులకు క్యాష్ అండ్ మెరిట్ సర్టిఫికెట్స్ మెడల్స్ ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎం.నరేష్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రజక బంధు పథకం ప్రవేశపెట్టాలి

- రజక వృత్తిదారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-పాల్వంచ

రజక వృత్తిదారుల సమస్యలపై ఈ సంఘం నిరంతరం పనిచేస్తుందని, దళిత బంధు పథకం రూ.10 లక్షలు లాగే తెలంగాణ ప్రభుత్వం రజకుల కోసం రజక బంధు రూ.పది లక్షలు ఇవ్వాలని జిల్లా రజక వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి చిటికెన ముసలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ముదిగొండ రాంబాబు ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సమావేశంలో ముసలయ్య మాట్లాడుతూ ఇంటి స్థలం లేని ప్రతి రజకుడుకి తెలంగాణ ప్రభుత్వం ఇంటి స్థలం ఇచ్చి, రూ.3 లక్షల డబల్ బెడ్ రూమ్ నిర్మాణం చేసుకోవడానికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ పట్టణ రజక వృత్తిదారుల సంఘం గౌరవ అధ్యక్షులు సత్యరాజ్, నంద్యాల, వెంకటేశ్వర్లు, యాదగిరి, నిమ్మల భద్రం, నరేష్, వీరభద్రం, సిహెచ్ భద్రయ్య, డాక్టర్ ప్రదీప్, నాగయ్య సర్వేశ్వరరావు, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

ఓబి డ్రైవర్లు, ఆపరేటర్లకు హై స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలి

నవతెలంగాణ-మణుగూరు

ఓబీ కంపెనీలలో పని చేస్తున్న వోల్వో టిప్పర్ డ్రైవర్లకు, భారీ యంత్రాల ఆపరేటర్లకు హైస్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని ఐఎఫ్టీయూ అనుబంధ సింగరేణి ఓబి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏరియా ఎస్ఓటు జీఎం డి.లలిత్ కుమార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్టియు ఏరియా అధ్యక్షులు అంగోత్ మంగీలాల్ మాట్లాడుతూ సింగరేణి ఉపరితల గనులలో మట్టి వెలికితీత పనులు నిర్వహిస్తున్న కంపెనీలలో పనిచేస్తున్న టిప్పర్ డ్రైవర్లకు భారీ యంత్రాల ఆపరేటర్లకు సెంట్రల్ జీవో ప్రకారం హై స్కిల్డ్ వేతనాలు అమలు చేస్తామని వ్రాతపూర్వక ఒప్పందం చేసుకున్నారని ఆ ఒప్పందం ప్రకారం, ఈ అంశానికి సంబంధించిన సర్క్యులర్ జారీ కావడంలో జాప్యం జరుగుతున్నదని దీంతో ఓబి కంపెనీలలో పనిచేస్తున్న అనేక మంది డ్రైవర్లు, ఆపరేటర్లు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాగార్జున, నాగేశ్వర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ గురుకులాల్లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోండి

- జిల్లా మైనారిటీ అధ్యక్షులు యండి. యాకూబ్ పాషా

నవతెలంగాణ-పాల్వంచ

జిల్లా వ్యాప్తంగా గల మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలలో ఈ విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం వరకు అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ అధ్యక్షులు యండి.యాకూబ్ పాషా కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇల్లందు, పాల్వంచ, భద్రాచలంలో బాలురకు పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయని అలాగే బాలికలకు బూర్గంపహాడ్, సారపాక, అశ్వరావుపేట, పాల్వంచలలో పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయని ఈ పాఠశాల, కళాశాలల్లో కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్యతో పాటు భోజన సదుపాయాలు కూడా కల్పించడం జరుగుతుందని ఆసక్తి గల తల్లిదండ్రులు తమ పిల్లల వివరాలతో ఈ నెల 30 లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లాలో గల మైనార్టీ వర్గాలకు చెందిన ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు, జైనులు, సిక్కులు, పార్శియులతో పాటు ఇతరులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకై 8520860785 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

చిన్నారి గుండెకు చిల్లు...

- నిరుపేద బాలికకు సాయం అందించండి
- బ్యూటిఫుల్ లైఫ్ అసోసియేషన్ చిరు సాయం

నవతెలంగాణ-దుమ్ముగూడెం



మండలంలోని చిన్న ఆర్లగూడెం గ్రామంలో గల అతి నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన కొర్స రామకృష్ణ రాధ దంపతుల కుమార్తె చిన్నారి శ్రీ జన గుండెకు చిల్లు పడి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. గుండెకు చిల్లు పడిందని ఆపరేషన్‌కి రూ.3 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు సూచించారు. వీరి వద్ద ఆర్థిక స్థోమత లేకపోవడంతో కుటుంబం సభ్యులు ఆర్థిక సాయం కోసం బ్యూటిఫుల్ లైఫ్ అసోసియేషన్ నిర్వాహకులను ఆశ్రయించారు. స్పందించిన నిర్వాహకులు వారి సభ్యులందరి తరపున రూ.2 వేలు ఆర్థిక సాయాన్ని ఫోన్ పే ద్వారా అందించారు. ప్రస్తుతం పాప హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. బీఎల్ఏ నిర్వాహకులు మాట్లాడుతూ సాయం చేయదలచిన దాతలు 9502074983, 9502234527అనే నెంబర్లకి ఫోన్ పే గూగుల్ పే ద్వారా ఆర్థిక సహాయాన్ని అందజేసి చిన్నారికి తమ వంతు సహాయ సహకారాన్ని అందజేయాలని వారు కోరారు.

బెంచ్ ప్రెస్ పోటీల్లో భద్రాద్రి వాసుల ప్రతిభ

నవతెలంగాణ-భద్రాచలం

హైదరాబాదులో డిసెంబర్ 11, 12 తేదీలలో ఎల్బీ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి బెంచ్ ప్రెస్ పోటీలలో సిటీ స్టైల్ జిమ్‌కు చెందిన ముగ్గురు క్రీడాకారులు బంగారు పథకాలు సాధించారు. జనవరి 15 నుంచి 20 వరకు మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి బెంచ్ ప్రెస్ పోటీలలో ముగ్గురు పాల్గొనగా 74 కేజీల విభాగంలో (మాస్టర్ 2) మహంతి వెంకట కృష్ణాజి (సుధా జ్యువెలర్స్ అధినేత) 90 కేజీల బరువు ఎత్తి ఎనిమిదవ స్థానాన్ని కైవసం చేసుకోగా, 84 కేజీల విభాగంలో (మాస్టర్ 4) మహమ్మద్ అబ్బాస్ 77.5 కేజీల బరువు ఎత్తి బంగారు పతకాన్ని సాధించారు. 105 కేజీల విభాగంలో (మాస్టర్ 4) గాలి రామ్మోహన్ రావు 65 కేజీల బరువు ఎత్తి బంగారు పథకాన్ని సాధించారు. ఈ సందర్భంగా గెలుపొందిన క్రీడాకారులు మాట్లాడుతూ ఈ విజయం సాధించడానికి జిమ్ కోచ్ జీవి రామిరెడ్డి ఎంతగానో సహకరించారని తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులను రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వి.మల్లేష్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు భోగాల శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు లాయర్ తిరుమల రావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు టి వసంతరావు, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ట్రెజరర్ భోగాల వీరారెడ్డి, పట్టణంలోని పలు క్రీడా సంఘాలు, పట్టణంలోని ప్రముఖులు, రాజకీయ నాయకులు, సిటీ స్టైల్ విద్యార్థులు అభినందించారు.

రాముని దర్శించుకున్న టీఎస్ ఈఆర్సీ చైర్మన్

నవతెలంగాణ-భద్రాచలం



భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని టీఎస్ ఈఆర్సీ చైర్మన్ రంగారావు శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మెంబెర్ టెక్నికల్ బండారు కృష్ణయ్య, కమిషన్ సెక్రటరీ నాగరాజు, ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ గణపతి, సిజీఆర్ఎఫ్ చైర్మన్ పి.సత్యనారాయణ, భద్రాచలం డివిజనల్ ఇంజనీర్ జీవన్ కుమార్ అండ్ భద్రాచలం సబ్ డివిజన్ ఏడి వేణు తదితరులు పాల్గొన్నారు.

మన ఊరు మన బడి పాఠశాలల

మరమ్మతు పనుల్లో నాణ్యత పాటించాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్
- ఎంపికైన 46 మోడల్ పాఠశాలలు ప్రారంభానికి సిద్ధం చేయాలి
- రాష్ట్రంలోనే మన జిల్లా మోడల్‌గా ఉండాలి

నవతెలంగాణ-పాల్వంచ



మన ఊరు మనబడి పాఠశాలల మరమ్మత్తు పనుల్లో నాణ్యతను పాటించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అనుదీప్ తెలిపారు. శుక్రవారం పాల్వంచలోని నూతన కలెక్టరేట్ భవనంలో మనఊరు మనబడి పాఠశాలల పనుల పురోగతిపై విద్య ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ పాఠశాలలుగా ఎంపిక చేసిన 46 పాఠశాలలను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని చెప్పారు. పాఠశాలల మరమ్మత్తు పనులను ప్రధానోపాధ్యాయులు ఎంఈఓలు, ఏఈలు, నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన నాణ్యమైన విద్యనందించేందుకు త్వరితగతిన ఈ కార్యక్రమంలో ఎంపిక చేసి పాఠశాలలకు మరమ్మత్తు చేసి గ్రీనరీ లాన్ సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. 46 పాఠశాలలకు ప్రహరీ నిర్మించాల్సి ఉండగా ఇప్పటివరకు 28 పాఠశాలలో ప్రహరీ నిర్మాణాల పనులు పూర్తి అయ్యాయని మిగిలిన పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. మొదటి విడత ఎంపిక చేసిన 368 పాఠశాలల్లో 364 పాఠశాలల్లో పనులు ప్రారంభం అయ్యాయని పనులు వేగవంతం చేయించుకోవాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యా యులదేనని చెప్పారు. 59 లక్షల విలువల ఉపాధి హామీ పనులు తయారు చేశారని ఆ ప్రకారం పనులు వేగవం తంగా పూర్తి చేయుటకు చర్యలు చేపట్టాలని అన్నారు. ఉపాధ్యాయులు ఎంఈఓలు ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేసిన పాఠశాలలో పనులు బాగా జరిగాయని అభినందించారు. కొత్తగూడెం మున్సిపాలిటీలో పలు పాఠశాలల్లో నత్తనడకన నడవడం పట్ల అసంపూర్తి వ్యక్తం చేశారు. ఈనెల 30వ తేదీన మరోసారి సమీక్ష నిర్వహి స్తామనని అప్పటివరకు మోడల్ పాఠశాలల ఫోటోలు వీడి యోలతో హాజరు కావాలని ఆదేశించారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో మన జిల్లా రాష్ట్రస్థాయిలో మోడల్‌గా ఉండాలని ఆయన చెప్పారు. అనంతరం మోడల్ పాఠశాలల ప్రగతిని ఆయన ఇంజనీ రింగ్ ప్రధానోపాధ్యాయులను ఎంఈఓలను అడిగి తెలుసు కుని పూర్తి చేయాల్సిన పనులకు దిశ నిర్దేశంచశారు. డీఈఓ సోమశేఖరశర్మ, రోడ్లు భవనాలు పంచాయతీరాజ్, గిరిజన ఇంజనీరింగ్ ఐడీసీ ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రవర్తన పై అవగాహనా సదస్సు

- షీ టీం ఎస్ఐ రమాదేవి

నవతెలంగాణ-చంద్రుగొండ

మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ పోలీసు మహిళా భద్రత విభాగం వారు 9, 10వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు ప్రవర్తన, సైబర్ నేరాలు మొదలగు అంశాలపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉండేటి ఆనందకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ అవగాహన సదస్సులో షీ టీం సబ్ ఇన్స్పెక్టర్ పి.రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులు మంచి ప్రవర్తనను కలిగి ఉండాలని, క్రమశిక్షణతో మంచి అలవాట్లు నేర్చుకోవాలని, రోజు పాఠశాలకు యూనిఫామ్ ధరించి రావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో చంద్రుగొండ ఏఎస్ఐ కృష్ణారావు, ఉపాధ్యాయులు మంజు శ్రీ, డి.నరసింహారావు, ఎండి వాజిద్ ఏ.లక్ష్మణ్, శకుంతల, బి.కృష్ణ, షేక్ కైసరి బేగం, షీ టీమ్స్ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

నాటక రంగాన్ని బతికేంచేందుకు బతుకుతున్న సురభి కళాకారులు

- రాబోయె తరాలకు గుర్తుండేలా చేయాలి
- అబ్బుర పరిచిన సురభి నాటకాలు
- కలెక్టర్ దురిశెట్టి అనుదీప్

నవతెలంగాణ-కొత్తగూడెం



అధునిక టెక్నాలజీలో అంతరించి పోతున్న నాటక రంగాన్ని బతికేంచేందుకు బతుకుతున్న సురభి కళాకారులకు చేయూత ఎంతో అవసరమని, ఈ పౌరాణిక, జానపద, నాటక రంగాన్ని రాబోయె తరాలకు గుర్తుండేలా చేయాలని, కొత్తగూడెంలో గత వారం రోజులుగా నిర్వహించి సురభి నాటకాలు జిల్లా ప్రజలను అబ్బుర పరిచాయని కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ అన్నారు. గురువారం కొత్తగూడెం క్లబ్‌లోనాటకాల ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. సురభి కళాకారులు అద్భుత నాటక ప్రదర్శనతో ప్రజలను ఆకట్టుకున్నారని అభిప్రాయపడ్డారు. మొదటి రోజు, చివరి రోజు మాయాబజార్ నాటికను కలెక్టర్ ఆసాంతం తిలకించారు. నాటక రంగాన్ని బతికించడానికి సురభి కళాకారులు కంకణం కట్టుకుని ప్రదర్శనలు ఇస్తున్న తీరు అభినందనీయమన్నారు. పద్యాలు, పాటలు, నటన ఏకకాలంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రదర్శన చేయడం ఎంతో కష్టంతో కూడికున్నదని చెప్పారు. వారం రోజుల పాటు సురభి కళాకారులు మాయాబజార్, శ్రీనివాస కళ్యాణం, పాతాళ భైరవి, భక్త ప్రహ్లాద, బాలనాగమ్మ, లవకుశ వంటి అద్భుతమైన పౌరాణిక, జానపద నాటక కళా ప్రదర్శనలతో కొత్తగూడెం పట్టణ ప్రజలను మంత్ర ముగ్ధులను చేశారని కితాబిచ్చారు. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి సాధించిన ఈ రోజుల్లో అలనాటి ఘట్టాల ను ఎంతో అద్భుతమైన సెట్టింగులతో, మాయ జాలంతో ప్రేక్షకులకు కళ్లకు కట్టినట్లు చూపించి, అలరించే విధంగా నటించారన్నారు. ఇటువంటి కళలను బతికించడం ఒక చాలెంజ్ అని, ప్రజలు ఈ నాటికలను వీక్షించి ఎంతో ఎంజాయ్ చేశారని చెప్పారు. ఇటువంటి నాటికలతో కళలను ఇంకా బతికించేందుకు వీరు చేస్తున్న కృషిని కలెక్టర్ అభినందించారు. సురభి కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ శీలం శ్రీనివాస రావు, డిఆర్ఓ అశోక్ చక్రవర్తి, పాల్వంచ మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, పాల్వంచ తహసీల్దార్ రంగ ప్రసాద్, సురభి నాటిక సమాజ నిర్వహకులు, కళాకారులు వేణుగోపాలరావు పాల్గొన్నారు.

విస్తరిస్తున్న బహుళ సముదాయ సంస్కృతి

- విస్మరిస్తున్న అగ్నిమాపక నివారణా చర్యలు
- ప్రమాదం జరిగితే?

నవతెలంగాణ-అశ్వారావుపేట



ప్రమాదం ఏదీ చెప్పి రాదు. ప్రాణం చెప్పి పోదు. ఇవి రెండూ కాకతాళీయంగా సంభవించేవి కాబట్టే ముందస్తు అప్రమత్తతో వ్యవహరించాలి అనేది ప్రాథమిక జీవన సూత్రం. ఇది అందరికీ తెలిసిందే అయినా మనం ఆపదలో పెడుతున్నాం అనుకుంటేనే జాగ్రత్తలు తీసుకుంటాం. ఇంతలోనే జరగాల్సిన నష్టం జరిగితీరుతుంది. ప్రస్తుతం గోపాల్ రావు పేటలో బహుళ అంతస్తుల భవనంలో సంభవించిన అగ్నిప్రమాదం ప్రతీ పట్టణానికి గుణపాఠం అనే చెప్పుకోవాలి. రోజు రోజు కీ పెరిగిపోతున్న పట్టణీకరణలో బహుళ అంతస్తులు, సముదాయాలు శరవేగంగా విస్తరిస్తున్నాయి. కానీ నియమం నిబంధనలు మాత్రం అంతంత మాత్రమే అని చెప్పుకోవాలి. వాస్తు ప్రకారం ఏది ఎక్కడ ఉండాలి, ఏ గుమ్మం ఎటు వైపు ఉండాలనే నియమం తప్పక పాటిస్తాం. కానీ అగ్ని ప్రమాదం సంభవిస్తే ఈ నియమాలు ఏమీ పని చేయవని తెలిసినా అగ్నిమాపక నియమాలు మాత్రం గాలికి వదిలేస్తాం. నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేటలో శరవేగంగా రియల్ ఎస్టేట్ వ్యాపార వృద్ధితో పాటు బహుళ అంతస్తుల, సముదాయాల సంస్కృతీ విస్తరిస్తోంది. మేజర్ పంచాయతీ అశ్వారావుపేటలో 54 గ్రౌండ్, జీ ప్లస్ ఒన్, జీ ప్లస్ టూ 45 మొత్తం 167 బహుళ భవన సముదాయాలు ఉన్నట్లు పంచాయతీ నివేదికలు తెలుపుతున్నాయి. అగ్నిమాపక నిబంధనలు ప్రకారం 18 మీటర్లు ఎత్తు పై బడిన 6 ఫ్లోర్ల నివాస సముదాయాలు, 18 మీటర్లు ఎత్తు పై బడిన 6 ఫ్లోర్ బహుళ అంతస్తుల భవనాలకు తప్పని సరిగా అగ్నిమాపక శాఖ నుండి ఎన్ఓసీ అనుమతి ఉండాలి. ఈ నిబంధనలు లోపు భవనాలకు అయినా కూడా ఒక వేళ అగ్నిప్రమాదం జరిగితే ఆ సముదాయాలు చుట్టూ అగ్నిమాపక శకటం తిరిగే వీలుగా 6 మీటర్లు వెడల్పును ఖాళీ స్థలం తప్పని సరిగా ఉండాలి. ప్రతీ సముదాయం లోనూ ఫైర్ సేఫ్టీకి అనుగుణంగా అగ్ని ప్రమాదాన్ని నివారించే నీటి సదుపాయం, మంటలు ఆర్పే పరికరాలు నిత్యం అందుబాటులో ఉండాలి. ఉంచే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులు తెలుపుతున్నారు.

శ్రద్ధగా కంటి వెలుగు పరీక్షలు నిర్వహించాలి : పీఓ

నవతెలంగాణ-అశ్వాపురం



కంటి వెలుగు కేంద్రాలకు వచ్చేవారికి శ్రద్ధగా కంటి పరీక్షలు నిర్వహించి, వారి కంటి లోపాలను గుర్తించాలని ఐటీడీఏ పీవో గౌతమ్ పోట్రు అన్నారు. శుక్రవారం మండలంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాలను ఆయన సందర్శించి, మాట్లాడారు. కేంద్రంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న తీరును ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. కంటిలోని లోపాలను గుర్తిస్తున్న తీరుతెన్నులను అక్కడి వైద్య అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కేంద్రాలకు ప్రతిరోజు ఎంతమంది వస్తున్నారు, వచ్చిన వారికి ఏ విధమైన సౌకర్యాలు కల్పిస్తూ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారన్న తీరుపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో కంటి సమస్యతో బాధపడుతున్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టకుండా ఇచ్చిన టార్గెట్‌ను కచ్చితంగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కేంద్రాలకు వచ్చే వారికి ఎటువంటి లోటుపాట్లు కలగకుండా స్థానిక అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట ఐటీడీఏ డీడీటీడబ్ల్యూ ఆర్.రమాదేవి, తహశీల్దార్ వి.సురేష్ కుమార్, ఏటీడీఓ పి.నరసింహారావు, ఆర్ఐ నాగమణి ఉన్నారు.



టీబీ వ్యాధిగ్రస్తురాలికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-బూర్గంపాడు

మండల పరిధిలోని సోంపల్లి గ్రామానికి చెందిన కనకం భవానికి మోరం పల్లిబంజర్ గ్రామానికి చెందిన నేస్తం వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ తరుపున శుక్రవారం రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. గత ఆరు సంవత్సరాలుగా బోన్ టిబి వ్యాధితో బాధపడుతుంది. వ్యాధి తీవ్రత ఎక్కువ కావడంతో రెండు కాళ్ళు పూర్తిగా చలనం కోల్పోవడం వల్ల మంచానికే పరిమితమైంది. దీంతో ఆమె తల్లి నడిపింటి అలివేలు, భర్త రవి ఆమెను ఎంతోమంది వైద్యులు వద్ద వైద్యం చేయించిన కొంచెం కూడా ఆమె ఆరోగ్యం మెరుగుపడలేదు. ఈమెకు ఇద్దరూ ఆడ పిల్లలు మానస, జయశ్రీ ఉన్నారు. నిరుపేద కుటుంబం కావడం తన ఆరోగ్యం బాగాలేక పోవడంతో ఇద్దరూ పిల్లలతో తన తల్లి అలివేలు వద్దనే వుంటుంది. భర్త రవి తాపీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తనకు వచ్చే చాలీచాలని సంపాదన భవాని వైద్య ఖర్చులకు కూడా సరిపోక పోవడంతో ఆమెకు వైద్యం చేయించే స్తోమత లేక దాతలు సహాయం కోరారు. వీరి కుటుంబ పరిస్థితి ట్రస్ట్ దృష్టికి రావడంతో శుక్రవారం వారి వద్దకు వెళ్లి ట్రస్ట్ నుండి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్ర మంలో ట్రస్ట్ చైర్మన్ బత్తుల రామకొండా రెడ్డి, సెక్రటరీ ఇండ్ల వెంకట రాజేష్, జాయింట్ సెక్రటరీ ఆవుల శివ నాగిరెడ్డి, సభ్యులు పేరం రామిరెడ్డి, డి.బాలనారాయణరెడ్డి, సొసైటీ డైరెక్టర్ తోకల అనిత, వార్డు సభ్యులు కనుకు సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు సెంటర్లు తనిఖీ

నవతెలంగాణ-టేకులపల్లి



టేకులపల్లి మండలంలో కంటి వెలుగు సెంటర్లను పలు గ్రామాలలో నోడల్ అధికారి డాక్టర్ మణికంఠ రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు పంచాయతీ సెంటరు, సులానగర్ పంచాయతీలో జరుగుతున్న రెండు సెంటర్లను పరిశీలించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్, కంటి వెలుగు వైద్యాధికారులు పావని, ప్రసన్న, సనత్ కుమార్, ఫాతిమా, మంజీలాల్, కమ్యూనిటీ ఆఫీసర్ సీతమ్మ పబ్లిక్ హెల్త్ నర్సు సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

దళిత బంధును లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ అనుదీప్
- నిధులు మంజూరుకు ప్రతిపాదనలు
- 2వ దశ దళితబంధు నియోజకవర్గానికి 500 యూనిట్లు

నవతెలంగాణ పాల్వంచ



దళితుల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా చేపట్టిన దళితబంధు పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించు విధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశపు హాలులో దళితబంధు యూనిట్లు గ్రౌడింగ్, నిర్వహణ తదితర అంశాలపై నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనిట్లు నిర్వహణ ప్రక్రియను పర్యవేక్షణ చేస్తూ ప్రతి వారం నివేదికలు అందచేయాలని ఎంపీడీఓలను ఆదేశించారు. దళితుల సామాజిక ఆర్థికాభివృద్ధికి సరికొత్త బాటలు వేసిన దళితబంధును లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. నిధులు మంజూరు చేయుటకు అవకాశం ఉన్న యూని ట్లుకు తక్షణమే నిధులు మంజూ రుకు ప్రతిపాదనలు పంపాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీని ఆదేశిం చారు. జిల్లాలో 461 యూనిట్లు గ్రౌండింగ్ చేశామని చెప్పారు. మండల, మున్సిపాల్టీలు వారిగా యూనిట్లు నిర్వహణ ప్రక్రియను నియోజకవర్గ దళితబంధు ప్రత్యేక అధికా రులను, ఎంపీడీఓలను, మున్సిపల్ కమిషనర్లును అడిగి తెలుసుకున్నారు. మంజూరు చేసిన నిధులు ప్రకారం యూనిట్లు నిర్వహణ లబ్ధిదారుల ఆదాయ, వ్యయాల వివరాలపై నివేదికలు అందచేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రెండవ దశ దళితబంధు పథకంలో నియోజకవర్గానికి 500 యూనిట్లు ప్రకటించే అవకాశం ఉన్నందున అధికారులు సమాయత్తం కావాలని చెప్పారు. పాల ఉత్పత్తి యూనిట్లును పశు సంవర్ధక శాఖ అధికారులు పర్యవేక్షణ చేయాలని, పశువుల ఆరోగ్య పరిస్థితులు, పాల దిగుబడి తదితర అంశాలను కూలం కషంగా పరిశీలన చేయాలని ఆయన పేర్కొన్నారు. యూనిట్లు ఏర్పాటుకు నియమించిన సెక్టోరియల్ అధికారులు యూనిట్లు కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షణ చేయాలని చెప్పారు. మండలస్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీలు యూనిట్లు నిర్వహణ తీరును పర్యవేక్షణ చేస్తూ లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముత్యం, దళితబంధు ప్రత్యేక పర్యవేక్షణ మరియు మైనార్టీ సంక్షేమ అధికారి సంజీవరావు, దళితబంధు నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

సిల్వర్ జూబ్లీలో శ్రీ చైతన్య విద్యాలయం

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మండల పరిధిలోని రాజపురం గ్రామంలో శ్రీ చైతన్య విద్యాలయాన్ని వజ్రాల పుల్లారెడ్డి స్థాపించి 2023వ విద్యా సంవత్సరానికి 25 ఏండ్లు పూర్తి చేసుకొని సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు పాటశాలలో ప్రిన్సిపాల్ వజ్రాల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా నిర్వహించారు. పాటశాల వ్యవస్థాపకులు పుల్లారెడ్డి ఆయన సతీమణి రామకృష్ణమ్మను పాటశాలలో పని చేస్తున్న టీచర్లు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పాటశాల వ్యవస్థాపకులు పుల్లారెడ్డి మాట్లాడుతూ రాజపురం గ్రామంలో ప్రయివేట్ పాటశాల స్థాపించి 25 ఏండ్లు కొనసాగించడం పట్ల ఎంతో సంతోషంగా ఉందని, ఇదే పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు అమెరికా వంటి దేశాలలో ఉన్నతమైన ఉద్యోగాలు చేస్తున్నారని అదేవిధంగా ఎంతో మంది విద్యార్థులు పోలీస్ టీచర్లు, వీఆర్ఏలు కొంత మంది రాజకీయ రంగంలో ఉన్నతమైన పదవులు చేస్తున్నారని, కొంత మంది ఇదే పాటశాలలో చదువుకొని ఇక్కడే టీచర్‌గా పనిచేస్తూ చూడటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎ ల్ల టా ం వా తా వ ర ణ ం లో విశాలమైన అవరణంలో వందల మందికి విద్యను అందించడంలో వున్న సంతోషం మరేది లేదని అన్నారు. చుట్టుపక్కల గ్రామాల వారు సహకారంతో స్వగ్రామంలో ఎంతో మంది విద్యార్థులను బావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో శ్రీ చైతన్య విద్యాలయం స్టాఫ్ ఎంతో నైపుణ్యంతో పని చేస్తున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల టీచర్లు నందిని, రామయ్య, మారేశ్వారావు, లక్ష్మి, ఉష, ఫాహిమా, సుల్తాన్, కరుణ, అనుపమ, శిల్ప, నజిమా, భాగ్యలక్ష్మి, నాగలక్ష్మి, పాటశాల సిబ్బంది విజయకృష్ణ విద్యార్థులు పాల్గొన్నారు.



www.praja.khammam@gmail.com
నవతెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం 21 జనవరి 2023



రైతు బంధు
పాత బకాయి కింద జమ కట్టడం విచారకరం

- డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ కొత్వాల
- బ్యాంకు అధికారులను నిలదీసిన కొత్వాల
- తిరిగి రైతు ఖాతాలో జమ చేసిన బ్యాంకు అధికారులు

నవతెలంగాణ-పాల్వంచ

రైతుల బాగోగుల కోసం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతుబంధు సాయాన్ని బ్యాంకు అధికారులు పాత బకాయి కింద జమ చేసుకోవడం విచారకరమని, ఆ విధంగా బ్యాంకులు చేపడితే ఆందోళనలు చేస్తామని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు హెచ్చరించారు. పాల్వంచ మండలం పరిధిలోని సోములగూడెం పంచాయతీ కమ్మరిగూడెం గ్రామ రైతులకు ఇటీవల మంజూరు అయినా రైతుబంధు పైకం యూనియన్ బ్యాంకులో ఉన్న ఖాతాలో జమ అయింది. రైతుబంధు పైకం కోసం రైతులు రోజు బ్యాంకు చుట్టూ తిరిగిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న విషయాన్ని రైతులు కొత్వాల దృష్టికి తీసుకెళ్లారు. విషయం విన్న వెంటనే స్పందించిన కొత్వాల శుక్రవారం యూనియన్ బ్యాంకుకు వెళ్లి మేనేజర్ శ్రీకాంత్, అసిస్టెంట్ మేనేజర్ శర్మ, ఫీల్డ్ ఆఫీసర్ నాగార్జునను నిలదీశారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ రైతుబంధు పెట్టుబడి సహాయాన్ని బ్యాంకులు అప్పుల్లో జమ చేసుకోవద్దని, సాక్షాత్తు రాష్ట్ర ఆర్థికమంత్రి హరీష్ రావు బ్యాంకు అధికారులను ఆదేశించినప్పటికీ, బాకీ కింద జమ చేసుకోవడం నక్కపై తాటిపండు పడిన చందంగా" రైతుల పరిస్థితి తయారైందని అన్నారు. స్పందించిన యూనియన్ బ్యాంకు అధికారులు, రైతులకు ఖాతాల్లో జమ అయిన రైతు బంధు పైకాన్ని వెంటనే అందజేస్తామని, కొత్వాల సాక్షిగా పైకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచులు భూక్య రవీందర్, బీఆర్ఎస్ నాయకులు ఎలికా వెంకట్రావు, సోయం రాజేష్, చర్చి పాస్టర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాజిక్ ఢీకొని చిన్నారికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి (గుండాల)



మ్యాజిక్ ఢీకొని చిన్నారికి తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం గుండాల మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని మోదుగులగూడెం గ్రామానికి చెందిన నెల్లూరి సుమశ్రీ శుక్రవారం రోడ్డు పక్కన ఆడుకుంటున్న సమయంలో గుండాల నుంచి అతి వేగంగా వెళ్తున్న మ్యాజిక్ ఢీ కొట్టింది. దాంతో చిన్నారి కాలు విరిగడంతో విపరీతంగా రక్త స్రావం జరిగింది. రక్తపు మడుగులో పడివున్న సుమశ్రీని కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తరలించారు.



కష్టపడ్డ వారి పరిస్తితి ఏంటి...?

- అయోమయంలో నాయకులు, కార్యకర్తలు
- బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యక్తల ముఖ్య సమావేశం

నవతెలంగాణ-జూలురుపాడు

బీఆర్ఎస్ పార్టీ జూలూరుపాడు మండల ప్రధాన కార్యదర్శి నున్న రంగారావు వారి జామ తోటలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముఖ్య నాయకులు పాల్గొనివారు మాట్లాడుతూ.. వైరా శాసనసభ్యులు, లావుడియా రాములు నాయక్ గెలుపు కోసం అలుపెరగని కష్టపడ్డమన్నారు. అలాగే మళ్లీ రెండోసారి గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసి భారీ మెజార్టీతో గెలిపించుకుని మండలాన్ని అభివృద్ధి చేసే విధంగా కృషి చేస్తామని వారు అన్నారు. ఈ నెల 18న జరిగిన ఖమ్మంలో జరిగిన బీఆర్ఎస్ బహిరంగకు ప్రస్తుతం ఉన్న మండల పార్టీ బాధ్యులు మమ్మల్ని పట్టించుకోకుండా వారి వర్గానికి పిలిపించుకుని వారికే కొమ్ము కాస్తున్నాడని దీని గురించి ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు, యద్దళపల్లి వీరభద్రం, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నున్న రంగారావు, బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు చౌడం నరసింహారావు, నాయకులు మోదుగు రామకృష్ణ, వాసు, రామ్ శెట్టి రాంబాబు, మాజీ ఎంపీటీసీ పుప్పల నరసింహారావు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

నవతెలంగాణ-ఇల్లందు



గత రెండేళ్లుగా ట్రైబల్ వెల్ఫేర్ పీఎంహెచ్ హాస్టల్స్ లోపని చేస్తున్న ఔట్ సోర్సింగ్ వర్కర్స్‌కు జీతాలు రాక పోవడంతో గత 18 రోజులుగా ఐటీడీఏ, ఏటీడీఓ ఆఫీసు ముందు నిరవధిక సమ్మె చేస్తున్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి ఎస్‌హెచ్ సుల్తానా సంఘీభావంగా పాల్గొని ప్రసంగిస్తూ ఒక రంగ కార్మికులు సమ్మె చెస్తే మిగిలిన వారు మద్దతు తెలిపి కాపాడాలని కోరారు. వీరు చేస్తున్న సమ్మెకు పూర్తి మద్దతు ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు అబ్దుల్ నబి, తాళ్లూరి కృష్ణలు మాట్లాడారు. సమ్మెలో ఈసం పద్మ, కుంజ జయ, తోలెం సుజాత, అనిత, విజయ భారతి, తాటి భారతి, రమణమ్మ దీప, వర్స సుధ, ఈసం బద్రమ్మ, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



సీఎం ఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన జెడ్పీటీసీ

నవతెలంగాణ-బూర్గంపాడు

మండలంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను జడ్పీటీసీ కామి రెడ్డి శ్రీలత శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ప్రాణప్రాయ స్థితిలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద చికిత్సకు తగిన సహాయం బాధితులకు ఆందిస్తుందని ఆమె అన్నారు. నిరుపేదల సంక్షేమం కోసం పూర్తి భరోసా కాల్పిస్తుందని ఆమె అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు. నకిరిపేటకు చెందిన ఆర్.వెంకటేశ్వర్లుకు రూ.26,000, సీహెచ్ నాగమ్మకు రూ.22,000, బూర్గంపాడుకు చెందిన వై.రాంబాబుకు రూ.51 వేయి, కె.పుల్లయ్యకు రూ.60 వేలు, ఎం.లక్ష్మమ్మకు రూ.51 వేలు, సంజీవరెడ్డిపాలెంకు చెందిన జి.శేషరత్నంకు రూ.60 వేలు, సారపాకకు చెందిన వెంకటరమణకు రూ.60 వేలు చెక్కులను అందజేశారు. అలాగే పాత సారపాక జి..వెంకట లక్ష్మికు రూ.41,500, కె.సుప్రియకు రూ.40 వేలు, గాంధీనగర్‌కు చెందిన దోరయ్ రాజుకు రూ.29 వేలు, ఇరవెండి కు చెందిన బి.కమలకు రూ.33 వేలు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, బూర్గంపాడు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, మండల ఉపాధ్యక్షుడు జక్కం సుబ్రహ్మణ్యం, మండల యూత్ ప్రెసిడెంట్ గోనెల నాని, సొసైటీ డైరెక్టర్ బొల్లు రవి, మాజీ ఎంపీటీసీ జక్కం సర్వేశ్వరరావు, సారపాక టౌన్ ప్రెసిడెంట్ కొనకంచి శ్రీను ప్రధాన కార్యదర్శి తిరుపతి ఏసోబు, పార్టీ మండల నాయ కులు చుక్కపల్లి బాలాజీ, చిరంజీవి భూక్యా కృష, శ్రీను, నాగేందర్, నకిరిపేట గ్రామ పెద్దలు శివ, బొల్లా వెంకన్న, నల్లమోతు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్ణశాల రామయ్యను దర్శించుకున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి

నవతెలంగాణ-దుమ్ముగూడెం



ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల రామయ్యను అటవీశాఖ రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ మదన్ గోపాల్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది ప్రధాన ద్వారం వద్ద స్వాగతం పలికి గర్భాలయంలో ప్రత్యేక పూజలు అనంతరం ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆయన సీత కుటీర ప్రదేశంతో పాటు ఉమా రామలింగేశ్వర స్వామి వారి ఆలయాన్ని దర్శించుకుని, నార చీరల ప్రదేశాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పద్మశాలి విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ చంద్రశేఖర్, రేంజ్ అధికారి కనక రత్నం, ఆర్ఐలు ఆదినారాయణ, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

సమాచారాన్ని అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది

- సమాచార హక్కు చట్టం కమిషనర్

నవతెలంగాణ-భద్రాచలం



సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలు కోరిన సమాచారాన్ని సెక్షన్ 7(1) ద్వారా 30 రోజులలో అందించాల్సిన బాధ్యత ఆయా శాఖల అధికారులపై ఉందని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ డాక్టర్ గుగులోత్ శంకర్ నాయక్ తెలిపారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశం మందిరం హాలులో సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం అడిగిన పౌరులకు, పౌర సమాచార అధికారులతో 56 సోకాజ్ కేసులు 17 జనరల్ నోటీసులకు సంబంధించిన కేసులను విచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం విధులు, పరిధిపై పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాలనలో పారదర్శకత అధికార యంత్రాంగంలో జవాబుదారితనంతో ప్రజల కోరిన సమాచారాన్ని సకాలంలో ఇవ్వాలని, అలా సకాలంలో సమాచారం ఇవ్వనీ కారణంగా కమిషన్ నేరుగా ప్రజలు, ఆయా శాఖల పౌర సమాచార అధికారులతో ఐటీడీఏ కార్యాలయంలో కేసులను విచారణ ప్రక్రియ నిర్వహించి కోరిన సమాచారాన్ని అందజేసినట్లు చెప్పారు. సెక్షన్ 7(1) ప్రకారం 30 రోజుల కాల వ్యవధిలో సమాచారం రాకపోతే మొదటి అప్పీల్ చేసుకోవడానికి ప్రజలకు అవగాహన కల్పించవలసిన అవసరం ఉంది అని చెప్పారు. 30 రోజుల వ్యవధిలో సమాచారం ఇవ్వని సందర్భంగా 19(1) ప్రకారం మొదటి అప్పీల్ చేసుకుంటే మొదటి అప్పి లేట్ అధికారి సమాచారం విచారణ చేపట్టి ఇప్పించాల్సిన అవసరం ఉంది అప్పిలేట్ అథారిటీ సమస్య పరిష్కరించాలని తెలిపారు. అప్పిలేట్ అథారిటీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టని పక్షంలో సెక్షన్ 19(3) కమిషనర్‌కి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఈ జాప్యాన్ని తొలగించాలని ప్రజల్లో చైతన్యం నింపేందుకు, 30 రోజుల కాలవ్యవధిలో సమాచారం ఇప్పించే విధంగా కమిషన్ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. శుక్రవారం జిల్లాకు సంబంధించిన 73 కేసుల విచారణ నిర్వహించి దరఖాస్తుదారులకు కోరిన సమాచారం అందజేసినట్లు తెలిపారు. పౌర సమాచార అధికారులు సెక్షన్4(1) బి ప్రకారం 17 అంశాలతో కూడిన సమాచారం ఏర్పాటు చేయాలని చెప్పారు. సెక్షన్4(1) బి నిర్వహణ వల్ల కార్యాలయ విధులు నిర్వహణ, కార్యాలయ సమగ్ర సమాచారం ప్రజలకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. సెక్షన్5(1), 5(2) ప్రకారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం 2005లో పౌర సమాచార అధికారి మొదటి అథారిటీ వారి పేర్లు ఫోన్ నెంబర్లు వివరాలతో అమలు బోర్డులు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సెక్షన్4(1) తప్పనిసరిగా అలాగే ప్రతి పౌర సమాచార అధికారి సమాచార హక్కు చట్టం 2005 సమాచార రిజిస్టర్ 16 కాలాల కూడిన మొదటి అప్లై అథారిటీ 8 కూడిన రిజిస్టర్ ని మైంటైన్ చేయాలి పాటించాలి దాని ప్రకారం నిర్వహించాలని పౌర సమాచార అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో 500 పై చిలుకు కేసులు పరిష్కరించినట్లు వివరించారు. రాష్ట్రస్థాయిలో కమిషన్ 39 వేలు కేసులకు గాను 34 వేలు కేసులు పరిష్కరించడంలో కమిషన్ విజయవంతంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. సమాచార హక్కు చట్టాలపై ప్రజలను చైతన్యపరచుటలో మీడియా సహకారం అందించాలని ఆయన కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, మున్సిపాలిటీలు, అటవీ, విద్యాశాఖలకు సంబంధించి ఎక్కువ కేసులు వస్తున్నాయని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, పరిపాలన అధికారి భీమ్ సమాచార హక్కు చట్టం కమిషనర్ డాక్టర్ గుగులోత్ శంకర్ నాయక్‌కు మర్యాదపూర్వకంగా కలిసి జిల్లాలోని ఐటీడీఏ పరిధిలోని గిరిజన మండలాలలో సమాచార హక్కు చట్టం పరిధి విధులపై సంబంధిత అధికారులకు అవగాహన కొరకు అవగాహన సదస్సులు నిర్వహించుటకు ప్రణాళికలు సిద్ధం చేస్తామని ఆయన వివరించారు. అనంతరం షాకాజ్ నోటీసులకు సంబంధించిన కేసులు జనరల్ నోటీసులకు సంబంధించిన కేసులను ఒక్కొక్కరిని పిలిపించి వారి సమస్యలను విచారణ చేపట్టారు.



ప్రభుత్వ విప్ రేగాకు సన్మానం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

పినపాక శాసనసభ్యులు ప్రభుత్వ విప్ రేగా కాంతారావును మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. చర్ల మండలంలో జరిగే అంతరాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించడానికి వెళ్తూ లక్ష్మీనగరం పార్టీ కార్యాలయంకు వచ్చిన ఆయనకు పార్టీ మండల అధ్యక్షులు అన్నె సత్యనారాయణ మూర్తి, ఎంపీపీ రేసు లక్ష్మీ, కార్యదర్శి కణితి రాముడు, అధికారప్రతినిది జానీపాషా, ఎంపీటీసీ సోడి తిరుపతిరావు, సర్పంచ్ మట్టా వెంకటేశ్వరరావు, నాయకులు కణితి లక్ష్మణ్, లంక శివ, కెల్లా శేఖర్, కొత్తూరి సీతారామారావు, కొత్త మల్లేశ్, జిలకర్ర గంగరాజు, మడకం భూపతి, పాయం వెంకటేష్, యాంబడి అర్జున్, పుడకలపలి శ్రీను తదితరులు ఉన్నారు.

ప్రత్యేక ఓటర్ నమోదు ప్రక్రియ పై కలెక్టర్‌కు అభినందనలు

- పది రోజుల్లో ఫొటోస్ సిమిలర్ ఎంట్రీస్ విచారణ పూర్తి చేస్తాం : కలెక్టర్ అనుదీప్

నవతెలంగాణ-పాల్వంచ





ప్రత్యేక ఓటర్ నమోదు ప్రక్రియ పై చేపట్టిన చర్యలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్‌ను అభినందించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజు ఫోటోస్ సిమిలర్ ఎంట్రీస్, ఎన్నికల గురు కార్డులు పంపిణీ, జాతీయ ఓటర్ల దినోత్సవం, ఆధార్ లింకేజీ అంశాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొని, మాట్లాడారు. ఫొటోస్ సిమిలర్ ఎంట్రీస్ విచారణ ప్రక్రియను 10 రోజుల్లో పూర్తి చేస్తామని కలెక్టర్ అండ్ జిల్లా ఎన్నికల అధికారి అనుదీప్ తెలిపారు. జిల్లాలో మొదటి విడతలో 25242 ఎన్నికల గుర్తింపు కార్డులు పంపిణీ చేశామని, వాటిలో సూచించిన చిరునామాలో లేని కారణంగా 234 కార్డులు మిగిలిపోయినట్లు చెప్పారు. ఆయా మండలాల్లో క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి కార్డులు పంపిణీ చేయుటకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. రెండో విడతలో 35,000 నూతన ఎపిక్ కార్డులు ఎన్నికల కార్యాలయం నుండి జిల్లాకు రావాల్సి ఉన్నదని రాగానే పంపిణీ చేయుటకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఓటు హక్కు వినియోగం, ప్రలోభాలకు గురికాకుండా నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగం తదితర అంశాలపై పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన, వక్రుత్వ, క్విజ్, పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయ డంతో పాటు నూతన ఓటర్లకు ఎపిక్ కార్డులు జారీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎన్నికల సెక్షన్ పర్యవేక్షకులు ఎంప రాజు, సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ను బాధ్యతాయుతంగా వాడుకోవాలి

- రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి అధ్యక్షులు తన్నీరు

నవతెలంగాణ-కొత్తగూడెం



విద్యుత్‌ను బాధ్యతాయుతంగా వాడుకోవాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి అధ్యక్షులు తన్నీరు శ్రీరంగారావు అన్నారు. శుక్రవారం కొత్తగూడెంలో విద్యుత్ వినియోగదారులతో ముఖాముఖి నిర్వహిచారు. విద్యుత్ వినియోగంలో వస్తున్న సమస్యలు, అధిక బిల్లులు, ఇరత సమస్యల పరిష్కారం కోసం వినియోగదారులతో అవగాహనా సదసుస్స నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగం అభివృద్ధికి ఇరిగేషన్ ప్రాజెక్టుపై అనేక పెట్టుబడులు పెట్టిందన్నారు. దాని తరువాత విద్యుత్ సంస్థపై పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టిందని, ఇది ముఖ్యమైన వనరుగా గుర్తించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థలో వినియోగ దారులకు మెరుగైన విద్యుత్ అందించేందుకు రూ.38 వేల కోట్లు వెచ్చించాయని తెలిపారు. యాదాద్రి, భద్రాద్రి, కేటీపీఎస్, రామగుండం తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉత్పత్తి కోసం రూ.45 వేల కోట్లు కేటాయించిందని తెలిపారు. రైతంగానికి నాణ్యమైన విద్యుత్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. విద్యుత్ సరఫరాలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినప్పుడు దానిని మరమత్తులు చేయాల్సిన బాధ్యత విద్యుత్ సంస్థ అధికారులపై ఉందన్నారు. వినియోగ దారుల నుండి ఎలాంటి రుసుము వసూలు చేయవద్దని చెప్పారు. వినియోగదారులకు అందించే హక్కులను వారికి అందే విధంగా విద్యుత్ సంస్థ అధికారులు చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఎండి. మనోహర్‌రాజు, ఫైనాన్స్ మెంబర్ బండారు కృష్ణయ్య, విద్యుత్ వినియోగ దారులు, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఫిబ్రవరి 3,4,5 తేదీల్లో
అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవములు

- 25వేల మంది భక్తులకు అన్నదానం
- కమిటీ సభ్యులు వెల్లడి

నవతెలంగాణ-పాల్వంచ

తెలంగాణ రాష్ట్రంలోనే పేరొందిన అయ్యప్పస్వామి దేవాలయంగా కీర్తించబడుతున్న పాల్వంచ నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి దేవాలయంలో ఫిబ్రవరి 3,4,5 తేదీల్లో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం చేపట్టనున్నామని అయ్యప్ప స్వామి కమిటీసభ్యులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం దేవాలయం ప్రాంగణంలో ప్రతిష్ఠ వివరాలతో ముద్రించిన వాల్ పోస్టర్లు, ఆహ్వానపత్రికలు ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు విగ్రహ ప్రతిష్ఠ వివరాలను వెల్లడించారు. ప్రతిష్ఠ కార్యక్రమానికి కేరళ అయ్యప్ప స్వామి సన్నిధానంలోని శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయం మేల్ శాంతి బ్రహ్మశ్రీ కంఠారరు మహేశ్వరారు మోహనారారు తంత్రి, శ్రీ శబరిమల వంశపారంపర్య ప్రధానతంత్రీ బ్రహ్మశ్రీ కాంఠారారు మోహనా రారు తంత్రి, శబరిమల సుప్రీమ్ ట్రస్ట్ వారి శిష్య బృందంచే ప్రతిష్ఠ పూజ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 3,4 తేదీల్లోలి నిత్య పూజలు చేపట్టనున్నామన్నారు. ఫిబ్రవరి 5 తేదీ ఆదివారం ఉదయం 9:30గం:లకు విగ్రహ పున:ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి వారి ప్రతిష్ఠ, అయ్యప్పస్వామి ఉచ్చా పూజ, హారతి పూజ జరపనున్నామన్నారు. సాయంత్రం7:00 గం:లకు 18మెట్ల పూజతో పాటు పుష్పాభిషేకం, అత్తాగ పూజ, హరివరాసనం కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు.

25 వేల మంది భక్తులకు అన్నదానం

అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా సుమారు 25 వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ జరపనున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొత్వాల శ్రీనివాసరావు, బందెల శ్రీనివాస్, మిరియాల కమలాకర్, బండి లక్ష్మణ్, కనగాల రాంబాబు, కాల్వ భాస్కర్ రావు, మేడిద సంతోష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడవల్లి కేంద్రంలో 240 మందికి కంటి పరీక్షలు

- 186 ముందుకు చుక్కలు మందులు
- 44 మందికి కళ్ళద్దాలు పంపిణీ

నవతెలంగాణ-అశ్వారావుపేట

గురువారం ప్రారంభించిన కంటి వెలుగు శిబిరంలో శుక్రవారం నాటికి మొత్తం 240 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు గుమ్మడవల్లి పి.హెచ్.సి వైద్యాధికారి, కంటి వెలుగు పర్యవేక్షణ అధికారులు డాక్టర్ మధుళిక, డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇందులో పురుషులు 123 మంది కాగా 117 మంది మహిళలు ఈ శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించుకున్నారు అని వివరించారు.

రకం	పురుషులు	స్త్రీలు	మొత్తం
స్క్రీనింగ్	123	117	240
సాధారణం	66	69	132
కేటరాక్ట్	04	04	08
కార్నియా	-	02	02
థేరియం	08	02	10
మందులు	92	94	186
రీడింగ్ గ్లాసెస్	35	11	46
ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్	14	18	32

మండల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలి

- మండల ఐక్య వేదిక డిమాండ్

నవతెలంగాణ-అశ్వాపురం

మండల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలని శుక్రవారం మండలంలో కూరపాటి చలపతి రావు అధ్యక్షతన జరిగిన మండల ఐక్యవేదికలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ కోసం వివిధ రాష్ట్రాల నుంచి పనుల కోసం వచ్చిన కార్మికులు, మండలంలో మారుమూల ప్రాంతాల నుండి వస్తున్న ప్రజలు పబ్లిక్ టాయిలెట్స్ లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మండలంలో ఆదివారం, సోమవారం రోజుల్లో వారపు సంతకి నిత్యావసర సరుకులు కోసం అనేకమంది జనం వస్తారన్నారు. మరుగుదొడ్ల సౌకర్యం లేక మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తుళ్ళూరి ప్రకాష్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి బిక్షమయ్య, ఉప సర్పంచ్ భూక్యా చందు లాల్, బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, ఆదివాసీ జేఏసీ మండల అధ్యక్షుడు పోడియం అనిల్ కుమార్, దావా వీరస్వామి, బీఎస్పీ జిల్లా నాయకులు బాగవతపు సతీష్ యాదవ్, ఏఐటీయూసీ నాయకులు ఎమ్ సురేందర్ రెడ్డి, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఇసంపల్లి కృష్ణ మాదిగ, తాడిపత్రి భరత్ కుమార్ రెడ్డి,మట్టా వీరభద్రారెడ్డి, రాయపూడి రాజేష్,సాయి, సతీష్,బొబ్బాల నాగేశ్వరరావు, గద్దల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



భార్యపై భర్త దాడి

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



అక్రమ సంబంధం, వరకట్నం, వేధింపులు వెరసి.. చివరకు భార్యను, భార్య కుటుంబ సభ్యులపై భర్త దాడి చేసిన సంఘటన నేపథ్యంలో శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. స్థానిక ఎస్సై రతీష్ తెలిపిన వివరాలు.."ఆళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాచనపల్లి గ్రామానికి చెందిన శైలజకు, అదే గ్రామానికి చెందిన తన మేనమామ ఓర్సు రాంబాబుతో ఏండ్ల క్రితం వివాహం జరిగింది. ఇరువురి కాపురం వివాహమైన సంవత్సర కాలం వరకు సజావుగా సాగింది. అంతా బాగానే ఉందని అనుకునే లోపు ఇదే గ్రామానికి చెందిన ఓ యువతితో వివాహేతర సంబంధం పెట్టుకుని, తరచూ భార్య శైలజను అదనపు వరకట్నం తేవాలని భర్త రాంబాబు వేధించసాగాడు. భార్య పలు మార్లు పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టించిప్పటికీ భర్తలో మార్పు రాలేదు. ఇటీవల కాలంలో అక్రమ సంబంధం ఉన్న యువతిని, భర్త ఇంటికి తీసుకు రావడంతో భార్య మంద లించింది. దాంతో భార్య శైలజను కొట్టి పుట్టింటికి పంపించాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం శైలజ, తన తల్లిదండ్రులు దుంప రాములు, పూలమ్మలను వెంట తీసుకోని భర్త ఇంటికి వెళ్ళింది. వారిపై ఓర్సు రాంబాబు (భర్త), అతని కుటుంబ సభ్యులు విచక్షణారహితంగా గోడ్డలితో, కత్తితో దాడి చేశారు. దాంతో రాములు, పూలమ్మలకు తలలు పగిలి, తీవ్ర గాయాలు కాగా, శైలజకు కంట పై, ముఖం మీద తీవ్ర గాయాలయ్యాయి" అని ఎస్సై తెలిపారు. క్షతగాత్రులు ఆళ్ళపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం శైలజ ఫిర్యాదు మేరకు ఓర్సు రాంబాబు (భర్త), అతని కుటుంబ సభ్యులు ఐదుగురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రతీష్ చెప్పారు.



సీఐటీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-పాల్వంచ

సీఐటీయూ జిల్లా కమిటీ ముద్రించిన 2023 నూతన సంవత్సర వాల్ క్యాలెండర్‌ను పాల్వంచ తహసీల్దార్ రంగప్రసాద్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కోత్వాలా శ్రీనివాస్ సీఐటీయూ పట్టణ కన్వీనర్ కే.సత్య అధ్యక్షతన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ జిల్లాలోని ఉద్యోగులు కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కే.సత్య మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో సీఐటీయూ ఆవిర్భవించిందని దేశవ్యాప్తంగా కార్మిక వర్గం ఐక్యత కోసం దేశ సంక్షేమం కోసం సీఐటీయూ కృషి చేస్తుందని పేర్కొన్నారు. క్యాలెండర్ ఆవిష్కరణ అనంతరం శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు సీఐటీయూ పట్టణ నాయకత్వం క్యాలెండర్లను అన్ని విభాగాల అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు రహీమ్, క్రిష్ణ మూర్తి, రాము, టాగూర్ మధు, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



మున్నూరు కాపు సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఇల్లందు

మున్నూరు కాపు సంఘ 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఐత ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఎమ్మెల్యే బాణోత్ హరిప్రియ హరిసింగ్ నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను రూపొందించడం సంతోషకరమన్నారు. మున్నూరు కాపు సంఘ సమస్యల పరిష్కారం కోసం తన వంతు సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. మున్నూరు సంఘ భవన నిర్మాణానికి స్థలం కేటాయించేందుకు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ను ఘనంగా శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘ పెద్దలు, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్నూరు సంఘ పట్టణ అధ్యక్షులు పింగళి నరేష్, ప్రధాన కార్యదర్శి ఆవుల శ్రీనివాస్, కోశాధికారి ఆకుల చందర్, గౌరవాధ్యక్షులు కొక్కు నాగేశ్వరరావు, ఎస్.రంగనాథ్, దంతాల ఆనంద్, ఉపాధ్యక్షులు తోట లలితా శారదా, పగడాల చందు, సంతోష్, వాసు, యూత్ అధ్యక్ష, కార్యదర్శులు పెద్దినేని రామకృష్ణ, రాజురి వైశాక్, మహిళ అధ్యక్షురాలు కటకం పద్మావతి, సరిత తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి కస్టమర్ హైయరింగ్ సెంటర్‌కు అవార్డు

నవతెలంగాణ-ములకలపల్లి

ములకలపల్లి మండల సమాఖ్య ద్వారా గత రెండేళ్లలో కస్టమర్ హైయరింగ్ సెంటర్ ద్వారా అధికంగా రూ.6,64,134 లాభం పొందిన కారణంగా సెంటర్ నిర్వాహకులు, ఐకేపీ ఏపీఎం రవీందర్‌కు వరంగల్లో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో ఈ అవార్డు దక్కింది. ఈ అవార్డు రావడానికి సహకరించిన సీసీలు, వీవోఏలు, వీవోలు కృషిచేశారని, జిల్లా కలెక్టర్, డీఆర్డీవో ఆదేశాలను తుచ తప్పకుండా పాటించినందుకు ఈ అవార్డు దక్కడం అభినందనీయమన్నారు.

విటమిన్ డి తగ్గితే ఎలా..?



విటమిన్ డి కొవ్వులో కరిగే విటమిన్. ఇది లోపించడం వల్ల గుండె జబ్బులు మాత్రమే కాదు కండరాలు కూడా బలహీనంగా మారిపోతాయని తాజా అధ్యయనం వెల్లడించింది. ఎముకలు, దంతాలు బలంగా ఉండేందుకు ఈ విటమిన్ చాలా అవసరం. కానీ ఈ విటమిన్ లోపం వల్ల కండరాల నష్టం వేగంగా ఉంటుందని కొత్త అధ్యయనం చెబుతోంది. సాధారణంగా వయసు మళ్లిన వారిలో కండరాలు బలహీనంగా మారడం జరుగుతుంది. కానీ విటమిన్ డి లోపం వల్ల అది మరింత ఎక్కువగా ఉంటుందని తేలింది. కాల్సిఫైడ్ టిష్యూ ఇంటర్నేషనల్, మస్క్యులోస్కెలెటల్ రీసెర్చ్‌లో ఈ అధ్యయనం నిర్వహించింది. 50 సంవత్సరాలు పైబడిన దాదాపు 3205 మంది ఈ అధ్యయనంలో పాల్గొన్నారు.

- నాలుగేండ్ల పాటు జరిగిన ఈ అధ్యయనంలో విటమిన్ డి లోపంతో బాధపడుతున్న వ్యక్తుల్లో కండరాల బలహీనత 70 శాతం ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు. విటమిన్ డి సప్లిమెంట్లు తీసుకునే వాళ్ళు, బోలు ఎముక వ్యాధి రోగులు కూడా ఇందులో పాల్గొన్నారు. ఈ విటమిన్ లోపం వల్ల ఎముకలకే కాదు గుండెకి కూడా నష్టం వాటిల్లుతుంది. దీన్ని ఆహార పదార్థాల కంటే సూర్యరశ్మి ద్వారా పొందటం సులభం.

విటమిన్ డి అందించే ఆహార పదార్థాలు: పుట్ట గొడుగులు, పాలు, గుడ్లు, సాల్మన్, సార్డినెస్ చేపలు, కాడ్ లివర్ ఆయిల్.

- విటమిన్ డి ఎముకలని బలోపేతం చేస్తుంది. కండరాలు బలహీనంగా మారకుండా కాపాడుతుంది. ఇవి రెండు వయసు పైబడే కొద్ది జరుగుతాయి. కండరాలు ధృడంగా ఉంచుకునేందుకు మార్గాలు ఉన్నాయి. అవేంటంటే..
- విటమిన్ డి ఉండే ఆహారాన్ని తినడం
- తగినంత కాల్షియం పొందటం
- సాల్మన్, చికెన్, టర్కీ వంటి లీన్ ప్రోటీన్లు తీసుకోవడం
- క్రమం తప్పని వ్యాయామం
- 71 ఏండ్లు అంతకంటే ఎక్కువ వయసు ఉన్న వ్యక్తులకు రోజుకి 800 IU విటమిన్ డి పొందాలి. మిగతా వాళ్ళు రోజుకి 600 IU పొందేలా చూసుకోవాలి. విటమిన్-డి లోపం వల్ల కొందరు విపరీతంగా బరువు పెరిగిపోతారు. మరికొందరిలో ఒత్తిడి, ప్రోస్టేట్ క్యాన్సర్, కొలోన్ క్యాన్సర్ వంటి సమస్యలు ఏర్పడతాయి. కాబట్టి శరీరానికి సూర్యరశ్మి తగిలేలా జాగ్రత్తపడటమే కాకుండా, మీరు తీసుకొనే ఆహారంలో కూడా విటమిన్-డి ఉండేలా డైట్ ప్లాన్ చేసుకోవాలి. అలాగే వ్యాయామం కూడా తప్పనిసరి. స్త్రీలు, వృద్ధులు రెగ్యులర్‌గా విటమిన్-డి స్క్రీనింగ్ చేయించుకోవడం ముఖ్యం. మనం తీసుకునే ఆహారంలోని పోషకాలను, కాల్షియాన్ని శరీరం గ్రహించాలంటే విటమిన్-డి అవసరమవుతుంది.

ఇట్ల చేద్దాం



పాలు స్టవ్ మీద పెట్టి ఏదో ఒక పని చేసుకుంటూ ఉంటారు. ఇంకేముంది అవి కాస్త బుస్సుమని పొంగిపోతాయి. స్టవ్ అంతా పాడైపోతుంది. అది శుభ్రం చేసుకోవడం మరొక తలనొప్పి. అలా పాలు పొంగకుండా ఉండాలంటే పాలు పెట్టిన గిన్నె మీద చెక్క స్పూన్ ఒకటి పెట్టి చూడండి. అవి మరిగినా కూడా పొంగిపోకుండా ఉంటాయట.

కొత్త శిఖరాలను చేరుకుంటుంది

ఐఏఎఫ్ ఫైటర్ పైలట్ అవనీ చతుర్వేది... మన దేశంలో మొదటి మహిళా ఫైటర్ పైలట్లుగా చరిత్ర సృష్టించిన ముగ్గురిలో ఈమె కూడా ఒకరు. అప్పటి నుండి ఆకాశంలో ఎగురుతూనే ఉంది. కొత్త శిఖరాలకు చేరుకుంటూనే ఉంది. అతి త్వరలో భారతదేశం, జపాన్ మధ్య జరిగే మొట్టమొదటి వైమానిక పోరాటంలో తన సుఖోయ్ - 30MKI జెట్‌ను ఎగురవేయనుంది. ఇటువంటి యుద్ధ క్రీడల్లో పాల్గొనే మొదటి మహిళా ఐఏఎఫ్ ఫైటర్ పైలట్ కూడా ఈమే కాబోతుంది. ఈ సందర్భంగా ఆమె గురించి ఒక్కసారి మననం చేసుకుందాం...





అవనీ చతుర్వేది ఐఏఎఫ్ దళ సభ్యురాలిగా భారతదేశం వెలుపల యుద్ధ క్రీడలలో పాల్గొనబోతున్నారు. గతంలోనే భారతదేశపు మొదటి ముగ్గురు మహిళా ఫైటర్ పైలట్లలో ఆమె ఒకరుగా నిలిచి రికార్డు సృష్టించారు. ఈ నెలాఖరులో భారతదేశం, జపాన్‌ల మధ్య జరిగే మొట్టమొదటి వైమానిక పోరాట వ్యాయామంలో ఆమె తన సుఖోయ్-30MKI జెట్‌ను ఎగురవేయనున్నారు. విదేశాల్లో ఇటువంటి వైమానిక యుద్ధ క్రీడల్లో పాల్గొన్న మొదటి ఐఏఎఫ్ మహిళా ఫైటర్ పైలట్‌గా నిలిచి ఆమె మరోసారి రికార్డు బద్దలు కొట్టారు.

ఇదే తొలిసారి

దాదాపు ఏడేండ్ల కిందట దేశ వైమానిక దళంలో ఫైటర్ పైలట్‌లుగా నియమితులైన మొదటి మహిళల సమూహంలో అవనీ కూడా ఉన్నారు. ఇప్పుడు ఇద్దరు మహిళా ఫైటర్ పైలట్లు పాల్గొన్న ఫ్రెంచ్ ఎయిర్ ఫోర్స్‌తో సహా భారతదేశానికి వచ్చే విదేశీ బృందాలతో మహిళా అధికారులు యుద్ధ క్రీడల్లో పాల్గొంటున్నారు. అయితే విదేశాల్లో మహిళా అధికారులు దేశానికి ప్రాతినిధ్యం వహించడం ఇదే తొలిసారి.

జెట్‌ను ఎగురవేయబోతోంది

అవనీ గురించి ప్రస్తుతం చెప్పుకోవల్సిన గొప్ప విషయం సుఖోయ్ - 30MKI జెట్‌ను ఎగురవేయడం. అంతేకాకుండా ఆమె MiG-21 బైసన్ ఫైటర్ జెట్‌లో అర్హత సాధించింది. అలాగే తన హాక్ అడ్వాన్స్‌డ్ జెట్ ట్రైనర్ శిక్షణను కూడా పూర్తి చేసింది. మోహనా సింగ్ జితర్వాల్, భావనా కాంత్‌లతో పాటు ఆమె పోరాటంలో ప్రయాణించిన మొదటి మహిళల్లో ఒకరు.

హైదరాబాద్ అకాడమీలో

మధ్యప్రదేశ్‌కు చెందిన అవనీ 1993 అక్టోబర్‌లో జన్మించింది. తండ్రి దినకర్ చతేర్వేది ఇంజనీర్‌గా చేస్తున్నారు. తల్లి గృహిణి. ఈమె పాఠశాల విద్యను పూర్తి చేసిన తర్వాత బనస్థలి (యూనివర్శిటీ) నుండి బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ డిగ్రీని పూర్తి చేశారు. తర్వాత యూనివర్సిటీ ఏవియేషన్ స్కూల్‌లో ఏవియేషన్ చదివారు. ఐఏఎఫ్ ఫైటర్ స్క్వాడ్రన్‌లో చేరడానికి ముందు ఆమె హైదరాబాద్‌లోని దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో ఆరు నెలల ఇంటెన్సివ్ శిక్షణను పూర్తి చేశారు. 2016లో ఫైటర్ పైలట్‌గా చేరారు. 2018లో MiG-21 నడిపిన మొట్ట మొదటి మహిళా ఫైటర్ పైలట్లలో ఒకరిగా నిలిచారు.

పోరాట స్థానాలలో మహిళలు

"జపాన్ ఎయిర్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్‌తో 2023 జనవరి 12 నుండి 26 వరకు జరిగే తొలి ఎక్సర్‌సైజ్ వీర్ గార్డియన్ 2023 కోసం జపాన్‌లోని హ్యకురి ఎయిర్ బేస్‌కు ఐఏఎఫ్ బృందం రేపు బయలుదేరుతుంది. ఐఏఎఫ్ నాలుగు Su-30 MKI, రెండు C-17తో పాల్గొంటుంది. గ్లోబ్‌మాస్టర్స్, ఒక IL-78 ట్యాంకర్" అని భారత వైమానిక దళ అధికారిక హ్యాండిల్ ట్వీట్ చేసింది. సిబ్బంది చిత్రాలను పంచుకున్నారు. వీర్ గార్డియన్ 2023 జపాన్‌లో జనవరి 16 నుండి జనవరి 26 వరకు ఒమిటమాలోని హ్యకురి ఎయిర్ బేస్, దాని చుట్టుపక్కల ఎయిర్‌స్పేస్‌లో అలాగే సయామాలోని ఇరుమా ఎయిర్ బేస్‌లో జరుగుతుంది. ముఖ్యంగా భారతదేశ మూడు సైనిక శాఖలలో ఐఏఎఫ్ మాత్రమే మహిళలను పోరాట స్థానాల్లో అనుమతిస్తుంది.

పిల్లలు డల్‌గా ఉంటున్నారా..?



బాల్యం అంటేనే ఉల్లాసం, ఉత్సాహం. దీనికి తగ్గట్టుగానే పిల్లలు కూడా ఇంట్లో ఎప్పుడూ సరదాగా, సంతోషంగా ఉంటారు. అలా లేకపోతే పేరెంట్స్ మనసు మనసులో ఉండదు. అయితే కొన్ని సందర్భాల్లో వారు ఉన్నట్టుండి డల్ అయిపోతుంటారు. చెప్పిన మాట వినరు సరికదా ఎప్పుడూ ముభావంగా కనిపిస్తుంటారు. ఇలాంటప్పుడే వారిని ఓ కంట కనిపెట్టాలంటున్నారు నిపుణులు.

ఒంటరిగా ఉంటే: పిల్లల్లో మానసిక సమస్యలకు కారణాలు చాలానే ఉంటాయి. ఎవరైనా బెదిరించడం, లైంగికంగా హింసించడం, చదువులో వెనకబడడం, చదువు, ఇతర విషయాల్లో తల్లిదండ్రులు ఒత్తిడి చేయడం, వారి ఇష్టాయిష్టాలకు విలువివ్వకపోవడం.. వంటివి అందులో కొన్ని. అయితే ఇలా మానసికంగా వ్యాకులత చెందే పిల్లలు.. కుటుంబ సభ్యులకు దూరంగా, ఒంటరిగా ఉండడానికే మొగ్గు చూపుతారని చెబుతున్నారు నిపుణులు. ఇలా వారికి నచ్చిన వ్యక్తుల్ని, వ్యాపకాల్ని తరచూ దూరం పెడుతున్నట్టు గమనిస్తే.. వారి మనసులో ఏదో సమస్య ఉందని తల్లిదండ్రులు గుర్తించాలి. స్నేహంగా మెలుగుతూ అదేంటో తెలుసుకునే ప్రయత్నం చేయాలి. అప్పుడే దానికి సరైన పరిష్కారం చూపి.. వారిని తిరిగి పూర్వపు స్థితికి తీసుకురావచ్చు.

చిరాకు పడుతుంటే: పిల్లల మనసు ఎప్పుడూ ఒకేలా ఉండదు. అప్పుడే నవ్వుతారు, మరు క్షణమే చిరాకు పడతారు. అయితే పిల్లలు ఇలా ప్రవర్తించడం చూస్తుంటే ఒక్కోసారి నవ్వొస్తుంది. 'వాడి కోపమెంతసేపు.. చిటికెలో మాయమైపోతుంది..' అనుకునే తల్లిదండ్రులూ లేకపోలేదు. నిజానికి ఎప్పుడో ఒకసారి ఇలా ప్రవర్తిస్తే పర్లేదు. కానీ తరచూ ఇలాంటి ప్రవర్తన పిల్లల్లో గమనిస్తున్నట్టయితే వారిలో ఏదో మానసిక సమస్య ఉన్నట్టుగా అనుమానించమంటున్నారు నిపుణులు. కాబట్టి వారు చిరాకు పడుతున్నారని, మనం కూడా కోప్పడితే అసలు సమస్య బయటపడదు. ఇలాంటి సమయంలో సంయమనంతో వ్యవహరించి. పిల్లల్ని దగ్గరికి తీసుకుంటే వారు తమ సమస్యను సులభంగా బయటపెట్టగలుగుతారు.

ఆత్మన్యూనత, అభద్రత: సాధారణంగా పిల్లల్లో ఒక రకమైన మొండితనం ఉంటుంది. ఏ విషయంలోనైనా వాళ్లను తక్కువ చేసి మాట్లాడినా, నీ వల్ల కాదన్నా వాళ్లు ఒప్పుకోరు.. పైగా తమ చేతలతో తామే స్మార్ట్ అని నిరూపించుకునే వారూ ఉంటారు. అయితే మానసిక సమస్యలతో ఇబ్బంది పడుతూ.. తల్లిదండ్రులకు చెప్పడానికి సంకోచించే పిల్లలు దీనికి పూర్తి విరుద్ధంగా ప్రవర్తిస్తుంటారని చెబుతున్నారు నిపుణులు. 'నేను ఆ సబ్జెక్టులో రాణించలేను..', 'నాకంత సీన్ లేదు..' అంటూ తమను తాము తక్కువ చేసి మాట్లాడుతుంటారు. ఇలాంటి ఆత్మన్యూనత, అభద్రతా భావంలో కూరుకుపోయిన పిల్లల పట్ల మరింత శ్రద్ధ వహించాలంటున్నారు నిపుణులు. తల్లిదండ్రుల మాటలు, చేతలు సానుకూల దృక్పథం నింపేలా ఉండాలి.

ఆరోగ్యపరంగానూ: మానసిక సమస్యలు ఒక దశలో ఆరోగ్యం పైనా ప్రతికూల ప్రభావం చూపుతుంటాయి. వీటి కారణంగా పిల్లల్లో తరచూ తలనొప్పి, కడుపునొప్పి, అలసట, నీరసం.. వంటి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయంటున్నారు నిపుణులు. అయితే చాలామంది తల్లిదండ్రులు వీటిని సాధారణ సమస్యల్లాగే పరిగణిస్తారు తప్ప.. మానసిక ఒత్తిడి వల్ల అనే అవగాహన వారిలో ఉండకపోవచ్చు. కాబట్టి ఈ విషయం గుర్తించి ఆయా సమస్యల్ని దూరం చేయడానికి చికిత్స ఇప్పిస్తూనే మానసికంగానూ వారిలో ఉన్న సమస్యలేంటో తెలుసుకొని దూరం చేయాలి.

కామారెడ్డి, జగిత్యాల మాస్టర్ ప్లాన్స్ రద్దు

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్/ జగిత్యాలటౌన్

కామారెడ్డి, జగిత్యాల పట్టణ మాస్టర్ ప్లాన్స్ రద్దయ్యాయి.. స్థానికులు, రైతుల పోరాటంతో ప్రభుత్వం, పాలకవర్గాలు దిగొచ్చాయి. శుక్రవారం జరిగిన మున్సిపల్ పాలకవర్గాల సమావేశాల్లో ఇందుకు తీర్మానం చేశారు. కామారెడ్డి మున్సిపల్ డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేస్తున్నట్టు మున్సిపల్ శాఖ ప్రధాన అధికారి అరవింద్ కుమార్ ప్రకటించారు. శుక్రవారం అధికారులతో సమావేశమై మున్సిపల్ మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్‌ను పరిశీలించారు. అలాగే, కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్ సమావేశం ఏర్పాటు చేశారు. మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్‌ను రద్దు చేస్తున్నట్టు తీర్మానం చేశారు. నూతన మాస్టర్ ప్లాన్‌లో రైతుల పొలాలు పోతున్నాయని, 45 రోజులకుపైగా రైతులు నిరసన, ధర్నాలు చేస్తున్న సందర్భంలో వారికి అధికార పార్టీ తప్ప, కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ, బీజేపీ తదితర పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. మాస్టర్‌ప్లాన్‌కు వ్యతిరేకంగా రైతుల నిరసనల సమయంలోనే అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన రైతు పయ్యావుల రాములు చనిపోయారు. దాంతో రైతుల ఐక్య కార్యాచరణ ఆధ్వర్యంలో ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది. కౌన్సిలర్ల రాజీనామాలకు ఒత్తిడి చేశారు. ఈ క్రమంలో చివరకు మున్సిపల్ ప్రధాన కార్యదర్శి కామారెడ్డి నూతన మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు.

ఇది రైతుల విజయం..

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అడ్లూరు గ్రామంలో రైతుల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో రైతులు సమావేశమయ్యారు. కమిటీ నాయకులు మాట్లాడుతూ.. ఇది రైతుల విజయమని తెలిపారు. తదనంతరం టపాకాయలు కాల్చి సంబురాలు చేసుకున్నారు.

జగిత్యాల మాస్టర్ ప్లాన్ రద్దుపై మున్సిపల్ ఏకగ్రీవ తీర్మానం

జగిత్యాల పట్టణంలో నూతన మాస్టర్ ప్లాన్ ముసాయిదా(2041)ను రద్దు చేస్తూ మున్సిపల్ అత్యవసర సమావేశం నిర్వహించి కౌన్సిల్ సభ్యులు తీర్మానం చేశారు. రైతులు 15 రోజులుగా చేస్తున్న ఉద్యమం ఫలించింది. డిసెంబర్ 15న జగిత్యాల పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణి అధ్యక్షతన కౌన్సిల్ సభ్యులు తీర్మానం చేశారు. మాస్టర్ ప్లాన్‌లో జగిత్యాల పరిసర గ్రామాలైన తిమ్మాపూర్, మోతే, తిప్పన్నపేట్, నర్సింగాపూర్, హస్నాబాద్, పలు గ్రామాల భూములను మాస్టర్ ప్లాన్‌లో కలుపుతూ ప్రవేశపెట్టారు. దాంతో భూములను కోల్పోతున్న రైతులు తీవ్ర ఆందోళన చెందారు. ఆయా గ్రామాల ప్రజలు ఏకతాటిపై జేఏసీగా ఏర్పడి ఆందోళనలు చేపట్టారు. ఈ క్రమంలో సర్పంచులతోపాటు వార్డు సభ్యులు రాజీనామాలకు సైతం సిద్ధపడ్డారు. గురువారం జగిత్యాల జిల్లా కేంద్రాన్ని నాలుగు వైపులా నిర్బంధిస్తూ రోడ్లపై నిరసన వ్యక్తం చేస్తూ కొత్త మాస్టర్ ప్లాన్ కాపీలను దగ్ధం చేశారు. వారికి అండగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, బీజేపీ నాయకులు మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దాంతో పాలకవర్గం దిగొచ్చి మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేస్తూ ప్రకటించింది.

31లోగా మెడికల్ సర్టిఫికెట్లు సమర్పించండి

- గర్భిణీ అభ్యర్థులకు టీఎస్ఎల్‌పీఆర్‌బీ సూచన

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

కానిస్టేబుల్, ఎస్సై పోస్టులకు ప్రిలిమినరీ రాతపరీక్ష రాసిన గర్భిణీ అభ్యర్థులు తమ మెడికల్ సర్టిఫికెట్లను ఈనెల 31 లోగా తమకు సమర్పించాలని తెలంగాణ రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) చైర్మెన్ వి.వి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. హైకోర్టు చేసిన సూచనల మేరకు గర్భిణీ అభ్యర్థులకు కానిస్టేబుల్, ఎస్సై దేహదారుఢ్య పోటీల నుంచి మినహాయింపును ఇచ్చిన విషయం తెలిసిందే. కాగా, ఆ అభ్యర్థినులకు తుది రాత పరీక్ష రాయడానికి అనుమతిని చ్చారు. అంతేగాక, తుది రాత పరీక్ష తర్వాతలో నెగ్గిన అభ్యర్థినులు నెల రోజుల తర్వాత తప్పనిసరిగా దేహదారుఢ్య పరీక్షల్లో (పీఎంటీ, పీఈటీ)పా ల్గొని నెగ్గాల్సి ఉంటుందని ఆ సమయంలోనే ప్రకటించారు. ఈ నేపథ్యంలో సదరు పోస్టులకు చెందిన గర్భిణీ అభ్యర్థులు తమ మెడికల్ సర్టిఫికెట్లను బోర్డు సూచించిన దరఖాస్తుతో సహా ఈనెల 31లోపు టీఎస్ఎల్‌పీఆర్‌బీ కార్యాలయం ఇన్వర్డ్ సెక్షన్‌లో సమర్పించాల్సి ఉంటుందని శ్రీనివాసరావు తెలిపారు. ఒకవేళ మెడికల్ సర్టిఫికెట్ సమర్పించకపోతే వారికి ఈ పోస్టుల పట్ల ఆసక్తి లేనట్టుగా పరిగణించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

కొత్త పార్లమెంట్ భవనం ముస్తాబు

మార్చిలో ప్రారంభం

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో కొత్త పార్లమెంట్ భవన నిర్మాణం చివరి దశకు చేరుకుంది. ఆ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కొత్త పార్లమెంట్‌కు చెందిన లేఅవుట్, ఫోటోలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. నూతనంగా నిర్మించిన పార్లమెంట్ సముదాయ బిల్డింగ్‌లను బడ్జెట్ సెషన్ రెండవ భాగంలో ఓపెన్ చేసే అవకాశాలు ఉన్నాయి. మార్చిలో ఈ బిల్డింగ్‌లను ప్రారంభించనున్నట్టు తెలుస్తోంది. సెంట్రల్ విస్టా రీడెవలప్మెంట్ ప్రణాళికలో భాగంగా కొత్త పార్లమెంట్ భవనాన్ని నిర్మిస్తున్నారు. టాటా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ ఈ పనులు చేపడుతోంది. అత్యంత విశాలమైన హాల్స్, లైబ్రరీతో పాటు పార్కింగ్‌కు కావాల్సినంత స్థలాన్ని కల్పిస్తున్నారు. హాల్స్, ఆఫీసు రూములన్నీ ఆధునిక టెక్నాలజీకి తగ్గట్టు నిర్మించారు. కొత్త పార్లమెంట్ భవనంలో 888 సీట్లు కెపాసిటీతో లోక్‌సభ హాల్‌ను నిర్మించారు. ఇక రాజ్యసభ హాల్‌ను లోటస్ థీమ్ తరహాలో నిర్మించారు. రాజ్యసభలో 384 మంది సభ్యులు కూర్చునే రీతిలో కట్టారు.ప్రస్తుతం ఉన్న పార్లమెంట్ భవనాల సమీపంలోనే కొత్త పార్లమెంట్ బిల్డింగ్‌ను నిర్మించారు. అన్ని హంగులతో కాన్‌స్టిట్యూషన్ హాల్‌ను తీర్చిదిద్దారు. లేటెస్ట్ కమ్యూనికేషన్స్ టెక్నాలజీతో అన్ని ఆఫీసుల్ని నిర్మించారు. కమిటీ రూముల్లో అత్యాధునిక ఆడియో విజువల్ సిస్టమ్స్ ఉంటాయి.

నూతన పార్లమెంట్ భవనం విశేషాలు

పార్లమెంటు నూతన భవనానికి హెచ్‌సీపీ డిజైన్, ప్లానింగ్ అండ్ మేనేజ్‌మెంట్ ప్రయివేట్ లిమిటెడ్ రూపకల్పన చేసింది. నూతన పార్లమెంట్ భవన నిర్మాణం కోసం రూ.971 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ భవనానికి ఆరు ప్రవేశ మార్గాలు ఉంటాయి. 1. రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, 2. లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మెన్, ఎంపీలు, 3. సాధారణ ప్రవేశ మార్గం, 4. ఎంపీల కోసం మరొక ప్రవేశ మార్గం, 5, 6 ప్రజల ప్రవేశ మార్గాలుగా నిర్ణయించారు.ఈ భవనాన్ని నాలుగు అంతస్తులతో నిర్మిస్తున్నారు. 64,500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో దీనిని నిర్మిస్తున్నారు. లోక్‌సభ ఛాంబర్‌లో 888 సీట్లు ఉంటాయి. దీని మొత్తం వైశాల్యం 3,015 చదరపు మీటర్లు. రాజ్యసభ చాంబర్లో 384 సీట్లు ఉంటాయి. దీని వైశాల్యం 3,220 చదరపు మీటర్లు. భూకంపాలను తట్టుకునే విధంగా ఈ నూతన భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ నూతన భవనంలో 120 కార్యాలయాలను ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంటుంది. కమిటీ సమావేశ మందిరాలు, పార్లమెంటరీ వ్యవహారాల ప్రధాన కార్యాలయాలు, లోక్‌సభ సచివాలయం, రాజ్యసభ సచివాలయం, ప్రధాన మంత్రి కార్యాలయం, కొందరు ఎంపిల కార్యాలయాలు, సిబ్బంది, భద్రతా సిబ్బంది కోసం ప్రత్యేక గదులు ఉంటాయి. ఫర్నిచర్‌లోనే స్మార్ట్ డిస్‌ప్లేస్ సదుపాయాలు ఉంటాయి. ఒక భాష నుంచి మరొక భాషకు అనువదిండానికి డిజిటల్ సదుపాయాలు ఉంటాయి. ప్రోగ్రామబుల్ మైక్రోఫోన్స్, రికార్డింగ్ సదుపాయాలు ఉంటాయి. సభ్యులు బిల్లులపై సులువుగా ఓటు వేయడానికి వీలుగా బయోమెట్రిక్స్ ఉంటాయి. సాంస్కృతిక వైవిధ్యం కూడా కనిపిస్తుంది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 200 మందికి పైగా కళాకారులు ఈ నిర్మాణంలో పాలుపంచుకుంటారు. ప్రస్తుత పార్లమెంటు భవనాన్ని పురావస్తు సంపదగా పరిరక్షిస్తారు. 93 ఏళ్ళనాటి ప్రస్తుత పార్లమెంటు భవనానికి బదులుగా ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు.

సెంట్రల్ ఫ్లోర్ పై భాగంలో 9,500 కిలోల బరువు, 6.5 మీటర్ల ఎత్తు గల జాతీయ చిహ్నాన్ని కాంస్యంతో తయారు చేసి ఏర్పాటు చేశారు. చిహ్నానికి సపోర్టుగా 6,500 కిలోల బరువున్న ఉక్కుతో కూడిన సహాయక నిర్మాణం చేశారు. ఈ జాతీయ చిహ్నం కాన్సెప్ట్ స్కెచ్, కాస్టింగ్ ప్రక్రియ క్లే మోడలింగ్, కంప్యూటర్ గ్రాఫిక్ నుంచి కాంస్య కాస్టింగ్, పాలిషింగ్ వరకు ఎనిమిది విభిన్న దశల తయారీ సాగింది.

డ్రోన్‌తో రెండు మృతదేహాల గుర్తింపు

(మొదటిపేజీ తరువాయి)

స్వాధీనం చేసుకున్నారని సమాచారం. మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఎముకలు, టీత్ పరీక్ష ద్వారానే వారు ఎవరనేది గుర్తించే అవకాశముంది. అగ్నిప్రమాదంపై కేసులు నమోదు చేసిన అధికారులు అన్ని కోణా ల్లో విచారణ చేపట్టారు. జీహెచ్ఎంసీ అధికారులు బిల్డింగ్‌ను పరిశీలించారు.

షార్ట్ సర్క్యూట్ కాదు.. : డీఈ

అగ్నిప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల జరగలేదని ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ డీఈ శ్రీధర్ తెలిపారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఏ అగ్నిప్రమాదం జరిగినా షార్ట్ సర్క్యూట్ మూలంగానే అనడం పరిపాటి అయిపోయిందన్నారు. మంటలు వ్యాపిస్తున్న సమయంలో మీటర్లలో కరెంటు సరఫరా ఉందని చెప్పారు. ఒకవేళ షార్ట్ సర్క్యూట్ జరిగే ఉంటే సబ్‌స్టేషన్‌లో ట్రిప్ అయ్యేదనీ, కానీ అలా జరుగలేదన్నారు. అలాగే మీటర్లు, తీగలు పూర్తిగా కాలిపోయేవన్నారు. తమ టెక్నికల్ టీం తనిఖీ చేసిన వివరాలు వెల్లడిస్తామన్నారు. సికింద్రాబాద్ టింబర్ డిపోలో ప్రమాదం, రూబీ హోటల్లో జరిగిన ప్రమాదంలోనూ ఎలక్ట్రిసిటీ మీటర్లు కాలిపోలేదన్నారు.

ఆ ఫైల్ ఎక్కడా?

డెక్కన్ మాల్ బిల్డింగ్‌కు సంబంధించిన ఫైల్ విషయంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అధికారుల మధ్య వాగ్వాదం జరిగినట్టు తెలుస్తోంది. ఫైల్ తమ దగ్గర లేదంటే తమ దగ్గర లేదని అధికారులు వాదులాడుకున్నారు. అయితే, ఈ భవనంపై ఇప్పటికే నోటీసులు ఇచ్చామని ఓ అధికారవర్గం చెప్పడం గమనార్హం. మరోవైపు ఆ ఫైల్ దొరికితేనే కూల్చివేతకు సంబంధించి ఓ నిర్ణయం తీసుకోనున్నారని తెలుస్తోంది.

కార్మిక వర్గంపై దాడిని తిప్పికొట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

ఇలా అన్ని దేశాల్లోనూ కార్మికులపై దాడి పెరుగుతున్నదని గుర్తుచేశారు. దీనికి వ్యతిరేకంగా ఆయా దేశాల్లో కార్మికులు పెద్ద ఎత్తున పోరాటాల్లోకి వస్తున్నారని తెలిపారు. ఫ్రాన్సులో గురువారం నిర్వహించిన నిరసనలో నాలుగు లక్షల మంది ఉద్యోగులు పాల్గొన్నారని వివరించారు. భారతదేశం లోనూ బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలనే అవలంభిస్తున్నదనీ, వాటికి వ్యతిరేకంగా దేశంలోనూ పెద్దఎత్తున వ్యతిరేకత వస్తున్నదని తెలిపారు. బ్యాంకింగు, విద్యుత్, తపాలా, కోల్ ఇండియా ఇలా అనేక విభాగాల్లో పనిచేసే ఉద్యోగులు పెద్దఎత్తున ఇటీవలి కాలంలో పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. కార్మికులతోపాటు, రైతులు, వ్యవసాయ కార్మికులకు అనేక సమస్యలున్నాయని తెలిపారు. అందువల్ల వారందరితో విశాల ఐక్య పోరాటాన్ని నిర్మించాలంటూ మహాసభ అభిప్రాయపడిందని వివరించారు. ఆ క్రమంలో ఏప్రిల్ ఐదున ఢిల్లీలో కిసాన్-మజ్దూర్ మార్చ్‌ను నిర్వహించతలపెట్టామని అన్నారు. రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు తమ మహాసభకు హాజరై తమ సంఘీభావాన్ని తెలపటం హర్షణీయమని అన్నారు. బీజేపీయేతర ప్రభుత్వాలున్న రాష్ట్రాలపై కేంద్రం తన దాడిని పెంచిందన్నారు. ప్రధానంగా కార్మికులకు మద్దతుగా ఉంటున్న కేరళలోని ఎల్‌డీఎఫ్‌పై ఈ దాడి మరింత అధికంగా ఉందన్నారు. ఇలాంటి చర్యలను ఖండిస్తూ... ఎల్‌డీఎఫ్ ప్రభుత్వానికి మద్దతునిస్తూ మహాసభలో తీర్మానాన్ని ఆమోదించామని చెప్పారు. శుక్రవారం ఈ రెండు అంశాలపై తీర్మానం చేయడమే కాకుండా నిర్మాణపరమైన అంశాలను లోతుగా చర్చించామని చెప్పారు. సీఐటీయూకు ఇప్పుడున్న శక్తితోపాటు మున్ముందు దేశంలో మరింత బలంగా ఎదగడంపై దృష్టి సారిస్తున్నామని హేమలత ఈ సందర్భంగా వివరించారు. అందుకవసరమైన కార్యాచరణపై కూడా మహాసభలో చర్చిస్తామని అన్నారు. మీడియా సమావేశంలో సీఐటీయూ కర్నాటక రాష్ట్ర కార్యదర్శి ఉమేష్, జాతీయ నాయకులు ఆర్కే రాజ్ పండిట్ పాల్గొన్నారు.

నూతన ఒరవడితో ముందుకు...

(మొదటిపేజీ తరువాయి)

తాము చేపట్టిన పాదయాత్రలు, జీపుజాతాలు కొత్త సంబంధాలను తెచ్చిపెట్టాయన్నారు. వాటిని మరింత విస్తృతం చేసి... ముందుకు సాగుతున్నామని చెప్పారు. కొత్త సంఘాలను రిజిస్టర్ చేశామని వివరించారు. 450 గ్రామాల్లో 6,500 మంది వ్యవసాయేతర కార్మికుల దగ్గరకు వెళ్లి సర్వే నిర్వహించామని వివరించారు. తద్వారా వారి జీవన పరిస్థితులు, ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించామని తెలిపారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయయేతర కార్మికుల సమస్యలపైనా పోరాటాలకు కార్యాచరణ రూపొందించామని చెప్పారు. ఆయా రంగాల వారీగా చేసిన పోరాటాలను ఆయన ఈ సందర్భంగా వివరించారు.

యోగికి షాక్

(మొదటిపేజీ తరువాయి)

తెలిపింది. ముఖ్యమంత్రి సహా రాష్ట్రంలోని సీనియర్ అధికారులు వేధింపులపై పోలీసులను ఆదేశించారని చెప్పేందుకు తగిన సాక్ష్యాధారాలు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే యూపీ ముఖ్యమంత్రి ప్రసంగాలను కూడా ఫిర్యాదులో ప్రస్తావించారు. దాడులపై విచారణ చేపట్టాలంటూ బాధిత కుటుంబాలు, మానవహక్కుల సంఘాలు, దేశీయ న్యాయస్థానాలు, ఐరాస సభ్యులు ఇచ్చిన ఆదేశాలను యూపీ అధికారులు బేఖాతరు చేశారని వెల్లడించింది.

బీజేపీలో చేరండి.. లేదంటే సీఎం బుల్డోజర్ సిద్ధంగా ఉంది

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్ హిందీలో ట్వీట్ చేశారు. ప్రజలు నిర్భయంగా ఓటు వేస్తారని పేర్కొన్నారు. మంత్రి వ్యాఖ్యలు ఆయన నెగెటివ్ మెంటాలిటీని ప్రతిబింబిస్తుందని రఘోగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే జైవర్ధన్‌సింగ్ అన్నారు. "అభివృద్ధికి సంబంధించి బీజేపీ ఎత్తి చూపింది ఏమీ లేదు. ఆ పార్టీ నాయకుడు ఇలాంటి వ్యాఖ్యలు చేశారు. ప్రజల ఐక్యత కోసమే తాము ఎల్లప్పుడు రాజకీయాలు చేస్తాం. వారిని విడగొట్టడానికి కాదు. నగర పాలిక ఎన్నికల్లో కాంగ్రెస్ 24 వార్డులన్నిటిలో విజయం సాధిస్తుంది" అని ఎమ్మెల్యే అన్నారు. సిసోడియాను మంత్రి వ్యాఖ్యలు బీజేపీకే కళంకం తెచ్చాయని గుణ జిల్లా కాంగ్రెస్ చీఫ్ హరిశంకర్ విజయ్‌వర్గీయ అన్నారు.

మంత్రి వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు, ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో బీజేపీ దిద్దుబాటు చర్యలకు దిగింది. అక్రమ కార్యకలాపాల్లో మునిగి ఉన్న వారిని ఉద్దేశించి మంత్రి వ్యాఖ్యలు చేశారనీ, అలాంటి వారి కోసం బుల్డోజర్ ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుందని రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి పంకజ్ చతుర్వేది భోపాల్‌లో అన్నారు. రఘోగర్ అనేది దిగ్విజయ్‌సింగ్ సొంత గడ్డ. ఇక్కడ ఈయన కుమారుడు జైవర్ధన్ సింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాల లాగానే వివిధ నేరాల్లో నిందితులుగా ఉన్న వ్యక్తులకు సంబంధించిన అక్రమ ఇంటి నిర్మాణాలుగా భావింపబడుతున్నవాటిని మధ్యప్రదేశ్ ప్రభుత్వం కూల్చివేస్తున్నది. ఈ కూల్చివేతలను సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ కూడా తరచూ ప్రశంసిస్తూ వచ్చిన విషయం విదితమే.

బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్స్

- వచ్చే విద్యాసంవత్సరంలో అమలు
- ఉన్నత విద్యామండలి చైర్మెన్ లింబాద్రి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డిగ్రీ విద్యలో బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్స్ కోర్సును ప్రవేశపెట్టాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. శుక్రవారం హైదరాబాద్‌లో ఉన్నతవిద్యామండలి పాలకమండలి సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం తనను కలిసిన విలేకర్లతో ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి మాట్లాడుతూ బీఏ ఆనర్స్ (ఎకనామిక్స్), బీఏ ఆనర్స్ (పొలిటికల్ సైన్స్) కోర్సులు నిజాం కాలేజీ, కోఠి మహిళా కాలేజీ, సిటీ కాలేజీ, బేగంపేట మహిళా డిగ్రీ కాలేజీలో ఉన్నాయని చెప్పారు. వచ్చే విద్యాసంవత్సరంలో బీఎస్సీ ఆనర్స్ (కంప్యూటర్ సైన్స్) కోర్సును ప్రవేశపెడతామని వివరించారు. రాష్ట్రంలోని ప్రముఖ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలతోపాటు ప్రయివేటు కాలేజీల్లోనూ ఈ కోర్సును అందుబాటులోకి తెచ్చే ఆలోచన చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, ఓయూ వీసీ డి రవీందర్, శాతవాహన వర్సిటీ వీసీ ఎస్ మల్లేశం, ఎంజీయూ వీసీ సిహెచ్ గోపాల్‌రెడ్డితోపాటు ఇతర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



డబుల్ ఇంజిన్ సర్కార్‌ను తిప్పికొట్టండి..

యువతను పక్కదోవ పట్టిస్తున్న బీజేపీ...

డీవైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు ఏ.ఏ.రహీం

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యువతను పక్కదోవ పట్టిస్తున్నదని డీవైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు ఏ.ఏ.రహీం అన్నారు. సీఐటీయూ అఖిల భారత మహాసభలో ఆయన సందేశాన్ని ఇచ్చారు. మోడీ పాలనలో ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాల హామీని తుంగలో తొక్కారని విమర్శించారు. ఈ నేపథ్యంలో యువత తమ సమస్యలపై పోరాటాల్లోకి రాకుండా మతం పేరుతో కాషాయ పార్టీ.. వారి మెదళ్లల్లో విషం నింపుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని మోడీ సర్కారు అనుసరిస్తున్న తిరోగమన విధానాలకు ప్రత్యామ్నాయంగా కేరళలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం తనదైన



అభివృద్ధి, ప్రజా విధానాలతో ముందుకు సాగుతున్న తీరును ఆయన వివరించారు. యువతను చైతన్య పరిచేలా పోరాటాలను రూపొంది స్తున్నామని చెప్పారు. సీఐటీయూ, రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం చేసే ఐక్యపోరాటాల్లో తాము పాలు పంచుకుంటామని చెప్పారు.



సీఐటీయూ ఆల్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ దేవరాయ్‌తో ముచ్చటిస్తున్న తెలంగాణ ప్రతినిధులు



దేశవ్యాప్తంగా బేవరేజెస్ కార్మికులు చేపట్టిన పోరాటాలను మహాసభలో వివరిస్తున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బీరం మల్లేశ్.



మినిట్స్ రాస్తున్న సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.నాగేశ్వర్‌రావు

కార్మికులు, కర్షకులు ఒక్కటైతే పాలకవర్గాలు నిలబడలేవ్...

- పెట్టుబడిదారీ విధానమే పెద్ద రోగం..
- మన పోరాటం అధికారం కోసం కాదు..ప్రత్యామ్నాయం కోసం : సీఐటీయూ అఖిల భారత మహాసభలో ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్

శ్యామల్ చక్రవర్తి నగర్(బెంగళూరు) నుంచి
నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

శ్రీలంకను అన్ని రకాలుగా దివాళా తీయించి.. ప్రజల జీవితాలతో ఆటలాడుకున్న అక్కడి డబుల్ ఇంజిన్ సర్కారును ప్రజలు వెనక్కి కొట్టారని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ గుర్తు చేశారు. మన దేశంలో కూడా అదే పేరుతో ముందుకొస్తున్న బీజేపీని తిప్పికొట్టాలని కార్మికులు, కర్షకులు, ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. బెంగళూరులోని శ్యామల్ చక్రవర్తి నగర్‌లోని కామ్రేడ్ రంజనా నిరులా, రఘునాథ్‌సింగ్ వేదికగా కొనసాగుతున్న సీఐటీయూ అఖిల భారత 17వ మహాసభలో విజ్జు కృష్ణన్ శుక్రవారం సౌహార్ద్ర సందేశమిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు చట్టాలకు వ్యతిరేకంగా అన్నదాతలంతా కలిసికట్టుగా పోరాడి ప్రధాని మోడీతో క్షమాపణలు చెప్పించారని గుర్తు చేశారు. వారి పోరాట పటిమ ఆయా చట్టాలను వెనక్కి తీసుకునేలా



చేసిందని తెలిపారు. రైతాంగ పోరాటానికి కార్మికులు అండగా నిలబడినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. మహారాష్ట్రలో విద్యుత్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు పోరాడి విజయం సాధించారని గుర్తుచేశారు. ఇలాంటి పోరాటాలు దేశవ్యాప్తంగానూ మొదలయ్యాయని వివరించారు. భవిష్యత్‌లో కార్మికులు, కర్షకులు ఐక్యతతో ముందుకు సాగాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు. అలా ముందుకు సాగితే పాలకవర్గాలు నిలబడలేవని హెచ్చరించారు.

నయా ఉదారవాద విధానాల వల్ల రైతుల్లో తీవ్ర నైరాశ్యం నెలకొందని చెప్పారు. ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన తర్వాత నాలుగు లక్షల మందికిపైగా అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ సర్కారు వచ్చాక ఈ ఆత్మహతలు మరింత ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికలు, అధికారం కోసం కాకుండా ఆధిపత్యవాద ధోరణిని తిప్పికొట్టి ప్రత్యామ్నాయ విధానాల రూపకల్పన, సమాజమార్పు దిశగా పోరాడాలని రైతులకు పిలుపునిచ్చారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా మనదేశంలోనేగాక ఫ్రాన్స్, పెరూ, శ్రీలంక దేశాల్లో కొనసాగుతున్న పోరాటాలను విజ్జు కృష్ణన్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. 'పెట్టుబడిదారీ వ్యవస్థ అనేది ప్రజల సమస్యలకు చికిత్సా కాదు.. మందు అంతకంటే కాదు..అదొక పెద్ద రోగం.. అది విస్తరించేకొద్దీ మనుషుల మధ్య అంతరాలు పెరిగిపోతాయి...' అని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.



ఢోలు వాయిస్తున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమ

బీజేపీని ఓడించడం అత్యంత అవసరం..

ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు వీపీ సానూ

విధానపరమైన మార్పు కోసం కొనసాగుతున్న పోరాటాల్లో తామూ పాల్గొంటామని ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు వీపీ సానూ చెప్పారు. ఇప్పుడున్న ప్రమాదకర పరిస్థితుల్లో బీజేపీని ఓడించడం అత్యంత అవసరనమని ఆయన నొక్కి చెప్పారు. బెంగళూరులో కొనసాగుతున్న సీఐటీయూ అఖిల భారత 17వ మహాసభలో ఆయన శుక్రవారం సౌహార్ద్ర సందేశమిచ్చారు. ఇటలీ తరహాలో ఫాసిస్టు విధానాలను భారతదేశంలో అమలు చేసేందుకు మతతత్వ శక్తులు కుట్రలు చేస్తున్నాయని చెప్పారు. రంగు, మతం, ప్రాంతం, కులం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టి బీజేపీ రాజకీయ లబ్ది పొందుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అందులో భాగంగానే నూతన జాతీయ విద్యా విధానాన్ని(ఎన్‌ఈపీ) కేంద్రం తీసుకొచ్చిందన్నారు. ఎన్‌ఈపీపై పార్లమెంట్‌లో కూడా చర్చించలేదని గుర్తు చేశారు. దొడ్డిదారిన దాన్ని మోడీ సర్కారు అమలు చేస్తున్నదని విమర్శించారు. లేబర్ కోడ్‌లతో కార్మికవర్గాన్ని, నూతన వ్యవసాయ చట్టాలతో రైతులను ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నిస్తున్నదని చెప్పారు. ఇలాంటి ధోరణి దేశానికే ప్రమాదకరమని హెచ్చరించారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ బీజేపీ ఓడించాలనే సంకల్పంతో ముందుకు సాగాలని సానూ పిలుపునిచ్చారు.



ప్రత్యామ్నాయ విధానాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలి

అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు ఎ.విజయరాఘవన్

కేంద్రంలోని బీజేపీ అనుసరిస్తున్న నయా ఉదారవాద, మతోన్మాద విధానాలకు ప్రత్యామ్నాయంగా అభ్యుదయ, అభివృద్ధితో కూడిన విధానాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాల్సిన గురుతర బాధ్యత ఏఐకేఎస్ (రైతులు), ఏఐఏడబ్ల్యూయూ (వ్యవసాయ కార్మికులు), సీఐటీయూ(కార్మికులు)పై ఉందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు ఎ.విజయరాఘవన్ అన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఆ మూడు సంఘాలు ఐక్య పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. బెంగళూరులో కొనసాగుతున్న సీఐటీయూ అఖిల భారత 17వ మహాసభలో ఆయన శుక్రవారం సౌహార్ద్ర సందేశమిచ్చారు. కార్పొరేట్, కమ్యూనల్ (మతోన్మాద) ఎజెండాతో ముందుకెళ్తున్న బీజేపీ విధానాలను తిప్పికొట్టాలన్నారు. ఐక్య పోరాటాలకు ఏప్రిల్ ఐదోతేదీన జరిగే చలో ఢిల్లీ కార్యక్రమం తొలిమెట్టు కావాలని ఆకాంక్షించారు. మతోన్మాదంతో దేశంలో చిచ్చుపెడుతున్న బీజేపీ ప్రజలకు ఏవిధంగా నష్టం చేకూరుస్తున్నదనే విషయాలను ప్రజలకు అర్థమయ్యేలా విడమర్చి చెప్పాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులు, అసంఘటిత కార్మికులే



ఎక్కువగా ఉంటారనీ, వారిమధ్య ఐక్యత సాధించలేకపోతే పోరాటాలను ముందుకు తీసుకుపోలేమని చెప్పారు. కార్పొరేట్లు, బీజేపీ ములాఖత్ అయ్యి... ప్రజల మధ్య చీలిక తెస్తున్నారని వివరించారు. తద్వారా కార్మికవర్గ ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారని తెలిపారు. ఇలాంటి విషయాలన్నింటినీ కార్మికులకు అర్థమయ్యేలా వివరించాలని విజయ రాఘవన్ సూచించారు.

నవచిత్రం

పిల్లలకు చూపించాల్సిన సినిమా

సుహాస్ నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ రైటర్ పద్మభూషణ్. ఈ చిత్రం ఫిబ్రవరి 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. నూతన దర్శకుడు షణ్ముఖ ప్రశాంత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో టీనా శిల్పరాజ్ కథానాయిక. అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర, చంద్రు మనోహర్ నిర్మాతలు కాగా జి. మనోహరన్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. శుక్రవారం ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది. ఈ ఈవెంట్‌లో హీరో అడివి శేష్ ట్రైలర్ ని లాంచ్ చేశారు.

ఈ సందర్భంగా నిర్మాత అనురాగ్ మాట్లాడుతూ,'రైటర్ పద్మభూషణ్'తో పాటు మరో నాలుగు సినిమాలు అంతా కొత్తవారితోనే ఫైనల్ అయ్యాయి. సుహాస్‌ని యూట్యూబ్‌లో సపోర్ట్ చేశారు. ఓటీటీలో సపోర్ట్ చేశారు. ఇప్పుడు బిగ్ స్క్రీన్ పై సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. అందరూ మీ 'పేరెంట్స్'తో కలిసి ఈ సినిమా చూడాలని మా విన్నపం' అని అన్నారు.

'శరత్, అనురాగ్, చంద్రుకి కృతజ్ఞతలు. శరత్, అనురాగ్ లేకపోతే నేను లేను. ఇంతమంచి సినిమాని నా దగ్గరకి తీసుకొచ్చిన ప్రశాంత్‌కి కృతజ్ఞతలు. మ్యూజిక్ చేసిన శేఖర్ చంద్రకి, బిజియం చేసిన కళ్యాణ్‌కి, ఎడిటర్ పీకేకి, డీవోపీ వెంకట్ రమణకి కృతజ్ఞతలు. ఇది నా మొదటి థియేట్రికల్ రిలీజ్ సినిమా. సినిమా చూసిన వచ్చిన తర్వాత ఖచ్చితంగా రెండు, మూడు గంటలు హ్యాంగోవర్‌లో ఉంటారు' అని సుహాస్ చెప్పారు. దర్శకుడు షణ్ముఖ ప్రశాంత్ మాట్లాడుతూ, 'ఛాయ్ బిస్కెట్, లహరి ఫిలిమ్స్‌తో నా మొదటి సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాని ఒక ఫ్యామిలీ కోసం స్పెషల్ షో వేశాం. 'పిల్లలకి చూపించాల్సిన సినిమా ఇది' అని ప్రసంశించారు. ఇది నేను ఇప్పటివరకూ అందుకున్న బెస్ట్ కాంప్లీమెంట్. క్లాప్స్‌తో పాటు క్యాష్ తీసుకొచ్చే చిత్రమిది. మీ అందరికీ తప్పకుండా నచ్చుతుంది' అని చెప్పారు.

నిర్మాతలు శరత్, చంద్రు మాట్లాడుతూ, "మేజర్' లాంటి పెద్ద సినిమాని ఎ ప్లస్ ఎస్ మూవీస్ బ్యానర్‌లో చేశాం. ఈ సినిమాకి దాదాపు అందరూ కొత్తవాళ్ళే చేశారు. సుహాస్‌కి ఇది తొలి థియేటర్ రిలీజ్ మూవీ. లహరి మ్యూజిక్ 35 ఏళ్లుగా మ్యూజిక్ ఇండస్ట్రీలో ఉంది. తొలిసారి ఈ చిత్రంతో ప్రొడక్షన్ చేయడం, మా ఛాయ్ బిస్కెట్‌తో అసోసియేట్ కావడం ఆనందంగా ఉంది' అని తెలిపారు.



'రైటర్ పద్మభూషణ్' చిత్ర బృందం

సీనియర్ నిర్మాత సూర్యనారాయణ ఇకలేరు



సూర్య నారాయణ

తెలుగు చిత్ర సీమలో మరో విషాదం చోటు చేసుకుంది. ఇటీవల కృష్ణంరాజు, కృష్ణ, కైకాల సత్యనారాయణ, చలపతిరావు వంటి హేమాహేమీలను కోల్పోయిన చిత్ర సీమ సీనియర్ నిర్మాత సూర్యనారాయణను కోల్పోయింది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం తుదిశ్వాస విడిచారు. పలు భిన్న సినిమాల నిర్మాణంతో అభిరుచిగల నిర్మాతగా పేరొందిన ఆయన ఎన్టీఆర్‌తో 'అడవిరాముడు' వంటి భారీ బ్లాక్‌బస్టర్ చిత్రాన్ని నిర్మించారు. శ్రీ సత్యచిత్ర బ్యానర్‌పై తహసిల్దార్ గారి అమ్మాయి (1971), ప్రేమ బంధం (1976), అడవిరాముడు (1977), కుమార రాజా (1978), కొత్త అల్లుడు (1979), కొత్తపేట రౌడీ (1980), ఏది ధర్మం ఏది న్యాయం (1982), ఉద్ధండుడు (1984), భలే తమ్ముడు (1985) తదితర చిత్రాలను నిర్మించారు. ఎన్టీఆర్, శోభన్ బాబు, కృష్ణ, బాలకృష్ణలతో సినిమాలను నిర్మించి మంచి విజయాలను అందుకున్నారు. 'కుమార రాజా' చిత్రంలో హీరో కృష్ణ త్రిపాత్రాభినయం చేస్తే, 'కొత్త అల్లుడు' సినిమాలో చిరంజీవి విలన్‌గా నటించటం విశేషం. బాలీవుడ్ బిగ్‌బి అమితాబ్ బచ్చన్‌తో 'మహాన్' చిత్రాన్ని నిర్మించిన సూర్యనారాయణ మృతి పట్ల సినీ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

భిన్న కాన్సెప్ట్‌తో పాప్‌కార్న్

అవికా గోర్, సాయి రోనక్ జంటగా నటిస్తున్న చిత్రం 'పాప్ కార్న్'. ఎం.ఎస్.చలపతి రాజు సమర్పణలో ఆచార్య క్రియేషన్స్, అవికా స్క్రీన్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై భోగేంద్ర గుప్తా (నెపోలియన్, మా ఊరి పొలిమేర చిత్రాల నిర్మాత) ఈ సినిమాను నిర్మిస్తున్నారు. హీరోయిన్ అవికా గోర్ ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరించటం విశేషం.

మురళి గంధం దర్శకత్వం వహిస్తున్నారు. ఫిబ్రవరి 10న సినిమాను గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు. తాజాగా 'మది విహంగమయ్యే...' అనే లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు హీరో నాగ చైతన్య. సినిమా పెద్ద సక్సెస్ కావాలని ఆయన యూనిట్‌కి అభినందనలు తెలిపారు.

శ్రవణ్ భరద్వాజ్ సంగీతం అందించిన ఈ పాటను శ్రీజో రాయగా, బెన్నీ దయాల్, రమ్యా బెహ్రా చక్కగా ఆలపించారు. ఈ సందర్భంగా సమర్పకుడు ఎం.ఎస్.చలపతి రాజు మాట్లాడుతూ, 'ఇప్పటి వరకు రానటువంటి ఓ డిఫరెంట్ కాన్సెప్ట్ మూవీ. సినిమా అంతా లిఫ్టులోనే ఉంటుంది. ముఖ్యంగా చివరి 45 నిమిషాలు అయితే సీట్ ఎడ్జ్ మూవీలా ఉంటుంది. పెద్దలకు వారి యంగ్ ఏజ్ గుర్తుకు వస్తుంది. ఇప్పటి యువతకు కూడా కనెక్ట్ అవుతుంది. అన్ని రకాల ఎమోషన్స్ ఉన్న సినిమా. డైరెక్టర్ మురళి గంధం టేకింగ్‌ను అందరూ తప్పకుండా అప్రిషియేట్ చేస్తారు' అని అన్నారు.

'డిఫరెంట్ మూవీ. డైరెక్టర్ మురళిగారు నెరేషన్ వినగానే ఓకే చెప్పేశాను. ఈ సినిమాకు నిర్మాతగా కూడా వ్యవహరించాను. కొత్త కాన్సెప్ట్ చిత్రాలను తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం ఉంది. ఫిబ్రవరి 10న పాప్ కార్న్‌తో సందడి చేయబోతున్నాం' సినిమాకు కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరించిన అవికా గోర్ చెప్పారు.

హీరో సాయి రోనక్ మాట్లాడుతూ, "సినిమా ప్రారంభమైన పది నిమిషాలకే ప్రేక్షకులు సినిమాలోకి లీనమైపోతారు. ఇక చివరి 45 నిమిషాలైతే సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌గా మూవీ అలరిస్తుంది' అని చెప్పారు.



సాయి రోనక్, అవికాగోర్

ఆటలు

సిరీస్ పట్టేస్తారా?

- కివీస్‌తో భారత్ రెండో వన్డే నేడు
- మ॥ 1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

నవతెలంగాణ-రాయ్‌పూర్

2016, 2017 భారత్‌తో వన్డే సిరీస్‌లను నిర్ణయాత్మక మ్యాచ్‌లకు తీసుకెళ్లింది న్యూజిలాండ్. 2023 వన్డే సిరీస్ ఫలితం నిర్ణయాత్మక మ్యాచ్‌కు ముందే తేల్చేయాలని టీమ్ ఇండియా భావిస్తోంది. తొలి వన్డే చివరి ఓవర్ థ్రిల్లర్‌లో భారత్ విజయం సాధించి 1-0 ఆధిక్యం నిలిచింది. రాయ్‌పూర్ వన్డేలోనూ నెగ్గి సిరీస్‌ను సొంతం చేసుకునేందుకు రోహిత్‌సేన సిద్ధమ వుతోంది. సిరీస్‌ను సమం చేసేందుకు న్యూజిలాండ్ సైతం ఎదురు చూస్తుండగా.. నేడు మరో ఉత్కంఠ పోరుకు రంగం సిద్ధం.

బౌలింగ్ మెరుగయ్యేనా?

శుభ్‌మన్ గిల్ ద్వి శతకంతో హైదరాబాద్‌లో భారత్ భారీ స్కోరు సాధించింది. కానీ ఇతర బ్యాటర్లలో ఎవరూ 35 పరుగుల మార్క్ దాటలేదు. అటు బౌలింగ్ విభాగంలో మహ్మద్ సిరాజ్ మినహా ఎవరూ మెప్పించలేదు. ఆరు వికెట్లను కూల్చి గెలుపు లాంఛనం చేసుకున్న తరుణంలో బౌలర్లు లోయర్ ఆర్డర్‌కు తలొగ్గారు. వన్డే వరల్డ్‌కప్ ముంగిట భారత్‌కు ఈ బలహీనత మంచిది కాదు. వాషింగ్టన్ సుందర్ బంతితో అంచనాలను అందుకోవాల్సి ఉంది. కుల్దీప్ చక్కగా మాయ చేస్తున్నాడు. షమి, శార్దుల్ మెరిస్తే పేస్ విభాగంలో సమస్య ఉండదు. కెప్టెన్ రోహిత్ శర్మ ఇషాన్ కిషన్ మెగా ఇన్నింగ్స్‌లపై కన్నేసి నేడు బరిలోకి దిగుతున్నారు.

సమం చేస్తారా?

ఓటమి ఖాయమైన మ్యాచ్‌లో గెలుపు అంచుల వరకూ వెళ్లిన న్యూజిలాండ్.. నేడు రాయ్‌పూర్‌లో ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. టాప్ ఆర్డర్‌లో కీలక బ్యాటర్లు అంచనాల మేరకు రాణిస్తే సిరీస్‌పై ఆశలు సజీవంగా నిలుపుకోవచ్చు. కెప్టెన్ టామ్ లేథమ్, మైకల్ బ్రేస్‌వెల్, ఫిన్ అలెన్, డెవాన్ కాన్వేలు కివీస్‌కు కీలకం కానున్నారు. గాయం నుంచి కోలుకున్న ఇశ్ సోధి నేడు తుది జట్టులోకి రానున్నాడు.



మెద్వడేవ్ ఔట్

ప్రీ క్వార్టర్స్‌లో ఇగా స్వైటెక్
ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్ స్లామ్‌లో సంచలనాల మోత మోగుతోంది. స్పెయిన్ బుల్ రఫెల్ ఇదివరకే నిష్క్రమించగా, తాజాగా 2021, 2022 రన్నరప్ డానిల్ మెద్వదేవ్ (రష్యా) సైతం ఇంటిముఖం పట్టాడు. మెన్స్ సింగిల్స్ మూడో రౌండ్లో అమెరికా ఆటగాడు సెబాస్టియన్ చేతిలో ఓటమి పాలయ్యాడు. 7-6(9-7), 6-3, 7-6(7-4)తో వరుస సెట్లలో మెద్వదేవ్‌పై సెబాస్టియన్ సంచలన విజయం సాధించాడు. జపాన్ ఆటగాడు నిషియోక ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. నడాల్‌ను ఓడించిన మెక్‌డొనాల్డ్‌పై 7-6(8-6), 6-3, 6-2తో వరుస సెట్లలో గెలుపొందాడు. గ్రీసు స్టార్ స్టెఫానోస్ సిట్సిపాస్ 6-2, 7-6(7-5), 6-3తో వరుస సెట్లలో టాల్లాన్‌పై విజయంతో ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. జానిక్ సిన్నర్ ఐదు సెట్ల పోరులో 4-6, 4-6, 6-1, 6-2, 6-0తో మార్టన్‌పై మెరుపు విజయం సాధించాడు.



మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ ఇగా స్వైటెక్ 6-0, 6-1తో అలవోక విజయం సాధించింది. స్పెయిన్ భామ క్రిస్టినాను చిత్తుగా ఓడించి ప్రీ క్వార్టర్స్‌లో కాలు మోపింది. అమెరికా చిన్నది కోకో గాఫ్ 6-3, 6-2తో సహచర క్రీడాకారిణి బెర్నార్డా పెరాపై గెలుపొందింది. విక్టోరియా అజరెంక 1-6, 6-2, 6-1తో అమెరికా స్టార్ మడిసన్ కీస్‌పై గెలుపొందింది. మూడో సీడ్ జెస్సికా పెగులా 6-0, 6-2తో మార్టాను మట్టికరిపించింది.

ఢిల్లీ దంచికొట్టగా..

ముంబయిపై చారిత్రక విజయం

న్యూఢిల్లీ : రంజీ ట్రోఫీలో ఢిల్లీ చరిత్ర సృష్టించింది!. 43 ఏండ్లలో తొలిసారి ముంబయిపై రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో ఓ విజయం రుచి చూసింది. 1979-80 రంజీ సీజన్ నుంచి ముంబయి, ఢిల్లీలు 20 మ్యాచుల్లో తలపడ్డాయి. ఈ మ్యాచులను ఢిల్లీ డ్రా, ఓటమితో ముగిం చింది. సెలక్షన్ ప్రక్రియ రచ్చకెక్కగా ఈ సీజన్‌లో ఢిల్లీ రంజీ జట్టు హైదరాబాద్ తరహాలో చెత్త ప్రదర్శన చేసింది. కానీ ఆరో రౌండ్ మ్యాచ్‌లో ముంబయిపై ఢిల్లీ మాయ చేసింది. నాల్గో రోజు ఆటలో 95 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ 2 రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. బ్యాటర్లు దూకుడుగా రాణించటంతో తొలి ఇన్నింగ్స్‌లో 369 పరుగులు చేసిన ఢిల్లీ.. అంతకముందు ముంబయిని తొలి ఇన్నింగ్స్‌లో 293 పరుగులకు ఆలౌట్ చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో ముంబయి 170 పరుగులకే కుప్ప కూలగా, ఢిల్లీ 43 ఏండ్లలో తొలిసారి రంజీ ట్రోఫీ 41 సార్లు చాంపియన్ ముంబయిపై జయభేరి మోగించింది. రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్-బి చివరి రౌండ్ మ్యాచ్‌లో హైదరాబాద్‌తో ఢిల్లీ తలపడనుంది. ఈ మ్యాచ్‌కు ఉప్పల్ స్టేడియం వేదిక కానుంది.





భారత్‌కు భారీ జరిమానా

మ్యాచ్ ఫీజులో 60 శాతం కోత

హైదరాబాద్ : ఉత్కంఠగా సాగిన హైదరాబాద్ వన్డేలో టీమ్ ఇండియా విజయం సాధించినా, మ్యాచ్ ఫీజులో భారీ మొత్తాన్ని కోల్పోయింది. భారత్, న్యూజిలాండ్ తొలి వన్డేలో ఆతిథ్య జట్టు స్లో ఓవర్‌రేట్ కింద జరిమానాకు గురైంది. ఐసీసీ క్రమశిక్షణ నియామవళి ప్రకారం ఆర్టికల్ 2.22 కింద నిర్దేశిత సమయానికి భారత్ 3 ఓవర్లు వెనుకంజలో నిలిచింది. నిబంధనల ప్రకారం ఆలస్యమైన ప్రతి ఓవర్‌కు మ్యాచ్ ఫీజులో 20 శాతం కోత విధిస్తారు. ఈ లెక్కన భారత క్రికెటర్ల మ్యాచ్ ఫీజులో ఏకంగా 60 శాతం మొత్తాన్ని జరిమానాగా విధించారు. ఫీల్డ్ అంపైర్లు నితిన్ మీనన్, అనిల్ చౌదరి సహా థర్డ్ అంపైర్ కెఎన్ అనంత పద్మనాభం, ఫోర్త్ అంపైర్ జయరామన్ మదన్‌గోపాల్ నివేదిక మేరకు..మ్యాచ్ రిఫరీ జవగళ్ శ్రీనాథ్ విధించిన జరిమానాను భారత కెప్టెన్ రోహిత్ శర్మ అంగీకరించాడు. దీంతో ఈ అంశంలో ఎటువంటి విచారణ ఉండదని ఐసీసీ ఓ ప్రకటనలో తెలిపింది.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886